ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-8-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 206 పేజీలు: 12 వెల: 6.50

గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భారీ దాడులు

అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు

9లో


# సమర్థంగా నీటి నిర్వహణ

## 80శాతం పైగా నిండిన రిజర్వాయర్లు

## కృష్ణ, గోదావరి, పెన్న తదితర నదుల ద్వారా ఇప్పటికి 310 టిఎంసిల వినియోగం

## సీమ జిల్లాల ప్రాజెక్టులకు సమృద్ధిగా నీరు

## - సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు 25, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సమర్ధ నీటి నిర్వహణ సత్ఫలితాలను ఇస్తోందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టంచేసారు. నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సిఎం తెలిపారు. ఇరిగేషన్ స్కీమ్‌లు.నీటి నిర్వహణ తదితరంశాలపై జలవనరుల శాఖ అధికారులతో సిఎం చంద్రబాబు సోమవారం కీలకంగా సమీక్షించారు.ఇప్పటికే పలు సమీక్షల్లో ఇరిగేషన్ అధికారులకు ఇదే విషయంపై చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నారు. తాజా సమీక్షలో సిఎం చంద్రబాబు ప్రతీ వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలన్న లక్ష్యం మేరకు ఓవైపు రిజర్వాయర్లను నింపుతూనే మరోవైపు అన్ని నదీ బేసిన్ల ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టామన్నారు..దానికి అనుగుణంగా ఈసారి కృష్ణా, గోదావరి, వంశధార, పెన్నా నదీ బేసిన్లలో అన్ని రిజర్వాయర్లలోనూ కలిపి ప్రస్తుతం 80 శాతంమేర నీటి నిల్వలు ఉన్నాయి.మన నిర్ణయాలు ఆచరణలో విజయవంతంగాముందుకు సాగుతున్నాయన్న చంద్రబాబు. కృష్ణా నదిపై ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు గత నెలలోనే నిండాయి. పైనుంచి నిరంతర వరద ప్రవాహాలు కొనసాగుతుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి పంపుతున్నారు. ఇదే సమయంలో ఆయా ప్రాజెక్టులనుంచి గరిష్ట మొత్తంలో నీటిని వివిధ లిఫ్టుల ద్వారా, కాలువల ద్వారా ఇతర రిజర్వాయర్లకు, చెరువులకు, పంటలకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలోనే కృష్ణాకు భారీ వరద రావడంతో పెద్ద ఎత్తున నీటినికి సీమ ప్రాంతానికి తరలించి ప్రాజెక్టులు నింపుతున్నారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు ఈ ఏడాది జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 52 టీఎంసీల నీటిని రైతులు వినియోగించుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణతో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 12 టీఎంసీల వినియోగం జరిగింది. గోదావరి బేసిన్‌లోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ద్వారా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను యథాతథంగా దిగువకు సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరి డెల్టాలోని పంటల సాగుకు సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 70 టీఎంసీల మేర నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. పెన్నా బేసిన్లో వెలిగోడులో 15 టీఎంసీలు, సోమశిలలో 56 టిఎంసిలు, కండలేరులో 31 టిఎంసిల నీరునిల్వఉంది. వంశధార బేసిన్లోని గొట్టా బ్యారేజీనుంచి ఈ సీజన్లో 8టిఎంసిల నీటిని ఆయకట్టుకు అందించింది ప్రభుత్వం. మొత్తంగా చూస్తే ఆగస్టు 24 నాటికి ప్రధాన జలాశయాల్లో 650 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

**సమర్థ నీటి నిర్వహణ వినియోగం**

ఈ యేడాది ఇప్పటి వరకు కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్లలో కలిపి 309 టిఎంసిల నీటిని ఆయకట్టుఅవసరాలకు వినియోగించారు. సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 70 టిఎంసిలు, ప్రకాశం బ్యారేజీ నుంచి >>2

# నర్సింగ్ కోర్సుల్లో సంస్కరణలు



## మొదటిసారి ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రవేశాలు..

## మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలను కూడా చేపట్టనున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిభ కలిగిన విద్యార్థులకు పెద్దపీట వేయడంతో పాటు, నాలుగేళ్ల వ్యవధితో కూడిన బియస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో అవకతవకలకు తావులేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెట్టింది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే ప్రవేశాలతో ఈ సంస్కరణలు అమల్లోకి రానున్నాయి. ఈమేరకు బియస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి 1998లో జారీఅయిన జిఒనంబరు 145 మరియు 2023లో జారీ అయిన జిఒ నంబరు 41లో తగు మార్పులు చేయడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**నూతన సంస్కరణలు..**

ఇప్పటి వరకు నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగాను, ఇంటర్మీడియేట్ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగాయి. మొదటిసారిగా గత ఏడాది జులైలో బియస్సీ(నర్సింగ్)లో ప్రవేశాల కోసం ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎగ్జామినేషన్ టెస్ట్‌ను(ఎపిఎన్‌సెట్) డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించింది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతాయి. ఇప్పటి వరకు ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ నిర్ణయిస్తూ ఉండగా... మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించేవి. తద్వారా ప్రతిభ తక్కువ కలిగిన విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు లభించేవని ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలతో పాటు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు కూడా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టనుంది. విశ్వవిద్యాలయం నియమించే సెలక్షన్ కమిటీ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులనే మేనేజ్‌మెంట్ సీట్లలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈసంస్కరణతో ప్రతిభ కలి >>2



సోమవారం గాంధీ బునకర్ మేళా ప్రారంభ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుచిత్ర ఎల్ల

# మన చేనేతకు ప్రపంచ గుర్తింపు

## జాతీయ స్థాయిలో ఎపి చేనేతకు 10 అవార్డులు గర్వకారణం

## ప్రతి కుటుంబం చేనేతను ఆదరించాలి: సుచిత్ర ఎల్ల

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ చేనేత, హస్తకళలకు ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హ్యాండ్‌లూమ్,క్రాఫ్ట్స్ అభివృద్ధికి నిర్దేశించిన సలహాదారు సుచిత్ర ఎల్ల తెలిపారు. 'గాంధీ బునకర్ మేళా'(జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025)ను విజయవాడ శేష సాయి కళ్యాణ వేదికలో సోమవారం సుచిత్ర ఎల్ల, చేనేత. జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి, 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసభలో జ్యోతి ప్రజ్వలనచేసారు..ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ చేనేత మరియు హస్తకళల ప్రొడక్ట్స్‌ను జాతీయ, అంతర్జాతీయంగా మార్కెట్ చేసేందుకు బాధ్యత తీసుకుని పనిచేస్తామన్నారు. మన వస్తువులకు బ్రాండింగ్ ఎలా చేయాలో వాటికి >>2



# ప్రధాని మోడీ డిగ్రీ వివాదం

## 'సిఐసి' ఆదేశాలను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రధాని నరేంద్రమోడీ డిగ్రీ వివరాలను వెల్లడించాలంటూ ఢిల్లీ విశ్వవిద్యాలయానికి కేంద్ర సమాచార కమిషన్ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు పక్కన పెట్టింది. ఈ మేరకు ఫిబ్రవరి 27న రిజర్వ్ చేసిన తీర్పును జస్టిస్ సచిన్ దత్తా నేడు వెలువరించారు. నీరజ్ అనేవ్యక్తి ప్రధాని మోడీ డిగ్రీ వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద సిఐసికి దరఖాస్తు పెట్టారు. ప్రధాని 1978లో బిఎ పూర్తి చేశారు. దీంతో ఆ ఏడాది బిఎ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారి రికార్డుల తనిఖీకి 2016 డిసెంబర్‌లో ప్రధాన సమాచార కమిషనర్ అనుమతించారు.

దీన్ని డియు సవాల్ చేయగా 2017 జనవరిలో ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. తెలుసుకునే హక్కు కన్నా వ్యక్తిగత గోప్యతా >>2

# 'స్త్రీశక్తి' గ్రాండ్ సక్సెస్

## • ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్ • బస్సులకు రెండు వైపులా బోర్డులు • ఆర్టీసీ సమీక్షలో సిఎం చంద్రబాబు • 13 రోజుల్లో 100% ఆక్యుపెన్సీతో బస్సులు నడుస్తున్నాయన్న అధికారులు



సోమవారం ఆర్టీసి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల సహకారంతో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీపై సిఎం చంద్రబాబు సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం అమలు ఎలా జరుగుతుందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో ఎంత మేర పెరిగిందని ఆరా తీశారు. స్త్రీ శక్తి బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురువుతున్నాయా..? అని ముఖ్యమంత్రి అడిగారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో వస్తోందని.. అలాగే 13 జిల్లాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులు తిరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా.. ఉచిత బస్సు వెసులుబాటును మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని... అవసరమైనమేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.."ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేస్తారు. ప్రభుత్వం అందించేపథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే తాను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచి మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తిచూపిస్తా. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంభనకల్పిస్తే.. ఇప్పుడు స్త్రీశక్తి ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది." అని సిఎం >>2

# కుప్పంలో కృష్ణమ్మ పరుగులు

## • మూడు నెలల ముందే రైతులు, ప్రజల కల సాకారం • హంద్రీ-నీవా కాలువల వెంబడి జనం • జలహారతులతో స్వాగతం



హంద్రీ-నీవా కాలువల ద్వారా కుప్పం వచ్చిన కృష్ణాజలాలు

**కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు తలపెట్టిన సంకల్పం సిద్ధించింది. రాష్ట్రంలోనే చిట్టచివరి నియోజకవర్గమైన కుప్పానికి కృష్ణాజలాలు తెస్తానని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం ప్రాంతంలో హంద్రీ-నీవా కాలువల్లో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. దీంతో పడమటి మండలాల రైతులు, ప్రజలు కృష్ణమ్మకు జలహారతులతో ఘనస్వాగతం పలుకుతూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం డ్యామ్ బ్యాక్ వాటర్‌నుంచి వస్తున్న కృష్ణాజలాలతో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో రైతులకు సాగుకు, ప్రజలకు తాగేందుకు జలాలు అందుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ కల్లా హంద్రీ-నీవా జలాలు కుప్పానికి వస్తాయని పేర్కొన్నా మూడు నెలల ముందే ముఖ్యమంత్రి చొరవతో కుప్పానికి నీళ్లు చేరాయి.

**రైతులు.. ప్రజల కల సాకారం :**

ఎటువంటి శాశ్వత జలవనరులులేని కుప్పం ప్రాంతంలో రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసా్తరు. ఇలాంటి తరుణంలో కుప్పం రైతుల కష్టాలు తీర్చాలని సిఎం చంద్రబాబు 2015లోనే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్‌కెనాల్‌పనులకు శ్రీకారం చుట్టారు. >>2

# డిప్యూటీ స్పీకర్ రఘురామకు సుప్రీం కోర్టులో ఊరట

## కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిన ధర్మాసనం



**విజయవాడ,ఆగస్టు25.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై కానిస్టేబుల్ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఫరూక్ బాషా అనే కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సోమవారం సుప్రీం ధర్మాసనం కొట్టివేస్తున్నట్లు తీర్పువెలువరించింది. రఘురామ, అతడి కార్యాలయ సిబ్బంది దాడి చేశారంటూ కొన్నేళ్ల కిందట కేసు వేసిన పిటిషనర్ ఫరూక్.. ఈ కేసును తాను కొనసాగించుకోదలచుకోవడం లేదంటూ అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలుచేశారు. ఈ అఫిడవిట్ పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ జెకె మహేశ్వరిధర్మాసనం ఈ కేసును కొట్టివేస్తు న్నట్లు తీర్పు ఇచ్చింది.హైదరాబాద్ గచ్చిబౌలి బౌల్డర్ >>2

# 'మెగాసిటీ'గా తిరుపతి!

## నెల్లూరు తరహాలో రోడ్ల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలు

## ఎల్ఆర్ఎస్‌కు మంత్రివర్గం ఆమోదం: మంత్రి నారాయణ



సోమవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

**తిరుపతి,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకున్న తిరుపతినగరం ప్రాధాన్యత దృష్ట్యా మెగాసిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు, నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నెల్లూరు తరహాలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలను వినియోగించాలని మంత్రి నగర కమిషనర్ మౌర్యను ఆదేశించారు. వచ్చే జూన్ నెలాఖరుకు >>2

# 'మెప్మా'తో మహిళలకు స్వయం ఉపాధి

## వెయ్యి మందికి పైగా లబ్ధిదారులకు రుణ సౌకర్యం

## చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తో సైతం మహిళలకు ఆదాయం: మంత్రి లోకేష్



**సచివాలయం,ఆగస్టు 25,ప్రభాతవార్త :** ఎపి మహిళలు సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు.మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా ఉంటారని ఐటి,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ,ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు.రాష్ట్రంలో విజయవాడ,విశాఖపట్నం,నెల్లూరు తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

**ఒక కుటుంబం -- ఒక వ్యాపారవేత్త స్ఫూర్తి**

మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజు సిఎం చంద్రబాబు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. సిఎం మానస పుత్రికగా ప్రారంభించిన ఒకకుటుంబం - ఒక వ్యాపారవేత్త కింద మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరి >>2

26-08pg2exHMNWJQE 2nd_26-08pg2exHMNWJQE.qxd 8/25/2025 11:58 PM Page 1





ఫిజి ప్రధాని సిత్వేని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీకి నివాళులర్పించిన దృశ్యం

# కోర్సుల్లో సంస్కరణలు

>> గిన విద్యార్థులకు నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**ప్రవేశానికి అర్హతలు**

నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశం పొందడానికి...సాధారణ తరగతులకు (అన్ రిజర్వ్‌డ్) చెందిన వారు ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 పర్సంటైల్‌లో ఉండాలి(అనగా ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 శాతం వారు పొందిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). సాధారణ తరగతులకు చెందిన దివ్యాంగులు 45 పర్సంటైల్ లో ఉండాలి(45 శాతం వారు సాధించిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి).

ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన వారు, ఈ తరగతులకు చెందిన దివ్యాంగులు 40 పర్సంటైల్‌లో ఉండాలి.రాష్ట్రంలో బియస్సీ(నర్సింగ్) విద్యను అందించే కళాశాలల్లో మొత్తంగా 13,726 సీట్లుండగా...2024-25 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో 6,441 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకోగా, మేనేజ్‌మెంట్ కోటాలో 5,144 మంది ప్రవేశాలు పొందారు. 2,141 సీట్లు మిగిలిపోయాయి. కన్వీనర్ కోటా ప్రవేశాల్లో రిజర్వేషన్ నియమాలు వర్తిస్తాయి. మేనేజ్‌మెంట్ సీట్లలో రిజర్వేషన్లు ఉండవు.



సోమవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రైతుల 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆందోళన దృశ్యం

# సమర్ధంగా నీటి నిర్వహణ

>> 52 టిఎంసిలు, వంశధార నుంచి 8 టిఎంసిల మేర నీటిని కాలువలకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు, హంద్రీ నీవా, నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా ఈ సీజన్లో ఇప్పటి వరకు 156 టిఎంసిల నీటి వినియోగం జరిగింది. ఈ ఏడాది హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా మల్యాల ఎత్తిపోతల నుంచి రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న లక్షల ఎకరాల ఆయకట్టుకూ సాగునీరు అందిస్తున్నారు. హంద్రీనీవా కాలువల వెడల్పు చేయడంతో 738 కి.మీ ప్రయాణించి కృష్ణా జలాలు చిత్తూరు జిల్లా చివరి ప్రాంతాలకు చేరుతున్నాయి. కృష్ణా జలాలు ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు సూచనలతో ఏడాది కాలంగా చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా పంటలకు అవసరమైన సాగునీరు సకాలంలో ఇవ్వడంతో పాటు... రానున్న కాలానికి అవసరమైన విధంగా రిజర్వాయర్లను నీటితో నింపుతున్నారు.

ఈ సీజన్ లోనే 1969 టిఎంసిలు సముద్రం పాలు.. ఇలా సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో వరద నీటిని సద్వినియోగం చేసుకుంటున్నా... వివిధ నదీ బేసిన్ల నుంచి పెద్ద ఎత్తున నీరు సముద్రంలోకి వెళ్లింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలతో మన ప్రాజెక్టులు నిండగా మిగిలిన నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా బేసిన్ల నుంచి ఈ సీజన్లో జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 1969 టిఎంసిలకు పైగా నీరు సముద్రంలో కలిసింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి నీరు ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 1483 టిఎంసిల మేర సముద్రంలోకి వెళ్లింది. ప్రకాశం బ్యారేజి నుంచి డెల్టా అవసరాల వినియోగం తర్వాత సముద్రంలోకి ఈ సీజన్లోనే 468 టిఎంసిల నీరు వెళ్లింది. అలాగే వంశధార బేసిన్లో ఈ వర్షాకాల సీజన్లో ఇప్పటికే 18 టిఎంసిలకు పైగా సముద్రంలోకి వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి 4.38 లక్షలు, సాగర్ నుంచి 3.38 లక్షలు, పులిచింతల నుంచి 2.72 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు 18 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పైనుంచి వరద వస్తుండడంతో 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఎగువ రాష్ట్రాలనుంచి వరద వచ్చిన సమయంలో మన రిజర్వాయర్లు నింపుకున్నా...పెద్ద మొత్తంలో నీరు సముద్రంలోకి పోతోంది. నదుల అనుసంధానం ద్వారా వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ముందుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసుకుని గరిష్ట నీటి వినియోగం సాధించడం, కొత్త ప్రాజెక్టులు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న విషయం నిరంతరం గుర్తుంచుకోవాలన్నారు.

# డిగ్రీ వివాదం

>> పరిరక్షణ హక్కు మిన్న కాబట్టి సిఐసి ఉత్తర్వును కొట్టివేయాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించడానికి యూనివర్సిటీ సిద్ధంగానే ఉన్నా ఆర్టిఐ కింద ఈ వివరాలను అపరిచితులతో పంచుకునేందుకు సుముఖంగా లేదని తెలిపారు. విద్యార్థుల రికార్డులకు తాము సంరక్షణదారులమని ఇతరుల ఆసక్తిని తృప్తిపరిచేందుకు ఆ రికార్డులను ఆర్టిఐ కింద బయటపెట్టాల్సిన అవసరం లేదని డియు పేర్కొంది.

## సుప్రీం కోర్టులో ఊరట

>> హిల్స్‌లోని రఘురామకృష్ణరాజు నివాసం వద్ద ఎస్‌కే ఫరూక్ బాషా అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. ఆయన భద్రతా సిబ్బంది పిలిచి విచారించారు. ఐడీ, ఆధార్ కార్డులు చూపించమని అడగ్గా ఫరూక్ అందుకు నిరాకరించాడు. దీంతో అనుమానం వచ్చి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించి రఘురామ పిఎ ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఫరూక్ బాషా ఎపి ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ అని తేలింది. ఆ తర్వాత విధి నిర్వహణలో ఉన్న తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారంటూ.. ఎంపీ రఘురామ కృష్ణరాజుతోపాటు మరో నలుగురిపై ఫరూక్ బాషా కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తనతో పాటు తన కుమారుడు, మరో ఇద్దరిపై నమోదైన కేసును క్వాష్ చేయాలని రఘురామ హైకోర్టును ఆశ్రయించగా చుక్కెదురైంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 12 జూలై 2022న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సమయంలో ఎంపీగా ఉన్నానని, అప్పటి సీఎం వైఎస్ జగన్‌తో ఘర్షణలు ఉన్న కారణంగా వై కేటగిరీ భద్రత ఉండేదని. అందుకే అనుమానాస్పదంగా తిరుగాడుతున్నవ్యక్తిని సందేహంతోప్రశ్నిస్తే ఇదంతా జరిగిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అదీగాక, ఇటీవల ఫరూక్ సైతం ఎపికి, హైదరాబాద్‌కు 400 కిలోమీటర్ల దూరంఉన్న కారణంగా పిటిషన్ ఉపసంహరించు కోవాలని ముందుకొచ్చిన నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం కేసును కొట్టివేసింది

# కుప్పంలో కృష్ణమ్మ పరుగులు

>> పెద్దపంజాణి మండలం అప్పినపల్లి నుంచి కుప్పం బ్రాంచ్‌కెనాల్ కాలువ 143కి.మీ.ల మేర ఉంది. అప్పట్లోనే దాదాపు 436కోట్లు నిధులు కేటాయించారు. అనంతరం 2019లో మరో వంద కోట్లు మంజూరు చేశారు. అయితే ఎన్నికల నాటికి 87శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం అధికారంలో వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులు పూర్తి చేయక ఎన్నికల ఏడాది 2024లో స్టంట్ వేసింది. కాలువల్లో పూర్తిస్థాయి నీరు లేకున్నా నీటిని విడుదల చేసి అభాసుపాలైంది. మరలా అధికారంలో వచ్చాక సిఎం చంద్రబాబు హెచ్ఎస్ఎస్ఎస్ పనుల పూర్తికి చర్యలు చేపట్టారు. ఏడాది కాలంలోనే దాదాపు గతంలో ఎన్నడూ ఖర్చు చేయని రీతిలో 3890కోట్లు ఖర్చు చేసి చివరి ప్రాంతం అయిన కుప్పానికి నీరు అందిస్తున్నారు. దీంతో రైతులు, ప్రజల కల సాకారం అయింది. పడమటి ప్రాంతాలైన పు ంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోకి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు రావడంతో కాలువల వెంబడి జనం, రైతులు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. తమ తమ గ్రామాల్లో కృష్ణమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, జలహారతులు పడుతున్నారు.

**ఎక్కడి శ్రీశైలం.. ఎక్కడి కుప్పం :**

ఎక్కడో కర్నూలు జిల్లాలో ఉన్న శ్రీశైలం డ్యామ్.. రాష్ట్రంలోనే చివరి నియోజకవర్గం కుప్పం. వీటి మధ్య దూరం దాదాపు 550కి.మీ.లకుపైనే. అక్కడి నుంచి కృష్ణానదీ జలాలు కర్నూలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల మీదుగా పు ంగనూరు, పలమనేరు మీదుగా కుప్పం రావడం అంటే అది నిజంగా చరిత్రే. ఈ చరిత్రను సిఎం చంద్రబాబు సృష్టించి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న అపర భగీరథుడు అనడంలో సందేహం లేదు.

## 'మెగాసిటీ'గా తిరుపతి!

>> తిరుపతిలో తుడ టవర్స్‌ను పూర్తిచేస్తామన్నారు. గతప్రభుత్వం క్రమపద్ధతి లేకుండా టౌన్‌ప్లానింగ్ చేసిందని ఆయన విమర్శించారు. భవన నిర్మాణాల అనుమతుల విషయంలో కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి తుడ కార్యాలయంలో పట్టణాభివద్ధిపై తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ మౌర్య, తుడ విసి శుభంబన్సల్, పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మతో కలసి మంత్రి నారాయణసమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్లానింగ్ లేకుండా భవనాలు నిర్మించారని, ల్యాండ్ రెగ్యులైజేషన్ పథకం(ఎల్ఆర్ఎస్) ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించిందన్నారు. త్వరలోనే బిల్డింగ్ రెగ్యులైజేషన్ పథకం(బిఆర్ఎస్)పై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రతినెలా శాటిలైట్ చిత్రాల పరిశీలన, అధ్యయనంతో ప్లానింగ్‌కు విచలనంఉంటే సిఎం సూచనలతో చర్యలు తీసుకుంటామన్నారు. ఆమోదంలేకుండా భవనాలు నిర్మిం చుకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. తిరుపతి నగరం పరిధిలో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి తుడ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. తుడ ప్రాజెక్ట్ నిర్మాణపనుల్లో వేగంపెంచాలని, కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పన్నుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని కమిషనర్ మౌర్య మంత్రికి వివరించారు. పక్కాప్రణాళికలతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేధించాలని మంత్రి నిర్దేశం చేశారు.ప్రభుత్వాన్ని తప్పుదారిపట్టించే నివేదికలు వద్దని, ఏ విషయంలనూ వాస్తవ పరిస్థితులు చెప్పాలని గట్టిగా తెలిపారు.

## రాష్ట్రంలో రైతులకు ఎరువుల కొరత ఉండదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ ఆగస్ట్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్రంరాష్ట్రం సమన్వయం, రైతులకు ఇచ్చిన హామీలపై మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా వివరణ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరంగా అంచనా వేయబడి, ఇప్పటి వరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరాయనితెలిపారు. అందులో యూరియా, డీఏపీ, ఎంఒపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి 6.22 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రైతులకు ఎరువుల కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచిందని మంత్రి తెలిపారు. గోదావరి వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో రవాణా సమస్యలు తలెత్తినప్పటికీ, రైతులకు ఎరువులు సమయానికి అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంకా 79,633 మెట్రిక్ టన్నులు డిపోలలో నిల్వగా ఉండగా, అవసరమైన ప్రాంతాలకు తరలింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఎరువుల సరఫరాలో కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో 50:50 నిష్పత్తిలో పంపిణీ జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం నుండి ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నులు చేరాయని, 0.47 లక్షల మెట్రిక్ టన్నులు రాబోతున్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 0.75 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 0.90 లక్షల మెట్రిక్ టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒరిస్సా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని వివరించారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, సమయానికి అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈ విధానం వల్ల ఎరువుల నిల్వలు, అవసరాలు, పంపిణీపై రియల్ టైమ్ సమాచారం అందుతుందని చెప్పారు. జిల్లా స్థాయి అధికారులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సాగు కొనసాగించడానికి కావలసినంత ఎరువులు సకాలంలో అందుతాయని హామీ ఇచ్చారు. వర్షాల ప్రభావంతో కొన్నిచోట్ల రవాణా ఆలస్యం జరిగినా, రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాల వలన దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటలకు ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు అందిస్తున్నామని చెప్పారు.

# 'స్త్రీశక్తి' గ్రాండ్ సక్సెస్

>> చెప్పారు.

**సహకరిస్తోన్న మహిళలకు ధన్యవాదాలు..**

స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అవ సరం ఉంటేనే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అనవసర ప్రయాణాలు పెట్టుకో వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా సరే.. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి... వారికి చేయూత అందివ్వడానికే స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తున్నామని మహిళలకు చెప్పాను. ఆ మేరకు మహిళలు కూడా సహక రిస్తున్నారు. రాష్ట్ర పరిస్థితిని అర్థంచేసుకుని... దానికి అనుగుణంగా వ్యవహ రిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. ఇప్పటి వరకు సహకరించిన విధంగానే మహిళలు భవిష్యత్తులోనూ సహకరించాలని కోరుతున్నాను. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకా లకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే.. మరింత ఉత్సాహంగా పని చేస్తాం. మరింత మేలు ప్రజలకు, మహిళలకు చేకూర్చగలం." అని చంద్రబాబు వివరించారు.

**బోర్డులు పెట్టండి... లైవ్ ట్రాకింగ్ అమల్లోకి తీసుకురండి.**

స్త్రీ శక్తి పథకం కింద నడిపే బస్సులకు వెనుకా... ముందు భాగాన బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తంగా 8,458 స్త్రీ శక్తి బస్సులకు బోర్డులు పెట్టాలని చెప్పారు. సీట్లకోసం పోటీ పడితే.. ఆర్టీసీ సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తలేదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య ఎంత మేరకు పెరిగిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం మహిళలు ప్రయాణిస్తే.. 60 శాతం మంది పురుషులు ప్రయాణించే వారని.. ఇప్పుడు 65 శాతం మేర మహిళలు ప్రయాణిస్తుంటే.. 35 శాతం మేర పురుషులు ప్రయాణిస్తున్నారని అధికారులు వివరించారు. అలాగే స్త్రీ బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానం ఎప్పటి నుంచి అమల్లోకి తెస్తున్నారని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రెండు, మూడు రోజుల్లో గుంటూరు డిపోలో స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని... ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి బస్సులకు లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు. లైవ్ ట్రాకింగ్ విధానం అమల్లోకి వస్తే.. బస్సుల వేళలు తెలుసుకుని.. ఆ మేరకు తమ ప్రయాణ సమయాలను మహిళలు ఫిక్స్ చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్టిక్యులేటెడ్ ఈ బస్సులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ తరహా బస్సులు ప్రస్తుతమున్న సాధారణ బస్సులకు... మెట్రో రైలుకు మధ్య మిడిల్ లెవెల్ ట్రాన్స్ పోర్టు వ్యవస్థగా ఉంటాయని అధికారులు వివరించారు.

# మహిళలకు స్వయం ఉపాధి

>> యాస్ (మెప్మా) సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది.అందులో భాగంగా తొలిదశలో 9పట్టణాల్లో 1000మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400వాహనాలు,విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వీటిలో ఎలక్ట్రిక్ టూ వీలర్లు కాగా,240ఎల క్ట్రిక్ త్రీ వీలర్లు ఉన్నాయి.

**మహిళల విజయగాథలు**

విజయవాడకు చెందిన వడ్లపూడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొనుగోలుచేసి ర్యాపిడో నడపడం ప్రారంభించారు.ప్రస్తుతం నెలకు రూ.10వేల వరకు సంపాదిస్తున్నారు.సొంత కాళ్లపై నిలబడటం ద్వారా వస్తున్న ఆదాయం కన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లభించడంతో సంతోషంగా ఉందని మంజు చెబుతున్నారు.

విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షవాతం రావడంతో కుటుంబ బాధ్యతలను తాను స్వీకరించారు.ఎస్సీ వర్గానికి చెందిన నేను బ్రహ్మానందరెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నాను.ఆయనకు పక్షవాతం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే రూ.6000లు దివ్యాంగ పెన్షన్ మందులకు సరిపోతుంది.ఈ సమయంలో మెప్మా ద్వారా రుణం పొంది యాక్టివా టూ వీలర్ కొన్నారు.ర్యాపిడో నడుపుతూ నెలకు రూ.12వేలు సంపాదిస్తున్నాను ఈఎంఐ చెల్లించడంతోపాటు ఇంటిని నడపడానికి ఆ ఆదాయం తోడ్పడుతుందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**ఇది ఆరంభం మాత్రమేనన్న మంత్రి లోకేష్**

మహిళలు సాధికారత సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని విద్య,ఐటి శాఖమంత్రి లోకేష్‌అన్నారు. టిడిపి మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టడంతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.ర్యాపిడోతో కలసి రాష్ట్రంలో 1000మందికి పైగా మహిళలు స్వీయ ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఇది ఆరంభం మాత్రమేనని,రాబోయే రోజుల్లో మరింత చేస్తామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

## ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు

### ఐఐటి, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మంది ఎంపిక

### సిఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచుకున్న విద్యార్థులు

### సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష అందించిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిభావంతులైన విద్యార్థుల ఎదుగుదలకు ఆర్థికంశాలు అవరోధం కాకూడదని సిఎం చంద్రబాబు అన్నారు. విద్యలో రాణించే పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఐఐటీ, నిట్, నీట్ పరీక్షల్లో రాణించడానికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహంతో పాటు,అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ యేడాది ఐఐటి, నిట్, నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు... రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ప్రోత్సహించండి,స్ఫూర్తినింపండి**

విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలి. రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉంది. ఇందుకు 55 మంది విద్యార్థులే నిదర్శనం. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి నాలుగు రెట్లుపెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న పూర్వ విద్యాసంస్థకు వెళ్లి అక్కడ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి. అని ముఖ్యమంత్రి విద్యార్థులతో అన్నారు.

**356 మందికి శిక్షణ... 55 మంది ఎంపిక**

కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీనీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్డ్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది క్వాలిఫై అయ్యారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. వీరు కాకుండా బీడీఎస్‌లో మరో 14 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది. జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు లభిస్తాయి.

**ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు**

ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీనీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. సమావేశం చివరిలో ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, ఒక్కో విద్యార్థికి రూ.లక్ష చొప్పున చెక్ స్వయంగా అందించి వారితో విడివిడిగా ఫోటోలు దిగారు. మొత్తం 55 మంది విద్యార్థులకు రూ.55 లక్షలు ఇచ్చారు. విద్యార్థులు అంతా పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపడంతో ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. భుజం తట్టి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సమావేశం చివరిలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ముఖ్యమంత్రితో గ్రూపు ఫోటో తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# మన చేనేతకు ప్రపంచ గుర్తింపు

>> ఇంకా ఆదరణ ఎలా చేయాలో అనే విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. మన కళలను, ఆర్టిజన్స్‌ను, హ్యాండీ క్రాఫ్ట్స్‌ను అభివృద్ధి చేయటం మనందరి బాధ్యత అని అన్నారు. మన కుటుంబాలు చేనేతను ఆదరించేలా చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. హ్యాండ్ ల్యూమ్స్ ఒక జీవనోపాధి దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ క్రింద మన చేనేతకు 10 అవార్డ్స్ రావడం చేనేతకు గర్వకారణం అన్నారు. మొత్తం దేశంలో 30 అవార్డ్స్‌లో మనకు 10 అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఇందులో బాపట్ల జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు, రాష్ట్రంలో 9 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను పెంచేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్స్‌ను ఆగస్టు నెలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జిఎస్టీ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి మరియు దేశములోని ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి వినియోగదారులకు అందుబాటులో ఉంచే కార్యక్రమములో భాగంగా వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేనేత. జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్ రాజారావు, డిప్యూటీ డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, ఏడీలు హరికృష్ణ, వనజ, తదితరలు పాల్గొన్నారు.

**'గాంధీ బునకర్ మేళా'ను (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన 2025)**

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన2025 అనంతరం చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాలకు చెందిన స్టాల్స్‌ను ఆసక్తిగా గమనించారు. అంతేకాకుండా ఒక్కో చీర తయారీకి ఎన్ని రోజులు పడుతుంది, ఎంత మంది చీర తయారీలో పాల్గొంటారు అని స్టాల్స్ నిర్వాకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో దేశం మొత్తం మీద వివిధ రాష్ట్రాల నుంచి 100 స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనలో బీహార్, చత్తీస్‌గఢ్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, ఝార్ఖండ్, గుజరాత్, ఢిల్లీ, హ్యాండిక్రాఫ్ట్స్ విభాగంలో 5, ఆంధ్ర రాష్ట్రం నుండి 45 చేనేత సంఘాలు పాల్గొననున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో అన్నిరకాల చేనేత ఉత్పత్తులు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉంచబడును. కాటన్/సిల్క్ చీరలు, డ్రస్ మెటీరియల్స్, బెడ్‌షీట్లు, కలంకారి, జంథాని, కార్పెట్స్ వంటి విస్తృత శ్రేణి ఉత్పత్తులు ఈ మేళాలో ప్రదర్శన.అమ్మకానికి అందుబాటులో ఉంటాయి. కావున, మన విజయవాడ మరియు పరిసర ప్రాంత ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత కార్మికులను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది.

## వారం - వర్జ్యం

26-08-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
తదియ మ. 1.57
హస్త పూర్తి
వర్జ్యం : మ. 1.01-2.46
దు.ఉ. 8.24-9.14, 2) రా. 11.27-12.17
శుభసమయం:ఉ. 5.30-9.30, సా. 4.30-5.15
రాహుకాలం - మ. 3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. కుటుంబసమస్యల నుండి బయటపడతారు.

**వృషభం:** ఉద్యోగంలో మార్పుల వెనువెంటనే ఫలితాలు ఇవ్వకపోయినా భవిష్యత్తులో కలిసివస్తుంది.

**మిథునం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. సోదరుల నుండి విలువైన సమాచారం.

**కర్కాటకం :** సంతాన విద్యా విషయంలో బాధ్యతాయుతంగా మసలుతారు. వస్తు లాభం.

**సింహం:** ఊహించని పరిణామాలు కుటుంబంలో కలతలు సృష్టిస్తాయి. వాహన సౌఖ్యం.

**కన్య :** సన్నిహితులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**తుల :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

**వృశ్చికం:** ఉద్యోగపరంగా కొన్ని ఒడిదుడుకులు సంభవం. ఋణాలు తీరి కొంత ప్రశాంతత పొందుతారు.

**ధనుస్సు:** పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. వాహనయోగం.

**కుంభం:** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలను శ్రమించి సాధిస్తారు.

**మీనం :** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోనుచేస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

26-08Pg3exHMNWJQETC GNT ONG_26-08Pg3exHMNWJQETC.qxd 8/25/2025 10:43 PM Page 1



# శ్రీవాణి ఆఫ్‌లైన్ జారీ కొనసాగింపునకు తర్జనభర్జనలు!

## - ఆన్‌లైన్ టిక్కెట్‌లతోనూ సమస్యలున్నట్లు భక్తుల ఫిర్యాదు




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆలయంలో మరీ దగ్గరగా కులశేఖరపడి (మొదటి గడప) వద్దనుండి దర్శనం చేసుకునే అవకాశం ఉన్న శ్రీవాణిబ్రేక్ దర్శనాల టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీ కొనసాగింపు విషయంలో టిటిడి ఎటూ తేల్చుకోలేకపోతోంది. భక్తుల నుండి డిమాండ్ విపరీతంగా ఉండటంతో ఈ టిక్కెట్లు తిరుమలలోని అన్నమయ్యభవనం సమీపంలో శ్రీవాణి ప్రత్యేక కౌంటర్‌ల వద్ద సమయం, సందర్భం లేకుండా జారీచేయడమే ప్రధానంగా భక్తుల నుండి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీతసమయం ప్రకారం ప్రతి రోజూ ఉదయం 10గంటలకు ఈ ప్రత్యేక కౌంటర్‌ల వద్ద టిక్కెట్లు జారీచేయాల్సి ఉంది. ఇందుకు భక్తులు వేకువజామున 3,4గంటల నుండే అక్కడ క్యూలైన్లో బారులుతీరి నిలబడుతున్నారు. రోజువారీగా తిరుమలలోని కౌంటర్లలో 800 శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు ,రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు పొందిన భక్తులకు ఏరోజుకారోజు దర్శనం కావడంతో సాయంత్రం 4.30గంటలకు ఆలయంలోనికి వైకుంఠమ్ 1 క్యూలైన్‌ల నుండి అనుమతినిస్తున్నారు. దీనివల్ల డబ్బున్న ధనవంతులేగాక సామాన్యభక్తులు కూడా దర్శనం త్వరగా చేసుకునేందుకు వీలుకల్పించారు. ఈ నేపథ్యంలో సాధారణరోజుల్లోనూ మధ్యాహ్నం 12గంటలలోపే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు పూర్తిగా జారీఅవుతున్నాయి. ఇంకా వారాంతం,రద్దీ విపరీతంగా ఉండే రోజుల్లో మరీ అర్ధరాత్రి వేళ టిక్కెట్లు జారీచేస్తుండటంతో ఉదయం 6గంటలకల్లా ఆరోజు దర్శన టిక్కెట్లు పూర్తిగా కోటా లేకపోతోంది. టిక్కెట్లు జారీచేసే విషయంపై గత వారం తిరుమలలో భక్తులు రచ్చచేయడం, నిరసనలకు దిగడం జరిగింది. దీంతో శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్ చేయాలని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే ఆన్‌లైన్‌లో రోజువారీగా 500 టిక్కెట్లు మూడునెలలముందే విడుదల చేస్తుండటం, ఈ టిక్కెట్లు అందుకున్న భక్తులు కొన్ని అనివార్యకారణాలతో దర్శనాలకు రాలేకపోతున్నారనేది టిటిడి సమాచారం. అలాంటి సమయంలో ఆ టిక్కెట్లు వృధాగానే పోతున్నాయి. దీనివల్ల ఆఫ్‌లైన్‌లోనే జారీచేయడం వల్ల కొండకు చేరుకున్న భక్తులు తమతమ స్థాయిని బట్టి ముందువచ్చిన వారికి ముందు అనే విధంగా ఏరోజుకారోజు టిక్కెట్లు అందుకోవడానికి సౌలభ్యంగా ఉంటుంది. అంతేగాక ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు తిరుమలలోనే స్థానిక ఆలయాలు, తీర్థాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించే వీలుకూడా ఉంది. గదులకోసం తంటాలు తప్పుతాయి. మరీ ఎవరైనా భక్తులు సెంటిమెంట్‌గా భావిస్తే యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకోవడం చేయవచ్చు. ఇవన్నీ పరిగణనలోనికి తీసుకుంటున్న టిటిడి అధికారులు ఆఫ్‌లైన్‌లోనే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు కొనసాగించడం మంచిదని అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టిక్కెట్లు జారీ కౌంటర్ల వద్ద పూర్తి పారదర్శకంగా డిజిటల్ డిస్‌ప్లే చేస్తూ ఎన్ని టిక్కెట్లు లభ్యత వున్నాయనే సమాచారం తెలియజేస్తున్నారు. సోమవారం భక్తుల రద్దీ ఓ మాదిరిగా కొనసాగడంతో మధ్యాహ్నం 1గంటకు 80వరకు శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు ఉన్నాయి. గంటసమయంలో ఆ టిక్కెట్లను భక్తులు బుక్‌చేసుకుని సాయంత్రం దర్శనానికి వెళ్ళడం విశేషం. ప్రతిరోజూ 1,500 టిక్కెట్లు జారీఅవుతున్న శ్రీవాణి మరో 500వరకు పెంచాలని భక్తుల నుండి వస్తున్న విజ్ఞప్తి. మరీ దీనిపై టిటిడి అధికారులు సమగ్రంగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. మరీ టిక్కెట్లు 300వరకు పెంచాలనే యోచనతో కార్యాచరణ రూపొందిస్తున్నారనేది సమాచారం. అయితే 10,500 రూపాయలు చెల్లించి దర్శన టిక్కెట్ పొందుతున్న భక్తులకు వసతి సదుపాయం విషయంలో కూడా కుదరదనే అంశంపై భక్తులకు అవగాహన కల్పించాలని ఆలోచన చేస్తున్నారు. మరీ వారంరోజుల్లో ఈ అంశాలపై టిటిడి అధికారులు ఒకస్పష్టతకు రానున్నారు.

# తిరుమల సమాచారం

## వరాహస్వామికి ఏకాంత అభిషేకం




**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివరాహక్షేత్రం కలియుగవైకుంఠం తిరుమలలో సోమవారం ఉదయం భూవరాహస్వామికి ఏకాంత అభిషేకం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరాహస్వామి జయంతి సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదోక్తంగా పాలు,పెరుగు,తేనె,చందనం, పసుపు, కొబ్బరిజలం వివిధ రకాల పండ్లతో తయారుచేసిన పంచామృతంతో మూలవర్లకు ఏకాంత అభిషేకం నిర్వహించారు. కాగా తిరుమలలో ఆగమశాస్త్రం ప్రకారం వరాహస్వామికి తొలిపైజ, తొలినైవేద్యం , తొలి దర్శనం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం: మంత్రి నారాయణ



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళ ప్రభుత్వంలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం మెల్లగా అన్నీ సరిదిద్దుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని రాష్ట్రమంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదప్రజలు ఆర్థికంగా ముందుకు వెళ్ళేలా పి4 పథకం అమలుచేయడం అన్ని వర్గాల నుండి ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామని, మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని చంద్రబాబునాయుడుకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి విజన్ దూరదృష్టితో కూడుకుందన్నారు. ఆయన దిశానిర్ధేశం రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధిచెందేందుకు దోహదపడుతుందన్నారు. సోమవారం ఉదయం కుటుంబం,అనుచరులతో కలసి తిరుమలకు వచ్చిన మంత్రి నారాయణ విఐపి బ్రేక్ ప్రారంభసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు,ఓఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన మంత్రి ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అంతా మంచి జరగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ, ఎంపిలు రఘునందన్‌రావు,మాగుంట శ్రీనివాస్ వేర్వేరుగా శ్రీవారి ఆలయంలోపలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి గోవిందుడి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సైనికశక్తి, దేశభద్రత మరింత శక్తిమంతంగా ఉండాలి:కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ సైనికులు దేశభద్రతలో పట్టుదలతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి తెలిపారు. సైనికశక్తి, దేశభద్రత మరింత శక్తివంతంగా ఉండాలని భగవంతుడ్ని ప్రార్ధించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయని, రైతులు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం వేకువజామున కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కుటుంబంతో కలసి శ్రీవారి సుప్రభాతసేవలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దేవదేవుడి దర్శనం చేయించి ఆశీస్సులందజేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేపు జగన్ తిరుమల పర్యటన లేదన్న వైఎస్సార్సీ



**తిరుమల,ఆగస్టు 25ప్రభాత వార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం(రేపు) తిరుమలకు వస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయన పర్యటనపై టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. ఆయన ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి రేపు వస్తున్నట్లు, ఆయన అన్యమతస్థుడు కావడంతో హిందూమతంపై విశ్వాసం ఉన్నట్లు డిక్లరేషన్ ఇవ్వాలని, అలా సంతకం చేయకుంటే దర్శనానికి అనుమతిస్తారా?అనే పుకార్లు షికారుచేశాయి. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ళు శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలోతిరుమలకు వచ్చి పట్టువస్త్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వైఎస్ జగన్ వైసిపి నేతగా,పులివెందుల ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తిరుమల పర్యటన ఉందనే సామాజిక మాధ్యం వార్తతో టిటిడిలో గుబులురేగింది. ఈ సున్నిత మైన విషయంపై ఎలా వ్యవహరించాలనే అంశం పెద్ద దుమారం రేపింది. అయితే చివరకు సోమవారం సాయంత్రం వైసిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలకు జగన్ పర్యటన లేదని స్పష్టత నివ్వడంతో నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. 27న తిరుమలకు జగన్ రావడం లేదని, అసలు ఆయన పర్యటన లేదని చెప్పారు. అంతేగాక సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా హిందు ధర్మపరిరక్షణ జరిగిందని, శ్రీనివాస దివ్యఅనుగ్రహ హోమం ప్రారంభించామని కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

# ఒక్క క్లిక్.. వేయి భావాల లాజిక్

## - పాత్రికేయరంగంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకం

### - ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**.విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ఫొటోగ్రాఫర్ ఒక్క క్లిక్‌తో కెమెరాలో బంధించే ఛాయాచిత్రం వేయి భావాల లాజిక్ అని.. ఫొటోలు ఎన్నో మధురానుభూతులకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని, ఫొటో లేని వార్తా పత్రిక వెలుగు లేని దివిటీ లాంటిదని, ఛాయాచిత్రం చూడటంతోనే సగం వార్తా సారాంశం పాఠకులకు అర్థమయిపోతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విశ్రాంత ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి అన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి.. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ పి.ప్రసాద్ సేకరించిన పురాతన అరుదైన కెమెరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మధురానుభూతులను ఫొటోల రూపంలో భావితరాలకు అందించేందుకు వీలుంటుందని.. ఫొటోలు అనేవి తరతరాలకు విజ్ఞాన వారధులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏది చేసినా వినూత్నంగా చేయాలని ప్రోత్సహిస్తుంటారని, విలువైన వనరుల సృష్టి జరగాలని ఆకాంక్షిస్తారని.. ఫొటోగ్రఫీ పోటీల నిర్వహణ ద్వారా ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించి.. కొత్త ఉత్తేజంతో వారు ముందడుగు వేసేలా దోహదపడతాయన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా ఆర్థిక రంగానికి దాదాపు 67 శాతం సేవా రంగం ద్వారా లభిస్తోందని.. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా సేవా రంగం మరింత పురోగతి సాధించేందుకు వీలుంటుందన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టి కృషి అవసరమని.. ఛాయాచిత్రాల విజ్ఞాన సారథులు అయిన ఫొటోగ్రాఫర్లు కూడా ఇందులో భాగస్వాములు కావాలన్నారు. ఈ పోటీలు ఆరంభం మాత్రమేనని.. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి మాట్లాడుతూ.... ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు, ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించేందుకు వివిధ రకాల ఇతివృత్తాలతో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని.. విజేతలకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు ఉన్నా వాటిని ఎదుర్కొంటూ ఫొటోగ్రాఫర్లు విజయవంతంగా ముందుకెళ్తున్నారని..

వృత్తి జీవితానికి వన్నె తెస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణిలు ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్‌టీఆర్, యోగాంధ్ర, తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం 2, న్యూస్ ఫొటోలకు సంబంధించి మూడు విభాగాల్లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.

## ఏడాదిన్నర బాలుడిపై పైశాచికంగా దాడి!

### తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన బాలుడు



బాలుడి తల్లిదండ్రులు

**పలమనేరు టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** అభం శుభం తెలియని ఏడాదిన్నర బాలుడిపై పైశాచికంగా దాడి జరిగింది. ఈ దాడి ఎవరు చేశారన్న విషయం తెలియడం లేదు. శరీరంపై కాల్చిన గాయాలు, మర్మావయంపై కొరికిన గాట్లు ఉన్నాయి. ఈ నెల 24న సాయంత్రం జరిగిన ఈ సంఘటన హృదయ విదారకంగా వుంది. అపస్మారక స్థితిలో బాలుడు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది తల్లిదండ్రుల పనేనా లేక ఇతరులు ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ వద్ద ఓ కోళ్ళఫామ్‌లో చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ జంట పనిచేస్తున్నారు. వీరికి ఏడాదిన్నర బాలుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో బాలుడు ఈ నెల 24న హటాత్తుగా భోరున ఏడుస్తూ అరవడంతో తల్లిదండ్రులు వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆసుపత్రిలో వైద్యులు విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలుడు అపస్మారక స్థితిలో కోమాలో వుండడంతో ఐసియులో వుంచి చికిత్స చేస్తున్నారు. డా.మరియమ్మ మాట్లాడుతూ ఇది సాధారణంగా వచ్చిన వ్యాధి కాదని బాబును ఎవరో విచక్షణా రహితంగా కొట్టారని, దీంతో బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడని తెలిపారు. తల్లిదండ్రులను విచారిస్తే తాము పనుల్లోకి వెళ్ళడానికి తెలిసిన వ్యక్తి దగ్గర వదిలి వెళ్ళామని చెపుతున్నారని వివరించారు. రక్త పరీక్షలు చేశామని రక్తం తక్కువగా వుందని తెలిపారు. విషయం తెలుసుకున్న హ్యూమన్‌రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ మాదేశ్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## అలిపిరి వద్ద భూమిపై భూమన ఆరోపణలు దారుణం: టిటిడి

**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో 2021 నవంబర్‌లో అలిపిరి సమీపంలోని దేవుని పాదాలచెంత 20 ఎకరాల స్థలాన్ని ఒబేరాయ్ హోటల్‌కు కేటాయింపులు చేసిన దాన్ని తిరిగి వెనక్కుతీసుకోవడం జరిగిందని టిటిడి పేర్కొంది. ఆ భూమికి బదులు దక్షిణంవైపు పర్యాటకశాఖకు స్థలాన్ని టిటిడి కేటాయిస్తూ మేనెలలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో తీర్మానించింది. అయితే దీనిపై వైసిపి నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు సబబుకాదని, భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశం కావున ఆయన వ్యాఖ్యలను టిటిడి ఖండించింది. అలిపిరి-చెర్లోపల్లిరోడ్డులో దక్షిణంవైపు ఇప్పటికే పలు నిర్మాణాలు జరిగిన విషయం విదితమే.దక్షిణంవైపు భూమిని పర్యాటకశాఖకు కేటాయించి తిరుమల కొండను ఆనుకుని ఉత్తరంవైపుగా ఉన్న పవిత్రమైన భూమిని టిటిడి తీసుకోవడం జరిగిందన్నారు.

## రేపటి నుండి కాణిపాకం బ్రహ్మోత్సవాలు



**కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో రేపటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఈనెల 27న వినాయకచవితి, 28న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబర్ 5న జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగుస్తాయి. అలాగే 6న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు 16న జరిగే తెప్పోత్సవంతో ముగియనుంది. ఈమేరకు ఆగస్టు 27న వినాయక చవితి, 28న ధ్వజారోహణం,హంసవాహనసేవ, 29న బంగారు నెమలివాహన సేవ, 30న మూషికవాహన సేవ,

31న బంగారు చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ, సెప్టెంబర్ 1న చిలుక వాహనం (పగలు), వృషభవాహనసేవ (రాత్రి), 2న గజవాహన(ఏనుగు)సేవ, 3న రథోత్సవం, 4న బిక్షాండి, తిరుకళ్యాణం, అశ్వవాహన సేవ, 5న ధ్వజావరోహణం, వడాయత్తుఉత్సవం,
ఏకాంతసేవ జరుగనుంది. అదేవిధంగా ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికార నందివాహనసేవ, 7న రావణ బ్రహ్మ వాహనసేవ, 8న యాళివాహనసేవ, 9న సూర్యప్రభ వాహనసేవ, 10న చంద్రప్రభ వాహనసేవ, 11న కల్పవృక్ష వాహనసేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకిసేవ, 14న కామధేనువాహనం,15న పూలంగిసేవ, 16న తెప్పోత్సవం జరుగనుంది.

# సెప్టెంబర్ 15కల్లా దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి



దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లు సెప్టెంబర్ 15కల్లా పూర్తి చేయాలని ఇఒ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వివరాల పురోగతిని తెలుసుకున్నారు. కమీషనర్ ఆదేశాల మేరకు నూతన లడ్డూపోటులో లడ్డూ తయారీ చేయాలన్నారు. నూతన అన్నదాన భవనంలో అన్నదానం జరగాలన్నారు. దసరా ప్రత్యేక పూజలు కుంకుమార్చన, దేవిఖడ్గమాల, శ్రీచక్రనవణార్చన లు మహామండపం 6వ అంతస్థులో జరుగుతాయన్నారు. చండీహోమం యాగశాలలో జరుగుతాయన్నారు. అన్ని పూజల టికెట్లు ఆన్‌లైన్లో కొనుగోలు చేయాలన్నారు. టికెట్లు అందుబాటులో వుంచే వివరాలు త్వరలో తెలుపుతామన్నారు. భక్తులకు ఉదయం 6 నుండి 10.30 వరకు పులిహోర, కట్టుపొంగలి, కదంబం, దద్దోజనం అందిస్తామని, ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 వరకు భోజనం, సాయంత్రం 4. నుండి రాత్రి 9.30 వరకు పులిహోర, కదంబం కొండ దిగువన అందించాలని, మూలానక్షత్రం రోజున విజయదశమి రోజున చిన్న లడ్డూ ఉచితంగా అందిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ రంగారావు, ఇఇ లు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఇఒ చంద్రశేఖర్, సుధారాణి, గంగాధర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన యు లక్ష్మీపార్వతి రు.1,00,101ల విరాళాన్ని సోమవారం తమ భర్త వెంకటేశ్వరరావు పేరిట నిత్యాన్నదాన పథకానికి అందించారు. విజయవాడకు చెందిన ఎస్ కృష్ణ, అనంతలక్ష్మి దంపతులు రు.1లక్ష విరాళాన్ని కనకదుర్గ డెవలెప్‌మెంట్ ట్రస్టుకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. శ్రీ కనకదుర్గానగర్ నుండి మహామండపం వరకు బిటి రోడ్ పనులు సోమవారం ప్రారంభమైన సందర్భంగా వాహనాలకు ప్రవేశం లేదని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. వాహనదారులు ఘాట్‌రోడ్డు మార్గంలో కొండపైకి చేరుకోవాలన్నారు. దుర్గమ్మ వారిని దర్శించుకునే భక్తులు పోన్లను మొబైల్ కౌంటర్లలో భద్రపరుచుకోవాలన్నారు.

## ర్యాపిడోతో మహిళలు డ్రైవర్లుగా ఉపాధి పొందడం సంతోషం : మంత్రి లోకేష్



**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ రవాణా సేవల సంస్థ ర్యాపిడోతో కుదిరిన భాగస్వామ్యం ద్వారా వెయ్యిమందికి పైగా మహిళలు డ్రైవర్లుగా ఉండి ఉపాధి పొందడం పట్ల ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు ర్యాపిడో వాహనాలు నడుపుతున్న వీడియోను సోమవారం తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు కల్పిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రవాణా ప్రణాళిక అంటే కేవలం ఓ చోటు నుంచి మరో చోటుకు ప్రయాణించడం మాత్రమే కాదని, అది మహిళలకు లభించే అవకాశం, గౌరవం అని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తమది కచ్చితంగా మంచి ప్రభుత్వమని రుజువు చేసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం గొప్ప విజయం సాధించిందని, అదే స్ఫూర్తితో మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మహిళలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## నేడు సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక రైలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 25,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ఈ నెల 26,27వ తేదీల్లో మంగళ,బుధవారాల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06549ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బెంగళూరు నుండి మంగళవారం రాత్రి 9.15గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 11.30గంటలకు బీదర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బీదర్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06550 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మధ్యాహ్నం 14.30గంటలకు బీదరు నుంచి బయలుదేరి గురువారం తెల్లవారుజామున 4గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

ఈరైళ్లు మార్గమధ్యలో యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని,

మంత్రాలయం, రాయచూర్ క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాహాబాద్, గుల్బర్గా, హొమ్నాబాద్ స్టేషన్లలో నిలుస్తాయి.

వార్త

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్నచిన్న పనుల వల్లనే.

- గ్లిబ్బర్

# పాశవిక ప్రవృత్తికి ఏవీ పగ్గాలు?

భారతదేశమంటే సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే ఎంతో గొప్పగా చెప్పుకుంటాం. కానీ సమాజంలో పూజ్యనీయులైన మహిళల మాన,ప్రాణ విషయంలో చెప్పుకోదగిన గౌరవ మర్యాదలతో ప్రవర్తించలేకపోతున్నాం. చట్టసభల్లో మహిళా బిల్లు ఏనాడో అటకెక్కించారు. రానురాను మహిళల రక్షణ విషయంలో విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. జరిగిన, జరుగుతున్న సంఘటనలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలకులు ఎంతగా చెప్తున్నారో అంతకు రెట్టింపు స్థాయిలో మహిళలపై నేరాలు పెరిగిపోతున్నాయి. వాస్తవంగా చదువు,సంధ్యలు పెరిగే కొద్దీ, విజ్ఞానం ఆర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పు రావాలి. సంస్కారం, సభ్యత మరింత పెరగాలి. మంచి ఏదో చెడు ఏదో గ్రహించే విచక్షణాజ్ఞానం పెంపొందాలి. దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నామేమోననిపిస్తున్నది. మహిళలపై పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, వేధింపుల సంఘటనలు ఆవేదనే కాదే ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న కిరాతకుడే భార్య గర్భవతి అని తెలిసినా అత్యంత దారుణంగా హతమార్చిన సంఘటన తెలంగాణ రాజధాని హైదరాబాద్ శివారులో చోటుచేసుకున్నది. పుట్టబోయే బిడ్డ గురించి కలలకంటున్న ఆమెను అనుమానంతో రాక్షసుడిగా మారి గొంతుకోసి అంత్యంత కిరాతకంగా చంపాడు. అంతేకాదు మృతదేహాన్ని అదృశ్యం చేసేందుకు అమానవీయంగా వ్యవహరించాడు. రంపంతో కాళ్లు, చేతులు, తల వేరు చేసి మూటకట్టి విడివిడిగా మూసీనదీలో పారవేశాడు. మిగిలిన శరీర భాగాన్ని తరలించే ప్రయత్నం చేస్తూ మరొకపక్క భార్య అదృశ్యమైందని కట్టుకథ అల్లి చివరిదశలో పోలీసులకు దొరికిపోయాడు. ప్రేమించి పెళ్లిచేసుకున్న నెల తర్వాత నుంచే ఆమెకు వేధింపులు ఆరంభమయ్యాయి. భరించలేని ఆ యువతి వికారాబాద మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అనుగుణంగా కేసు నమోదు అయింది. ఆ తర్వాత గ్రామంలో పెద్ద సమక్షంలో మూడు, నాలుగు సార్లు పంచాయతీ కూడా జరిగింది. భార్యపై అనుమానం పెరగడంతో ఉద్యోగం కూడా మాన్పించాడు. వైద్యపరీక్షలు పూర్తి అయిన తర్వాత తాను వెళ్లి తల్లిగారి ఇంటివద్దనే ఉంటానని చెప్పినా అంగీకరించకపోవడంతో వాదులాట జరిగి అంతం చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మొన్న శనివారం భార్య మీద దాడి చేసి గొంతు కోసి ఈ కిరాతకానికి ఒడిగట్టాడు. ఇక దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో నోయిడా ప్రాంతంలో అదనపు కట్నంకోసం మరొక కిరాతకుడు జుట్టుపట్టుకొని ఈడ్చుకెళ్లి తల్లిదండ్రులతో కలిసి రసాయనికాలు చల్లి నిప్పంటించి చంపిన దారుణ సంఘటన చోటుచేసుకున్నది. ఆయన డిమాండ్ మేరకు మృతురాలి తల్లిదండ్రులు ఒక ఖరీదైన కారుతోపాటు మోటారుసైకిల్, మరి కొంత నగదు, బంగారం పెద్దఎత్తునే ముట్టచెప్పారు. అయినా తాను కుటుంబం కోసం కొన్న మెర్సిడిస్‌బెంజ్ కారు కొనివ్వాలని,మరో ముప్ఫైఆరు లక్షల అదనపుకట్నం ఇవ్వాలని కొంతకాలంగా ఒత్తిడి చేస్తున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాము ఇవ్వకపోవడంతో తమ కుమార్తెపై శనివారం ఆయన కుటుంబ సభ్యులతో సహా అందరూ కలిసి దాడిచేసి రసాయనికం చల్లి నిప్పంటించారు. డెబ్భైశాతం గాయాలతో ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. ఆరేళ్ల కుమారుడు కూడా తనముందే తన తండ్రి అమ్మను కొట్టి ఆమెపై రసాయనం పోసి సీజర్‌లైట్‌తో నిప్పంటించాడని చెప్పడం అందరిని కలచివేసింది. పోలీసులు అరెస్టు చేసిన తర్వాత ఆయనను సంఘటనాస్థలానికి తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఇన్స్‌పెక్టర్ పిస్తోల్ లాక్కొని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపే కాల్పుల్లో నిందితుడికి కాలికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఇక భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పట్టణంలో మరొక దారుణం చోటుచేసుకున్నది. తమ అల్లుడు ఫోన్ చేసి మెట్ల మీద నుంచి తన భార్యపడిపోయిందని ఆస్పత్రిలో చేర్పించామని చెప్పడంతో పరుగున వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లేసరికి అక్కడ ఒక ఎముకల గూడుగా మారి విగతజీవిగా పడిఉన్న తమ కుమార్తెను చూసి హతాశులయ్యారు. అల్లుడే తమ బిడ్డను తిండిపెట్టకుండా హింసించి హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. గత రెండున్నర సంవత్సరాలుగా తమకుమార్తెతో మాట్లాడే అవకాశం లేకుండా అదనపు కట్నం కోసం ఆమెను వేధించాడని వారు వాపోతున్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరొక రాక్షసుడు భార్యను కత్తితో హత్య చేసి ఆ తర్వాత పెట్రోలు పోసి తగలబెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వరంగల్‌జిల్లాలో మరొక యువతి భర్త ఘాతుకానికి బలైపోయింది. తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని భర్త చెప్పడంతో ఇరుగుపొరుగువారు 108కి ఫోన్‌చేయగా వారువచ్చి ఆ యువతి చనిపోయిందని నిర్ధారించారు. కేవలం వరకట్నం కోసం తమ కుమార్తెను మట్టుబెట్టాడని ఫిర్యాదు చేశారు. ఆమెకు ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎందరో యువతులు నిత్యం బలైపోతూనే ఉన్నారు. ఇంకెందరో బయటకు చెప్పుకోలేక, అటు పోలీసుస్టేషన్ గడప ఎక్కలేక తమలో తాముక్రుంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు అన్నీఇన్నీకావు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు చట్టాలు చేసిచేతులు దులుపుకుంటే సరిపోదు. ఆచరణలో త్రికరణశుద్ధిగా ప్రయత్నంచేయాలి. అప్పుడే ఈ పశుప్రవృత్తికి కొంతవరకైనా పగ్గాలు వేయగలుగుతాం.

సంపద ఉప్పునీరు లాంటిది. ఎంత తాగితే అంత దప్పిక పెరుగుతుంది.



గోల్డ్‌స్మిత్

ఎప్పుడైతే బాధ్యత మొత్తం మన భుజస్కంధాలపై మోపబడుతుందో అప్పుడు మనం అత్యుత్తమంగా, అత్యున్నతంగా పనిచేస్తాం.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### సొంత కెప్టివ్‌మైన్లు అవసరం

దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అలాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లోవిశాఖ ఉక్కు కర్మాగారం ఒకటి. ఇది కేవలం ఉక్కు తయారీ కేంద్రం కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అన్న నినాదం వందలాది కుటుంబాల భవిష్యత్తును ప్రతిబింబిస్తోంది. 1971లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు, ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని 1982లో ఉత్పత్తి ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ కర్మాగారం తూర్పు తీర ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలిచింది. అయితే ఇనుము ఖనిజ మైన్ల లేమి, పెరిగిన ముడిసరుకు వ్యయాలు, అప్పుభారాలు క్రమంగా సంస్థను బలహీనపరిచాయి. ఇటీవల మళ్లీ ప్రైవేటీ కరణ ప్రతిపాదనలు ముందుకు రావడం ఆందోళన కలిగిస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బదలీ అయిన వారిని రిలీవ్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జూన్ నెలలో బదలీలు చేపట్టింది. కానీ కొంత మంది ఉపాధ్యాయులు 2025 బదలీల్లో బదలీ అయ్యి రిలీవర్ లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. బదలీ అయ్యి మూడునెలలు పూర్తి అవుతున్నా ఇప్పటికీ పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. అటువంటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి బదలీ పొందిన స్థానాల్లో జాయిన్ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. డిఎస్సీ 2025 ద్వారా నియమించబడే ఉపాధ్యాయులను, బదలీ అయ్యి రిలీవర్‌లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయుల స్థానాల్లో నియమించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఉత్సవాల నిర్వహణకు చెక్ పెట్టాలి

ఆనాటి ఆ స్వతంత్ర పోరాటంలో భారతీయ భావజాలంతో ప్రజలను ఒకటిచేయడానికిబాలగంగాధర్ తిలక్ గారు వినాయక చవితి ఉత్సవాలను ప్రారంభించారు. కానీ ఈ రోజుల్లో వీధికో వినాయకుడు బయలుదేరాడు. విచిత్ర వేషాలతో కొత్తదనం పేరుతో కోతి చేష్టలు చేస్తున్నారు. నిజంగా ఈ వినాయక చవితి ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయి. ఇకనైనా పాలకులు ఈ ఉత్సవాల నిర్వహణకు చెక్ పెట్టాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నేరాలకు అడ్డాగా ఓటీటీ ప్లాట్ ఫామ్స్

హైదరాబాద్ కూకట్‌పల్లిలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసును పరిశీలిస్తే పక్క బిల్డింగ్‌లో నివాసం ఉంటున్న 15 సంవత్సరాల టెన్త్ క్లాస్ స్టూడెంట్ కిల్లర్‌గా గుర్తించారు. చోరీకోసం ఇంట్లోకి ప్రవేశించిన ఆ బాలుడు అడ్డ వచ్చిన బాలికను చంపేసిన తీరు చాలా బాధాకరం కలిగిస్తుంది. ఓటీటీలకు అలవాటు పడిన ఆ బాలుడు క్రైమ్ వెబ్ సీరీస్‌లను చూసి, అందులోని సన్నివేశాలను ప్రేరణగా పొంది చోరీకి ప్రణాళిక వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఓటిటీ కంటెంట్ ప్రజలకు అవగాహన కల్పించడం కంటే నేరాలను ప్రోత్సహించేందుకు అడ్డాలుగా మారిపోయాయి. ఓటీటీలకు సెన్సార్ షిప్ లేకపోవడంతో ఓటీటీల్లో క్రైమ్ సీన్స్ హద్దు మీరుతున్నాయి. ఇలాంటి నేరస్వభావాలను ప్రోత్సహించే ఓటీటీలు, సోషల్ మీడియా కంటెంట్‌లపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి

ఏపి విశ్వబ్రాహ్మణ రాష్ట్రకార్పొరేషన్ నియామకాన్ని ప్రస్తావిస్తూ, వేల విశ్వబ్రాహ్మణ కుటుంబాలు పూర్తిగా బంగారు నగల తయారీ, మరమ్మత్తులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నందున ఏ ఉపాధి లేక వారి పిల్లల చదువు, పోషణ భారంగా మారి, బజారు షాపుల్లో ప్రైవేట్ వృత్తి చేస్తున్నారు. చదువులకు పెట్టుబడి లేదు. కుటుంబంలో ఆడ పిల్లల వివాహాలు చేయలేక కొంతైనా ఆర్థిక సహకారానికి ఆశపడుతున్నారు. జిల్లా స్థాయిలో కార్పొరేషన్ కుటుంబాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కల్పించాలి. ఇల్లు లేని వారికి స్థలాలు మంజూరు చేసి రుణ సహాయం చేస్తే మంచిది.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### పర్యవేక్షణ లోపం.. వసతులు కొరత

పెట్రోల్ బంకుల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో కనీస వసతులు కరవవుతున్నాయి. పెట్రోలు,డీజిల్ లీటర్ ధర పెద్ద పెద్ద అక్షరాల్లో తెలిపే బోర్డులు,ఉచితంగా కల్పించాల్సిన సౌకర్యాలైన గాలి నింపేయంత్రాలు, ప్రథమ చికిత్స పెట్టె, స్వచ్ఛమైన తాగునీరు, ఫిర్యాదులు పెట్టె, ఫైర్ నియంత్రణ యంత్రాలు పలు బంకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్నిట్లో నామమాత్రంగా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహణ సరిగా ఉండట్లేదు. విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు బంకులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇసి వైఫల్యం వెనుక మన బాధ్యత లేదా?

**ప్రజాస్వామ్యంలో రాజకీయంగా, పార్టీలకున్న పాత్ర ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో ఏ విధంగా సహకరించాలన్న మూలసూత్రాన్ని విస్మరిస్తున్నారు. 1990 లో శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు కమిషన్‌కు పదునైన పనితీరును, ఎలక్టొరల్ అక్రమాలను ఎదుర్కోటానికి మాన్యువల్‌ను దుమ్ముదులిపి చట్టపరంగా చర్యలు ఎవరినీ లెక్క చేయకుండా చేపట్టడంతో ప్రతిభతో కూడిన బలైన ఎన్నికల కమిషన్‌గా శేషన్‌కమిషన్ ప్రపంచ చరిత్రలోనే మిగిలిపోయింది. ఎన్నికల్లో అభ్యర్థులు పార్టీలు హద్దును అతిక్రమించి ఖర్చు పెట్టున్నప్పుడు తీసుకుంటున్న చర్యలు పేలవంగా ఉన్నాయి. ఎన్నికల పండుగను డబ్బులు సంపాదించే పండుగగా ఓటర్లు భావించేస్థితికి మన నాయకులు తీసుకొని వచ్చారు. ఓటర్లు తమకు ఉన్న విలువ గమనించి బాధ్యతగా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాజకీయ పార్టీలు స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిధిలోన్యాయంగాఎన్నికలు జరిగేట్లు చూడాలి. అప్పుడే ఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టే హక్కు ఎవరైనా పొందగలరు.**



రావులపాటి సీతారాం రావు

కేవలం ఎలక్షన్ కమిషన్‌ను తప్పు పట్టటానికే దేశంలోని విద్యాధికులు, నిపుణులు, సామాన్యులు ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఎలక్షన్ కమిషన్ వల్ల కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చు. ఆ విషయాన్ని పక్కన పెట్టి కాసేపు నిజానిజాల మీద దృష్టిసారిస్తే పూర్తి అవగాహన సాధ్యపడుతుంది. రాజకీయ పార్టీలకు మనదేశంలోని రాజ్యాంగ వ్యవస్థల అస్తిత్వం కొంత వరకు కోల్పోవడంలో పాత్ర లేదా? ఆ అవగాహన ఈ ముఖ్యమైన విషయంలో అత్యంత అవసరంగా కనపడుతున్నది! ఎన్నికలలోని లోపాలను పట్టించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంది. నిజమే! ఓటింగ్ లిస్టులలో ప్రతి రాష్ట్రంలో ఎన్నో పొరపాట్లు జరుగుతున్నాయి. ఓటర్ల పేర్లలో ఒక్కడి పేరే పలుమార్లు కనపడుతున్నది. అర్హతలేని వారిని ఓటర్లుగా చేరుస్తున్నారు. బినామీ ఓటర్లు కూడా తయారవుతున్నారు. ఒకరి బదులు మరొకరు ఓటు వేస్తున్నారు. ఇన్ని తప్పులతో ఉన్న ఎలక్టొరల్ లిస్టుల వల్ల ప్రజల నమ్మకం సడలుతున్నది. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎలక్షన్ వ్యవస్థ మీద క్రమేపీ తగ్గడానికి రాజకీయ పార్టీల పాత్ర కూడా ఉందన్న సత్యాన్ని గమనించి తగిన చర్యలు ప్రభుత్వాలూ, రాజ్యాంగ వ్యవస్థలూ తలపెట్టినప్పుడే ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు బాగుపడతాయి. చివరకు సుప్రీంకోర్టు బీహార్ రాష్ట్రంలోని ఓటర్ల నమోదులోని అవకతవకలను సమీక్షిస్తూ బీహార్‌లో తీసివేయబడ్డ ఓటర్లను నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు అయినా ఓటరుగా గుర్తింపు తెలిపే ఏ డాక్యుమెంట్ అయినా ఆన్‌లైన్‌లో గుర్తింపుకు సాక్ష్యంగా ఇస్తే చాలు అని ఆదేశించే పరిస్థితి వచ్చింది. ఎన్నికల అవకతవకలు వెలుగులోకి రావటం ఒక విధంగా మంచిదే! వాటిని సరిచేసుకొని, ఎన్నికల కమిషన్‌కు మరింత పారదర్శకంగా, వివాదరహితంగా ఎన్నికలు నిర్వహించడానికి అవకాశం వచ్చినట్లయింది. రాజకీయ పార్టీలు కూడా తమ స్వపక్ష వాదాలు పక్కనపెట్టి, సరైన ఎన్నికల నిర్వహణకు తోడ్పడవచ్చు. పార్టీరహితమైన ఆలోచనలు సమిష్టిగా చేయగలిగితే ప్రజలకు మేలు చేసినవారు అవుతారు. ఎన్నికలల్లో రాజకీయ నాయకులు మరింతగా తలదూర్చకపోతే, ఓటర్లు తమ బాధ్యతను గుర్తించి నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోగలరు. అప్పుడు అభివృద్ధి పొందుతున్న ప్రజాస్వామ్యం బ్రతకటమే కాకుండా దేశంలో పటిష్టంగా నిలబడుతుంది. రాజకీయాలు సక్రమంగా ఉండకపోతే ఎన్నికలు నవ్వులపాలు అవుతాయి. ప్రజాస్వామ్య విలువలను మట్టిలో కలుపుతాయి. ఎలక్టొరల్ రోల్ అప్పుడప్పుడు సక్రమంగా ఉందా లేదా అని చూసుకోవాల్సిన అవసరం బాధ్యత ఎన్నికల కమిషన్‌కు ఉంటుంది. దానిని స్వప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు తప్పుపట్టడం సమంజసంకాదు. ఓట్లు, ఓటర్లకు సంబంధించిన అంశాలలో రాజకీయ పార్టీలు, ఓటర్లు,సామాన్య ప్రజలు ఈ మధ్యన అప్రమత్తంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఖచ్చితంగా నమోదు కాబడిన ఓటర్ల లిస్టు, తప్పులు లేని లిస్టు కావాలని పట్టుబడుతున్నారు. కేరళలో లోకల్‌బాడీ ఎన్నికలలో కూడా జాగ్రత్త వహించటం వెలుగులోకి వచ్చింది.



అదే ఓటర్‌కార్డు మీద డూప్లికేటు ఓటర్ కార్డులు బయట పడటం (ఐ.డికార్డు కూడా ఉండటం) ఎన్నో ఓటర్ కార్డులు ఒకే వ్యక్తి కలిగి ఉండటం బయటపడటంతో అక్కడఓటర్లు, పార్టీ నాయకులు నానా హంగామా చేశారు. ఇంతగా విషయాలు ఇంతకు మునుపు బయటకు రాకపోయినా కొందరు ఓటర్లు న్యాయం కోసం పోరాడారు. కానీ ఇప్పుడు ప్రతి వారిలో అవగాహన పెరగడంతో అధికారుల ముందు, సంబంధిత ఎలక్టొరల్ ఆఫీసర్ల ముందు పట్టుపట్టి ప్రతి విషయాన్ని తప్పిదాన్ని మీడియాలో రాజకీయంగా ప్రచారం చేయడంతో బూత్ కమిటీ వ్యవస్థకు ప్రాధాన్యత పెరిగింది. కేరళలోనే కాదు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలోబూత్ కమిటీలు ఏర్పడి ఎన్నికలలో లొసుగులు వేలెత్తి చూపుతూ క్షేత్రస్థాయిలోనే పోరాటాన్ని పెంచారు. ఓటు విలువను ఇనుమడింపచేశారు. గతించిన రోజుల్లో గ్రామాలలో పెత్తందారులు, భూస్వాములు, వెనుకబడిన వర్గాల వారికి తెలియకుండానే వారి ఓట్లను రిగ్గింగ్ చేయటమేకాకుండా ప్రతిసారి, ఏ ఎన్నికలలోనైనా వారు నిలబెట్టిన వారే గెలిచే చక్రం తిప్పేవారు. దానితో వారికి రాజకీయ పార్టీలలో కూడా ప్రాధాన్యత పెరిగి, వారిని ఏదో విధంగా లోబర్చుకుంటే చాలు తమ అభ్యర్థులను గెలిపించుకోవచ్చు అన్న నమ్మకం పెరగడంతో చాలా చోట్ల సామాన్య ఓటర్‌కు తెలియకుండానే వారి ఓట్లు బాలెట్ బాక్స్‌లలో పడేవి. నిజాయితీగా ఎన్నికలు జరుగకపోయే ఆ రోజులు పోయాయి. నిజానికి ఎన్నికల కమిషన్ మాన్యువల్‌లో ఇలాంటి అక్రమ పద్ధతులు నివారించడానికి ఎన్నో మార్గదర్శక సూత్రాలు పొందుపర్చారు. ఉదాహరణకు హెచ్చుసంఖ్యలో ఒకే ఇంటి నుంచి ఓట్ల నమోదు కోసం ఎన్నో దరఖాస్తులు ఇవ్వడం నిషిద్ధంఅయితే ఒకే కుటుంబంలో నిజంగా ఎక్కువ సంఖ్యలో దరఖాస్తుదారులు, సభ్యులుగా ఉంటే ఎంక్వైయిరీ చేసి అనుమతించవచ్చు. బూత్ లెవల్ ఏజెంట్ల పాత్రను గురించి ప్రస్తావించక తప్పదు. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టినదే బూత్‌స్థాయిలో ఏజెంట్ల పాత్ర. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు బూత్‌స్థాయి అధికారులకు సహాయపడొచ్చు. బూత్ లెవల్ ఏజెంట్లుగా గుర్తించబడాలంటే వారు అదే చోట ఎలక్టొరల్ లిస్టులో ఓటర్‌గా నమోదు కాబడి ఉండటం తప్పనిసరి. వాళ్ల ముఖ్య కార్యక్రమం కొత్త ఓటర్లను నమోదు చేసుకోవాలన్నా, చెల్లుబాటులో లేని ఓటర్లను తొలగించాలన్నా డ్రాఫ్ట్ రోల్స్‌ను పరిశీలించే అవకాశం వారికిఉంది. తప్పులు సరిదిద్దే పనితోపాటు ఏ లోపాన్నైనా సవరించే బూత్ లెవల్ ఆఫీసర్‌కు సహాయపడవచ్చు. ఎలక్షన్ కమిషన్ అందుకనే రివిజన్ దశలో బూత్ కమిటీలు ఏంచేస్తున్నట్లు అన్న సహేతుకమైన ప్రశ్నను, తప్పులను ప్రశ్నిస్తున్న రాజకీయ పార్టీల ముందు లేవనెత్తింది. ఏది ఏమైతేనేం కేవలం ఎన్నికల కమిషన్ మీదనే భారంఅంతా వేసి వాతావరణం ఎన్నికల్లోఅనుకూలంగా లేకపోతే రాజకీయ పార్టీలు ఏదో లొసుగులను వెలికితీసి కమిషన్‌ను తప్పుపట్టడం అలవాటు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా, పార్టీలకున్న పాత్ర ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో ఏ విధంగా సహకరించాలన్న మూలసూత్రాన్ని విస్మరిస్తున్నారు. 1990 లో శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు కమిషన్‌కు పదునైన పనితీరును, ఎలక్టొరల్ అక్రమాలను ఎదుర్కోటానికి మాన్యువల్‌ను దుమ్ముదులిపి చట్టపరంగా చర్యలు ఎవరినీ లెక్క చేయకుండా చేపట్టడంతో ప్రతిభతోకూడిన బలమైన ఎన్నికల కమిషన్‌గా శేషన్‌కమిషన్ ప్రపంచ చరిత్రలోనే మిగిలిపోయింది. ఎన్నికల్లో అభ్యర్థులు పార్టీలు హద్దును అతిక్రమించి ఖర్చు పెట్టున్నప్పుడు తీసుకుంటున్న చర్యలు పేలవంగా ఉన్నాయి. ఎన్నికల పండుగను డబ్బులు సంపాదించే పండుగగా ఓటర్లు భావించేస్థితికి మన నాయకులు తీసుకొని వచ్చారు. ఓటర్లు తమకు ఉన్న విలువగమనించి బాధ్యతగా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాజకీయపార్టీలు స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిధిలోన్యాయంగాఎన్నికలు జరిగేట్లు చూడాలి. అప్పుడేఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టే హక్కు ఎవరైనా పొందగలరు. ●

# 'బై వన్, గెట్ వన్'లో లాభ నష్టాలెంత!

డి జె మోహన రావు

అత్యుత్తమమైనదిగా కనిపించేది అబద్ధం కావచ్చు. ఒకటి కొంటే ఒకటి ఉచితం అనే నినాదం వెనుకనున్న వాస్తవం ఇదే. ఒక వస్తువు కొనుగోలుపై మరొకటి ఉచితం అని ప్రకటిస్తే మన మనసులో ఏదో ఒక మూల సంతోషం కలుగుతుంది. 'బై వన్ గెట్ వన్ ఫ్రీ' (బోగో) అనే ఈ నినాదం వినియోగదారుల మనస్తత్వంలో ఒక లోతైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఒక ఆకర్షణీయమైన బహుమతిలా కనిపించినా దాని వెనుక బలమైన వాణిజ్య వ్యూహాలు దాగి ఉంటాయి. నేటి వినియోగదారుడిగా మనం కేవలం ఆకర్షణకు లోనై కాకుండా, దీనిలోని ఆర్థిక గూఢార్థాలను విశ్లేషించడం అవసరం. ఇది కేవలం ఒక ఆఫర్ కాదు. మన ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేసే ఒక శక్తివంతమైన సాధనం. వ్యాపార సంస్థలకు ఈ ఆఫర్ కేవలం అమ్మకాలను పెంచుకునే సాధనం మాత్రమే కాదుఇది ఒక సమగ్రమైన వాణిజ్య వ్యూహం. ఒక సంస్థ తమ గోడౌన్లలో పేరుకు పోయిన పాత సరుకును త్వరగా ఖాళీ చేయడానికి ఇది ఒక సమర్థవంతమైన మార్గం. అలా చేయడం వల్ల కొత్త సరుకుకు స్థలం దొరకడమే కాకుండా నిల్వ ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయి. అంతేకాకుండా ఇది మార్కెట్లోకి కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తులకు ఒక వేదికగా పనిచేస్తుంది. ఈ ఆఫర్ ద్వారా ఒక వస్తువు ధరకే రెండు వస్తువులు వస్తాయి కాబట్టి వినియోగదారులు ఆ కొత్త ఉత్పత్తిని ప్రయత్నించడానికి సుముఖత చూపుతారు. ఈ వ్యూహం సంస్థకు ఒకేసారి రెండు లక్ష్యాలను సాధించే అవకాశాన్ని ఇస్తుంది. పాత నిల్వలను తగ్గించడం, కొత్త ఉత్పత్తికి మార్కెట్‌ను సృష్టించడం. మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవడానికి, తమ సంస్థ అత్యుత్తమమైన ఆఫర్లను అందిస్తుందని నిరూపించుకోవడానికి కూడా ఈ వ్యూహం ఉపయోగపడుతుంది. బొగో ఆఫర్‌ను పైపైన చూసినప్పుడు అది పూర్తిగా మనకు లాభదాయకంగా కనిపిస్తుంది.






మనం తరచుగా ఉపయోగించే వస్తువులపై ఈ ఆఫర్ ఉన్నప్పుడు, మన జేబుకు నిజంగానే కొంత ఉపశమనం లభిస్తుంది. కానీ దాని వెనుక ఉన్న కొన్ని సున్నితమైన అంశాలను మనం తప్పకుండా గమనించాలి. అనేక సందర్భాలలో వ్యాపారులు అసలు వస్తువు ధరను కృత్రిమంగా పెంచి ఆ తర్వాత ఈ ఆఫర్‌ను ప్రకటిస్తారు. అంటే, మనం రెండు వస్తువుల ధరను ఒకే వస్తువుపై చెల్లిస్తున్నామని మనకు తెలియకుండానే మోసపోతాం. అంతేకాక, ఈ ఆఫర్‌కు ఆకర్షితులై మనకు అవసరం లేని వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా మన డబ్బును దుబారా చేస్తాం. ఇది మనకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోగా, మన జేబుకు మరింత భారం అవుతుంది. ఈ ఆఫర్లను చూసి అనవసరమైన కొనుగోళ్లు చేయడం వల్ల మనకు ఉపశమనం లభించకపోగా, ఇంట్లో వాడని వస్తువుల నిల్వ పెరుగుతుంది. అమ్మకాల ఒత్తిడికి లోనుకాకుండా తెలివైన కొనుగోలుదారుడిగా ఉండటమే ఈ మాయాజాలం నుండి బయటపడే మార్గం. ఈ ఆఫర్‌ను చూసిన వెంటనే ఉద్వేగపూరితమైన నిర్ణయాలు తీసుకోకుండా ఒక నిశ్శబ్దమైన విశ్లేషణ చేయాలి. ఆ వస్తువు మీకు నిజంగా అవసరమా అని ప్రశ్నించుకోవాలి. అవసరం అనుకుంటే ఒకటి కొంటే ఒకటి ఫ్రీగా వస్తుందంటే సంతోషమే. అవసరం లేకున్నా కొనుగోలు చేయడం అంటే డబ్బులు వృథా. కొంతమంది ముందుకు ఎప్పుడన్నా ఉపయోగపడుతుందిలే అనుకుంటారు. అలాంటి వారు చాలా మంది ఉన్నారు. ఆఫర్‌లో ఉన్న వస్తువు అసలు ధరను ఇతర చోట్ల పరిశీలించాలి. దాని నాణ్యతను గురించి తెలుసుకోవాలి. బైన్ వన్ గెట్ వన్ ఫ్రీ కేవలం 'ఉచితం' అనే పదం కోసం అనవసరమైన వస్తు వులను కొనడం మన ఆర్థిక భవిష్యత్తుపై చేసే ఒక బలహీనమైన దాడి. ఎందుకంటే అత్యుత్తమమైన ఆదా అనేది ఆకర్షణీయమైన ప్రకటనల నుండి రాదు. అది మీ అవగాహనతో కూడిన, తెలివైన కొనుగోలు నిర్ణయాల నుండి మాత్రమే వస్తుంది. కాబట్టి ఇకపై మనం ఇటువంటి ఆఫర్‌ను చూసినప్పుడు కేవలం ఒక ఆఫర్‌గా కాకుండా అది ఒక ఆర్థిక పరీక్షగా భావించి, విజయవంతంగా దాటాలి. ●

# పంచాయతీలే ప్రగతికి పట్టుకొమ్మలు



డాక్టర్ తిరునహరి శేషు

దేశ ప్రగతికి పంచాయతీలే పట్టుకొమ్మలు గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యంగా భావిస్తాం కాబట్టి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం, గ్రామీణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లలో నిధుల కేటాయింపు, ప్రత్యేక కార్యక్రమాలు, పథకాల రూపకల్పనతో పాటు ప్రణాళికలలో కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణ స్వభావికంగా వ్యవసాయక రాష్ట్రం 61 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తుంది కాబట్టి రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ అభివృద్ధి రంగాలకి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించటమే కాదు పల్లె ప్రగతి లాంటి ప్రత్యేక కార్యక్రమాలను కూడా రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్‌లలో గ్రామీణాభివృద్ధి కోసం సగటున 30 వేల కోట్ల రూపాయలను కూడా కేటాయిస్తుంది. దశాబ్దాలుగా గ్రామపంచాయతీల నిధులు, విధుల విషయంలో వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామ పంచాయతీలు స్వయం పోషక ఆర్థిక వ్యవస్థలు కాకపోవటం వలన నిధుల కోసం గ్రామపంచాయతీలు ప్రభుత్వాలు ఇచ్చే నిధులు, గ్రాంట్స్‌పై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదల చేసే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించే నిధులే గ్రామ పంచాయతీలకి ప్రధాన ఆర్థిక వనరులు అయితే ప్రభుత్వాలు సకాలంలో గ్రామపంచాయతీలకి నిధులు విడుదల చేయకపోవటం వలన గ్రామీణ ప్రాంతాలలో పౌర సేవలు అందించడంలో, మౌలిక సదుపాయాలు కల్పించడంలో పంచాయితీ పాలకవర్గాలు వైఫల్యం చెందుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2019లో మొదటిసారి 12,751 గ్రామపంచాయతీలకి ఎన్నికలను నిర్వహించారు కాబట్టి 2020 నుండి ప్రతి సంవత్సరం కేంద్రం నుండి పంచాయతీలకు 1430 కోట్ల రూపాయల నిధులు విడుదలైనాయి. 2020-21 నుండి 2023-24 వరకు 6051 కోట్ల రూపాయల నిధులు పంచాయతీలకు కేంద్రం నుండి అందినాయి. కానీ 2024 ఫిబ్రవరి నుండి ఎన్నికైన గ్రామ పంచాయతీల పాలక వర్గాల కాల పరిమితి ముగిసిపోవటం పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోకి రావటం రాష్ట్ర ప్రభుత్వం గత 19 నెలలుగా గ్రామ పంచాయతీలకి ఎన్నికలు నిర్వహించకపోవటం వలన 15



వ ఆర్థిక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీలకు రావలసిన 1514 కోట్ల రూపాయలను నిలిపివేసింది. అలాగే 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రావలసిన 1477 కోట్ల రూపాయల నిధులను కూడా నిలిపివేసే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహించకపోవటం వలన దరిదాపు 3000 కోట్ల రూపాయల నిధులు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఒకవైపు కేంద్రం నుండి వచ్చే నిధులు రాకపోవటం మరొకవైపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవటం వలన ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామ పాలనా వ్యవస్థ పడకేసిందనే చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధం, వీధి దీపాలు, డ్రైనేజ్ వ్యవస్థ, త్రాగునీరు, రోడ్లు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపిక, సాధారణ పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2019లో మొదటిసారి గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. మళ్లీ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు 12,778 గ్రామపంచాయతీలకు సెప్టెంబర్ 30 లోపు రెండోసారి ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించబోతుంది. అయితే అవినీతి రహిత, అంకితభావం, సమర్థవంతమైన వారిని పంచాయతీ ప్రెసిడెంట్‌లుగా ఎన్నుకోవడం ద్వారా గ్రామ పాలనావ్యవస్థని కొత్త పొంతలు తొక్కించవచ్చు. అలాగే గ్రామీణ అభివృద్ధి పట్ల ప్రభుత్వ దృక్పథం, వ్యూహాలు కూడా మారాలి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధి సాధనలో ఒక విప్లవాత్మకమైన మార్పుగానే చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత కార్యక్రమాలను సమర్థవంతంగా ఉపయోగించటం, విద్యా, ఆరోగ్యం, పారిశుధ్యం, త్రాగునీరు, రోడ్లు, విద్యుత్, పేదలకి పక్కా ఇళ్ళు లాంటి మౌలిక వసతులను కల్పించటం, వ్యవసాయ ఆధార, అనుబంధ రంగాలు, చేతివృత్తులు, గ్రామీణ చిన్న పరిశ్రమల విస్తరణ ద్వారా ఉపాధి రంగాన్ని విస్తరించటం, ఆధునిక సాంకేతికతతో గ్రామీణ వ్యవస్థని అనుసంధానం చేయటం ద్వారా గ్రామీణ అభివృద్ధిని సాధించే అవకాశాలు ఉంటాయి. గ్రామపంచాయతీలను మహిళలకు రిజర్వ్ చేసిన తర్వాత తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల ప్రగతిలో గుణాత్మకమైన మార్పు కనిపిస్తుంది. ఆళ్లగడప గ్రామపంచాయతీలో చేసిన ప్రయోగం, గంగదేవపల్లి అభివృద్ధి నమూనా, అన్నా హజారే నేతృత్వంలో రాలేగావ్ సిద్ధి అనుభవాలు రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు విస్తరిస్తే గ్రామీణ అభివృద్ధిలో నవశకం మొదలవుతుంది. అభివృద్ధిలో గ్రామీణప్రాంతాల భాగస్వామ్యం పెరగకుండా గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరగకుండా 2035 నాటికి తెలంగాణ రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగలేదనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. గ్రామీణ అభివృద్ధిని కాంక్షి ంచే ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా పంచాయతీలకి సకాలంలో ఎన్నికలు నిర్వహించటంతో పాటు నిధులు విధులతో గ్రామ పాలనా వ్యవస్థని బలోపేతం చేసినప్పుడే గ్రామీ ణాభివృద్ధి అనే స్వప్నం సాకారమవుతుంది. ●

# గుంటూరు వార్త



## పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి మరో మైలురాయి

### --రూ.3.40కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,ఆగష్టు 25,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాదుతున్నాయి.35వ డివిజన్‌లో సుమారు రూ.3.40కోట్ల విలువైన సీసీ రోడ్లు,డ్రెయిన్లు,కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు.ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..35వ డివిజన్‌లోని రఘురామ్ హాస్పటల్ నుంచి కృష్ణనగర్ 2వ లైన్ వరకు,కృష్ణనగర్ 2వ లైన్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు, కుందురోడ్డు నుంచి పిఎఫ్ ఆఫీస్ రోడ్డు వరకు,పిఎఫ్ ఆఫీస్ రోడ్డు నుండి కృష్ణనగర్ మెయిన్‌రోడ్డువరకు కృష్ణనగర్ 5వ లైన్‌నలోని చర్చి నుండి యూనియన్ బ్యాంక్ వరకు,యూనియన్ బ్యాంక్ నుండి కృష్ణనగర్ మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్లు,డ్రైయిన్లు,కల్వర్టుల నిర్మాణం జరగనుంది.అదేవిధంగా టిజేపిఎస్ కాలేజ్ రోడ్డు పక్కన క్రిస్టినా నగర్ వద్ద సీసీ డ్రెయిన్ నిర్మాణం,పేపర్ బ్లాక్ పనులు చేపడుతున్నారు.మొత్తం ఈ పనుల అంచనా వ్యయం రూ.3.40కోట్ల పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.పనుల నాణ్యతా విషయంలో కాంట్రాక్టర్లు ఎట్టి పరిస్థితుల్లో రాజీపడకూడదన్నారు.కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర,కమీషనర్ పులి శ్రీనివాసులు,కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్,జనసేన అధ్యక్షుడు బాబు,పాకాలపాటి శ్రీకాంత్ మరియు ఎన్డీయే కూటమి నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంటూరు విద్య,ఆగష్టు 25,ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.డి.మున్ను అన్నారు.వినాయక చవితి పండుగ సందర్భంగా స్థానిక సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ



చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుండే విద్యారు ్ధలు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొ ందించుకోవాలన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో చెట్లు తొలగించడం,పా ్లస్టిక్ వాడటం తదితర కారణాలతో వాతావరణ కాలుష్యం తలెత్తుతుందన్నారు.ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి వాతావరణ కాలుష్యం తలెత్తకుండా చూడాలన్నారు.గత 5సంవత్సరాలుగా జైన్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు ప్రిన్సిపాల్ కనకదుర్గ,రబ్బాని,సరోజిని,అనూష,అఖిల పాల్గొన్నారు.

## 30,31తేదీల్లో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు

గుంటూరు విద్య,ఆగష్టు 25,ప్రభాతవార్త : స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 30,31వ తేదీల్లో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సదస్సు జరుపుతున్నట్లు




అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్ పేర్కొన్నారు.స్థానిక అరండల్‌పేట 6/4 ఐఎల్‌ఏ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సదస్సు ఆహ్వాన గోడప్రతులను ఆవిష్కరించిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శాంతకుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనలో న్యాయవాదులు అనేక వీరోచితమైన పోరాటాలు త్యాగాలు చేశారన్నారు.వర్తమాన సమాజంలో దిగజారుతున్న న్యాయవ్యవస్థను గాడిన పెట్టేందుకు దేశంలోనూ,రాష్ట్రంలోనూ ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఐఎల్‌ఏ రెండు రోజుల రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ ప్రత్యేకతను సంతరించుకున్నట్లు చెప్పారు.న్యాయవాదులకు ఉచిత బీమా కార్డులు,జూనియర్ న్యాయవాదులకు 5సంవత్సరాల పాటు నెలకు రూ.10వేలు స్టైఫండ్,ఇళ్ళ స్థలాలు,మరణించిన న్యాయవాదులకు రాష్ట్రప్రభుత్వం చెల్లించాల్సిన రూ.4లక్షల మ్యాచింగ్ గ్రాంట్,మరణించిన న్యాయవాదులకు డెత్ బెనిఫిట్ ను రూ.10లక్షలకు పెంచేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు తదితర అంశాలపై 2రోజుల పాటు జరిగే సెమినార్‌లో చర్చిస్తామని చెప్పారు.ముఖ్యఅతిధిగా మధ్యప్రదేశ్ హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ సురేష్‌కుమార్ కైట్,గౌరవాతిధులుగా ఏపి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ కేసి భాను,జస్టిస్ జి.శ్యాంప్రసాద్,డాక్టర్ ఎన్.జేసు రత్నకుమార్,జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి,పార్లమెంట్ సభ్యులు డాక్టర్ టి.తిరుమలన్,ఐఎల్‌ఏ తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బి.కార్తిక్ నవ్యాన్,సీనియర్ న్యాయవాదులు రవివర్మకుమార్,ఏ.సత్యప్రసాద్,ఇతర ప్రముఖులు పాల్గొని సందేశాలతో పాటు అనేక విషయాలపై చర్చిస్తారని చెప్పారు.విలేకరుల సమావేశంలో ఐఎల్‌ఏ వ్యవస్థాపకులు శ్రీకాంత్ చింతల,రాష్ట్ర నాయకులు పి.నరసింహుడు,జిల్లా అధ్యక్షురాలు ఎం.ఈ.గీతారాణి,నగర అధ్యక్షులు మొగల్‌కాలేషా బేగ్,న్యాయవాదులు,బండారు సాయిబాబు,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## జీసికెవిఎన్ డిగ్రీ కళాశాల్లో “బిజినెస్ ప్రమోషన్” పై ముగిసిన వర్క్‌షాప్

గుంటూరు విద్య,ఆగష్టు 25,ప్రభాతవార్త : స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల్లో గత 2రోజులుగా బిజినెస్ ప్రమోషన్ పై జరుగుతున్న వర్క్‌షాప్ ముగిసింది.ఈ వర్క్‌షాప్‌ను అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో స్థిరపడిన ప్రవాస భారతీయురాలు కర్పూరపు హరితభాయి ముఖ్యవక్తగా ఉండి



నడిపించారు.తొలుత కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు ముఖ్యవక్త హరితభాయిని సభకు పరిచయం చేస్తూ ఏహెచ్‌ఆర్ఐ వంటి ప్రముఖ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తూ,భారత పర్యటనలో భాగంగా కళాశాలకు విచ్చేసి,విద్యార్థులకు బిజినెస్ ప్రమోషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించడం సంతోషించదగిన విషయమన్నారు.ప్రవాస భారతీయురాలు వక్త హరితాభాయి మాట్లాడుతూ నేడు ప్రపంచం ఇంతగా అభివృద్ధి చెందిందంటే దీని వెనక బిజినెస్ ప్రముఖ భూమిక ఉన్నట్లు చెప్పారు.ఏ దేశం కూడా ఇతరులపై ఆధారపడకుండా తనకు తానుగా సొంతంగా స్వయం సమృద్ధి సాధించలేదన్నారు.విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో ప్రముఖ మల్టి నేషనల్ కంపెనీల్లో జరిగే మార్కెటింగ్ సిస్టంను డిజిటల్ టీవి పై వివరించారు.వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో బాపూజి కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు ఇలాంటి వర్క్‌షాపులు నేటి తరం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు మార్కెటింగ్ రంగం అత్యున్నతంగా అభివృద్ధి చెందుతుందని,విద్యార్థులు చిన్నపాటి వ్యాపారాలతో ఆదిశగా తమ ఆలోచనలను కలిగి ఉండాలన్నారు.వర్క్‌షాప్‌లో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీధర్,చంద్రశేఖర్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## 28న ఉమ్మడి గుంటూరు జిల్లా డిఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

గుంటూరు విద్య,ఆగష్టు 25,ప్రభాతవార్త : ఉమ్మడి గుంటూరు జిల్లా డిఎస్సీ ఎంపిక అభ్యర్థులకు ఈనెల 28న ఆంధ్ర క్రైస్తవ కళాశాల్లో ఉదయం 9నుంచి సర్టిఫికేట్లు పరిశీలన కార్యక్రమం ప్రారంభం కానుంది.సర్టిఫికేట్ల పరిశీలన కార్యక్రమంలో అప్లోడ్ చేసిన ఒరిజినల్ సర్టిఫికేట్లు అభ్యర్థులు చూపాల్సి ఉంటుంది.ఎస్ఎస్‌సీ ,ఇంటర్,డిగ్రీ ఫర్ టిజిటి స్కూల్ అసిస్టెంట్స్,పిజీ ఫర్ పిజిటి,టిటిసి, తదితర పాస్ సర్టిఫికేట్లతో పాటు మార్కుల మెమోలను కూడా ఆయా అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలనకు తీసుకురావాల్సి ఉంటుంది.ఎస్సీ,ఎస్టీ,బిసి,ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు వారి కుల పత్రాలను తీసుకురావలి,లోకల్‌నివాస ధృవీకరణ కొరకు 4నుంచి 10వ తరగతి వరకు చదివిన 7సంవత్సరాల స్టడీ సర్టిఫికేట్లు తీసుకురావాలి,మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌గా ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా అనుభవ సర్టిపికేట్లు పరిశీలనకు తెచ్చుకోవాలి, సర్టిఫికేట్లు పరిశీలనకు రాని అభ్యర్థుల పేర్లు సెలక్షన్ లిస్ట్ నుండి రామూవ్ చేయబడతాయి.మెరిట్ లిస్టులోని తదుపరి మెరిట్ అభ్యర్థికి అవకాశం కల్పించబడుతుంది.అంతర్ జిల్లాల బదిలీల కంటే ముందుగానే డిఎస్సీ నియామకాలు జరగనున్నాయి.

## మెగా డిఎస్సీతో నిరుద్యోగులకు ‘కూటమి’ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది: ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,ఆగస్టు25,ప్రభాతవార్త: 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. సోమవారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సీఎం



చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డిఎస్సీపై చేసి తక్కువ సమయంలోనే పారదర్శకంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఐదేళ్ళ జగన్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. డిఎస్సీని అడ్డుకునేందుకు వైకాపా 24 కేసులు వేసి ఎన్ని కుట్రలు చేసినా వాటన్నింటిని అధికమించి మంత్రి లోకేష్ నిరుద్యోగుల ఆశలు నెరవేర్చారని పేర్కొన్నారు. ఇదే కేవలం ఉద్యోగాల భర్తీ కాదని వేలాది కుటుంబాల భవిష్యత్తు అని అన్నారు. ఇకపై ఏటా డిఎస్సీ విడుదల చేయడం జరుగుతుందని నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు.

## ‘ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు’



నూజెండ్ల,ఆగస్టు25,ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలను మండల తహశీల్దార్ రమేష్ కుమార్,మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, మండల ఎస్సై బి.వి కృష్ణారావులు సోమవారం తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్,ఈ పాస్ మిషన్,గోడౌన్ నిల్వలు,స్టాక్ బోర్డులు,బిల్ బుక్స్ పరిశీలించారు. రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటి చైర్మన్ షేక్ కరిముల్లా

చిలకలూరిపేట,ఆగస్టు25,ప్రభాతవార్త: పట్టణంలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జరిగిన కమిటి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి 43 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పార్టీకి సేవలు అందించిన సేవలకు గుర్తింపుగా మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులుప్రత్తిపాటి పుల్లారావు యార్డ్ చైర్మన్‌గా తనను ఎంపిక చేయడం జరిగిందని, తనకు లభించిన పదవి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త తామే పొందినట్లుగా



భావించారని కరిముల్లా తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి గుర్రాల చావిడినుంచి యార్డ్ వరకు తలపెట్టిన భారీ ర్యాలీలో కూటమి నేతలు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కార్యక్రమంలో తన అభ్యర్ధనని మన్నించి పాల్గొన్న రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, యంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఛీఫ్‌విఫ్ జివి ఆంజనేయులు, జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబులకు, నియోజకవర్గ పరిధిలోని అన్ని హోదాలలో ఉన్న పార్టీ నాయకులకు పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా తెలియచేశారు. అదేవిధంగా ర్యాలీ సందర్భంగా పట్టణంలో ప్రజలకు ట్రాఫిక్‌కు ఏమాత్రం అంతరాయం కలుగకుండా ముందుగానే ప్రణాళికాబద్దంగా ఏర్పాట్లు చేసిన పోలీస్ అధికారులకు ప్రత్యేకించి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ‘కన్నా’

సత్తెనపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో సోమవారం పిఏసిఎస్ ఛైర్మన్ చిమట పోలురాజు, మెంబర్స్‌గా కొల్లా కోటేశ్వరరావు, బొపూడి లక్ష్మణ్‌రావుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా





ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కోఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకం అన్నారు. కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సొసైటీలో బకాయిలు త్వరగా చెల్లించేలా చూసి అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. రైతన్నలకు మాట ప్రకారం మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రూ.12,500లు ఇస్తామని చెప్పి కేవలం రూ.7500లు మాత్రమే ఇచ్చిందన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందన్నారు. తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంత మంది ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుంటే జగన్ వాటిని చూసి ఓర్వలేక విష ప్రచారాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, యువతకు ఉద్యోగాలు వంటి హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడు

చిలకలూరిపేట,ఆగస్టు25,ప్రభాతవార్త: ప్రజలకు మంచి చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడని, హంద్రీనివా ద్వారా కృష్ణా నీటిని కుప్పానికి తరలించిన ఆయన సంకల్పంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు సంతోషానికి అవధులులేదని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ పక్కన నూతనంగా చేపట మార్కెట్,మాంసం మార్కెట్ల దుకాణ సముదాయానికి ఆయన శంఖుస్థాపన చేశారు.




**3నెలల్లో దుకాణ సముదాయ నిర్మాణం పూర్తికావాలి**

పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు అందించడంలో కూటమి ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల విషయంలో అధికార యంత్రాంగం వేగవంతంగా స్పందించాలని ప్రత్తిపాటి సూచించారు. రూ 1.22 కోట్లతో చేపట్టిన నూతన చేపల,మాంసం మార్కెట్ సముదాయం నిర్మాణ పనులు 3 నెలలో పూర్తికావాలని, పనులకు సంబందించిన ప్రగతిని ప్రతినెలా తనకు తెలియచేయాలని ప్రత్తిపాటి స్థానిక మున్సిపల్ డిఈ రహీంను ఆదేశించారు. పనులలో నాణ్యత లోపించినా, సకాలంలో పూర్తి అవ్వకపోయినా అధికారులే భాద్యులవుతారని ప్రత్తిపాటి హెచ్చరించారు. దుకాణాలు నిర్మించి తమకు అప్పగించాక వ్యాపారులు వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, రోడ్లపై వ్యర్ధాలు, ట్రాఫిక్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

**సంక్షేమం పేరుతో రాష్ట్రాన్నే ఊడ్చేసిన జగన్:**

గతంలో హంద్రీనీవా కాలువలో నీళ్ల సెట్టింగ్ వేసిన జగన్ నాడు ప్రజలను మోసగించి తన పబ్బం గడుపుకున్నాడని ప్రత్తిపాటి అన్నారు. నేడు చంద్రబాబు పట్టుదలతో నీటిని తరలించి తన ప్రాంత ప్రజల కష్టాలు తీర్చాడని తెలిపారు. సినిమావాళ్ల లాగా సెట్టింగులు వేసి జనాలను మోసగించిన నాడే జగన్ బండారం బయటపడిందని అన్నారు. ఆయన పనితనం కేవలం మాటలకే పరిమితమని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రజలకు పావలా ఇచ్చిన జగన్, సంక్షేమం పేరుతో తన అవినీతి మీడియాలో అంతకు పదింతలు ఊదరగొట్టించుకొని చివరకు రాష్ట్రాన్నే ఊడ్చేశారని ప్రత్తిపాటి విమర్శించారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులతో సహ అన్ని వర్గాల ప్రజల ఆలోచనలు పసిగడుతూ సంక్షేమ పథకాలలో కూడా నూతన విధానాలు ప్రవేశపెట్టడం చంద్రబాబుకే సాధ్యమైందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమీషనర్ పతి శ్రీహరిబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ కందుల రమణ, వార్డు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి తిరుగులేని రక్షణ కవచం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

### మార్కెట్ యార్డ్ కమిటి నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన షేక్ కరిముల్లా

చిలకలూరిపేట,ఆగస్టు25,ప్రభాతవార్త: తెలుగుదేశం జెండా అంటే నమ్మకానికి, రక్షణకు ప్రతిరూపమని, పార్టీకోసం శ్రమిస్తున్న టిడిపి సైనికులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి రక్షణతోపాటు వారి కుటుంబాలసంరక్షణ భాద్యతలను భుజాన వేసుకున్న నాయకుడు చంద్రబాబు అని, అటువంటి నాయకత్వంలో పనిచేయడం మనందరి అదృష్టమని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.ఆదివారం రాత్రి పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా నియమితులైన షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, డైరక్టర్ల ప్రమాణ



స్వీకారోత్సవ కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.

**మూడు పార్టీల సమిష్టి పోరాటంతో వైసిపి అడ్రెస్ గల్లంతే : ఎమ్మెల్యే ప్రత్తిపాటి**

వైసిపి విషప్రచారాన్నే నమ్ముకుందని జగన్ అతని బృందాన్ని కోలేకోలేని విధంగా దెబ్బకొట్టాలంటే టిడిపితో పాటు జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పోరాడాలని, అప్పుడే వైసిపి అడ్రస్ గల్లంతు అవుతుందని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. మారిన రాజకీయ పరిస్దితుల కారణంగా పార్టీ కోసం కష్టపడిన నాయకులకు సరైన పదవులు లభించలేదని ప్రత్తిపాటి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న గౌరవంతోప్రజల కోసం ఒక సత్సంకల్పంతో పనిచేయాలని ప్రత్తిపాటి కోరారు. సూపర్-6 హిట్ పేరిట సెప్టెంబర్ 6వ తేదిన అనంతపురంలో నిర్వహించే భారీసభను కూటమి శ్రేణులు కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు జగన్ ఖాళీఖజానా అప్పగించినా, విధ్వంసపు పాలన చేసినా, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తూ, మరోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చంద్రబాబు 75 ఏళ్ల వయసులో తీవ్రంగా కష్టపడుతున్నారనే నిజాన్ని టిడిపి శ్రేణులు గుర్తించాలని అన్నారు. ఆయన కష్టంతో పోలిస్తే పదవులు, గుర్తింపుల పట్ల ఉండే అసంతృప్తి చాలా చిన్నదని అన్నారు. వైసిపి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతో కూడా మూడుపార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేయాలన్నారు. ఆధిపత్య ధోరణి వీడి అందరూ రాష్ట్ర



హితం కోసం పనిచేయాలన్నారు. మన నాయకుడిని చేదోడుగా అందరం ఒకే త్రాటిపై నిలిచినప్పుడేకూటమి ప్రభుత్వం సుధీర్ఘకాలం అధికారంలో ఉంటుందన్నారు. అప్పుడే రాష్ట్రం ప్రగతిపధాన నిలిచి దేశంలోనే నెంబర్ 1గా నిలుస్తుందన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ నాయకత్వం పల్నాడు జిల్లా ప్రజలకు నిజంగా అదృష్టమని, ప్రతి నాయకుడుని కార్యకర్తలను సంతోషపెట్టటమే లక్ష్యంగా యంపి లావు శ్రీకృష్ణదేవరాయలు పనిచేస్తున్నారని తెలిపారు. పదవులు తీసుకోవడంతో పాటు ప్రజల హృదయాలలో నిలిచేలా రైతుల మేలుకోసం మార్కెట్ యార్డ్ నూతన కమిటి సభ్యులు పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. టిడిపి కరిముల్లా వ్యకిత్వం, నాయకత్వ లక్షణాలు అందరిని కలుపుకుపోయే మంచితనం పరిగణనలోకి తీసుకున్నాకే పార్టీ అధినాయకత్వం ఆశీస్సులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్, యంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, తాను చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కరిముల్లాను ఎంపిక చేశామని తెలిపారు తెలుగుదేశం పార్టీ తనదన్న ధృడచిత్తం, నమ్మకంతో పార్టీకోసం కరిముల్లా సమర్ధవంతంగా పనిచేశాడని ప్రత్తిపాటి కొనియాడారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికకాబడిన పిల్లి కోటేశ్వరరావు గత పాలకుల దుర్మార్గాలు, అవినీతిపై పులిలా పోరాడారని, ముక్కు ముఖం తెలియని మాజీ అవినీతి మంత్రి తనను ఎంతగా ఇబ్బందిపెట్టినా పిల్లి కోటి ధైర్యంగా నిలబడ్డారని ప్రత్తిపాటి తెలిపారు.

**రాబోయే రోజులలో చంద్రబాబు రెట్టింపు సంక్షేమం,మునుపెన్నడూ చూడని అభివృద్ధిని అందిస్తారు : యంపి లావు శ్రీకృష్ణదేవరాయలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాదిలో ప్రజలకు అందించిన సుపరిపాలన కంటే రాబోయే కాలంలో ప్రజలకు రెట్టింపు సంక్షేమాన్ని మునుపెన్నడూ చూడని అభివృద్ధిని అందిస్తారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు పనితీరుకు మనం ఎప్పుడూ అండగా నిలిస్తే చాలని యంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన స్త్రీశక్తి పథకం తమ కాళ్లపై నిలబడి బ్రతికే ఎంతోమంది మహిళలకు ఉపకరిస్తుందని, పథకాన్ని దుర్వినియోగం చేసేవారికంటే సద్వినియోగం చేసుకునేవారే ఎక్కువ ఉన్నారని యంపి తెలిపారు. పథకం ప్రవేశపెట్టారన్న ఉత్సాహంతో మహిళలు పుణ్యక్షేత్రాలకు, ఇతర ప్రదేశాలకు తిరగటం అనేది ఎక్కువకాలం కొనసాగదని అన్నారు. సూపర్-6 పథకాలు ప్రజల మనసుల్లో నాటుకుంటే వైసిపి ఎంతగా ప్రయత్నించినా వారికి చేరువ కాలేదని యంపి తేల్చిచెప్పారు.

చిలకలూరిపేట ఎయంసి చైర్మన్‌గా నియమితులైన షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, డైరక్టర్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ఛీప్‌విఫ్ జివి ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా టిడిపి అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్, చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు నెల్లూరి సదాశివరావు, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, తేళ్ల సుబ్బారావు, జనసేన సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తోట రాజారమేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, జనసేన యువనాయకుడు మండలనేని చరణ్‌తేజ, నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల టిడిపి అధ్యక్షులు జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు,టిడిపి నాయకులు కందుల రమణ, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, గుర్రం నాగపూర్ణచంద్రరావు, ఇనగంటి జగదీష్‌బాబు, వీరారెడ్డి, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జరీనా సుల్తానా, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అమరా రమాదేవి, పోపూరి లక్ష్మీ, మున్సిపల్ కౌన్సిలర్లు,నియోజకవర్గ పరిధిలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభినందనలు తెలియచేశారు. కాగా తొలుత బారీ ప్రదర్శన యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా నివాసమైన గుర్రాల చావిడినుంచి ప్రత్యేక వాహనంపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి, చైర్మన్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటి, యార్డ్ డైరక్టర్లు అందరూ ఊరేగింపుగా పోలీస్‌సేషన్, చౌత్రాసెంటర్, రిజిస్టార్ కార్యాలయం సెంటర్, ఎన్ఆర్‌టి సెంటర్ మీదుగా మార్కెట్ యార్డ్‌కు చేరుకున్నారు. ఈ ప్రదర్శనలో వేలాదిమంది పార్టీ కార్యకర్తలు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలనుంచి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలి: కలెక్టర్



బాపట్ల,ఆగస్టు25,ప్రభాతవార్త: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు.సోమవారం, స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పాల్గొన్నారు.ప్రజా సమస్యల వినతి పత్రాలను వారు స్వయంగా స్వీకరించి, కొన్నింటికి తక్షణమే పరిష్కార మార్గం చూపించారు. కొన్నింటిని సంబంధిత శాఖ అధికారులకు అందించి ప్రతి వినతిని తక్షణమే పరిష్కరించేలా పనిచేయాలని ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో మొత్తం 190 వినతులు అందాయని, పి జి ఆర్ ఎస్ లో వచ్చే సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత చూపని అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టడాలు నిర్మించిన వాటిని జెసిబి లతో కూల్చివేయాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బాపట్ల,డి ఎల్ డి వో కు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. వార్తాపత్రికలలో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై జిల్లా కలెక్టర్ స్పందించి ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను ఆయన ప్రశ్నించారు. అధికారులు ఆయా వార్తల పై జిల్లా కలెక్టర్ కు వివరణ ఇచ్చారు. స్వామిత్వ సర్వే పురోగతిపై ఎంపీడీవోలతో ఆయన సమీక్షించారు. ప్రతిరోజు స్వామిత్వ సర్వేపై సమీక్ష నిర్వహిస్తానని, అందుకు అధికారులందరూ నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని ఆయన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివిధ శాఖలకు సంబంధించిన వివిధ ప్రభుత్వ పనులపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ పై వీక్షణ సమావేశం నిర్వహిస్తారని, అందుకు సంబంధించి సంబంధిత అధికారులందరూ నివేదికలతో వీక్షణ సమావేశమునకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. పి4 కార్యక్రమంలో నీడ్ బేస్డ్ సర్వేను 100 పూర్తి చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. తల్లికి వందనం పథకంలో ఈకేవైసీ పూర్తి చేసి లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అయ్యే విధంగా చర్య తీసుకుని పెండింగ్ లేకుండా చూడాలని ఆయన ఎంపీడీవోలను ఆదేశించారు. గ్రామాలలో, మండలాలలో, పట్టణాలలో అధిక సంతానంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు కుటుంబ నియంత్రణ పై అవగాహన కల్పించి ఆడవారికి మరియు మగవారికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొనుటకు ప్రోత్సహించి, ఆపరేషన్లు చేసిన డాక్టర్లకు, ఏఎన్ఎం లకు ప్రోత్సాహక నగదు చెక్కులను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్,పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు, డి ఎల్ డి వో లు తదితరులు పాల్గొన్నారు.

# 'దివ్యాంగుల పెన్షన్ విషయంలో అర్హత గల లబ్ధిదారులు ఎవరూ కూడా అధైర్యపడొద్దు'

బాపట్ల,ఆగస్టు25,ప్రభాతవార్త: దివ్యాంగుల పెన్షన్ విషయంలో అర్హత గల లబ్ధిదారులు ఎవరూ కూడా అధైర్యపడవద్దని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సోమవారం, స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా వికలాంగుల పెన్షన్ పై దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్లను నిజమైన లబ్ధిదారులు కాకుండా అర్హత లేని వారు కూడా పొందుతున్నారనే ఉద్దేశంతో, రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సర్టిఫికెట్లలోని శాతంపై మరియు దివ్యాంగుల స్థితి పై పునః పరిశీలన చేపట్టడమైనదని ఆయన తెలిపారు. ఈ సందర్భంలో దివ్యాంగులకు పింఛను నిలుపుదల చేయకుండా నిరంతరంగా అందజేయడం జరుగుతుందని, సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు ఒక తేదీని కేటాయించి, ఆ తేదీని దివ్యాంగులకు తెలియజేస్తారని ఆయన తెలిపారు. కేటాయించిన తేదీలలో పునః పరిశీలన కేంద్రాలకు వెళ్లి డాక్టర్లచే పరీక్ష చేయించుకోవాలని, పునః పరిశీలనలో అర్హులకు మాత్రమే పెన్షన్ అందజేయడం జరుగుతుందని, అర్హత లేని వారికి పెన్షన్ నిలుపుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు మరియు తదితరులు పాల్గొన్నారు.



# అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి: ఎస్పీ

బాపట్ల,ఆగస్టు25,ప్రభాతవార్త:అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 58 మంది అర్జీలను అందజేసినారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ పి.జి.ఆర్.ఎస్ సెల్ సీఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# వినాయకుని వేడుకలకు జాగ్రత్తలు తీసుకోవాలి

కర్లపాలెం,ఆగస్టు25,ప్రభాతవార్త:మండల పరిధిలో నిర్వహించే గణేష్ నిమజ్జనానికి నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ సీఐ హరికృష్ణ తెలిపారు. కర్లపాలెం పోలీస్ స్టేషన్లో సోమవారం మండల పరిధిలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసుకున్న కమిటీ వారితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్లపాలెం ఎస్సై రవీంద్ర మాట్లాడుతూ ప్రతి కమిటీ వారు స్టేషన్ దాకా రాకుండా ఆన్లైన్లోనే అనుమతులకు అప్లై చేసుకోవాలన్నారు. పోలీసులు వచ్చి పరిసరాలను విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే అనుమతిని మంజూరు చేస్తారన్నారు. అంతేకాకుండా నిమజ్జన సమయంలో తీసుకోవలసిన పలు జాగ్రత్తలను ఆయన వివరించారు. అసాంఘిక శక్తులు గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తారని అలాంటి వాటిని అరికట్టాలన్నారు. అనుమానిత వ్యక్తులు గణేష్ విగ్రహ పరిసరాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు అంతే కాకుండా కమిటీ వారు పూర్తి బాధ్యత వహించాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైతే పోలీసు సహకారం తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో శిక్షణ ఎస్ఐ గణేష్ నిమజ్జన కమిటీ వారు పాల్గొన్నారు.

# ఎస్‌బిఎన్ కళాశాల పూర్వ విద్యార్థికి డిఎస్సీలో ర్యాంకు



పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థి చక్రవర్తుల రఘురాం కుమార్ ఐటీఐ కుటుంబ ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌లో ఐదో ర్యాంకు, టిజిటిలో 12వ ర్యాంకు సాధించారు. సంస్కృత కళాశాలలో 2006నుంచి 2010 వరకు ప్రీ డిగ్రీ కోర్సు, బీఏఓఎల్ పూర్తి చేశారు. తాడికొండలోని గోగినేని కనకయ్య తెలుగు పండిట్ శిక్షణ కళాశాలలో తెలుగు పండిట్ శిక్షణ పొందారు. రఘు ర్యాంకులు సాధించడం పట్ల, తల్లిదండ్రులు, అధ్యాపకులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

# తిరుమలశెట్టికి మదర్ థెరిస్సా జాతీయ ప్రేరణ పురస్కారం



పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థకు మదర్ థెరిస్సా జాతీయ ప్రేరణ పురస్కారం లభించిందని సంస్థ అధినేత తిరుమలశెట్టి ఉమాశంకర్ తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెంలో సీఆర్సీ పంక్షన్ హాలులో మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచినవారికి పురస్కారాలను అందజేశారు. అందులో భాగంగా పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలశెట్టి ఉమాశంకర్ అనేక రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి ఆదర్శంగా నిలిచారు. తిరుమలశెట్టి సేవలను గుర్తించిన మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ తిరుమలశెట్టికి మదర్ థెరిస్సా జాతీయ ప్రేరణ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించింది. మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్ తిరుమలశెట్టి సేవలను కొనియాడారు.

బాపట్ల జిల్లా వార్త



# కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక పార్టీ టిడిపి: మంత్రి 'గొట్టిపాటి'

బాపట్ల,ఆగస్టు25,ప్రభాతవార్త: కార్యకర్తే అధినేత అని భావిస్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు.తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయకుడు ఆదేశాల



మేరకు సోమవారం బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాపట్ల తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్,రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్‌లతో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశీలకులతో కలిసి పార్లమెంట్ కమిటీ,అనుబంధ కమిటీ, సాధికార కమిటీల నుంచి ప్రతిపాదనలను స్వీకరించడం జరిగిందని ఆయా కమిటీల ఎంపికపై క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకుల వివరాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ఆయా కమిటీల్లో కీలక బాధ్యతలు అప్పగిస్తామని అన్నారు. ఆయా కమిటీల నియామకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయనం చేసి అధిష్టానానికి నివేదిస్తామని అన్నారు. అనంతరం కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంది. పార్టీ కోసం క్రమశిక్షణ,అంకితభావంతో పని చేసే నాయకులకు అధినేత నారా చంద్రబాబు , టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రివర్యులు నారా లోకేష్ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారని తెలిపారు.కార్యకర్తే అధినేత అని భావిస్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని సగర్వంగా తెలియజేస్తున్నానన్నారు.రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి కార్యకర్తలు ప్రతి ఎన్నికల్లో అండగా ఉన్నారని అందుకు ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు పెట్టి ,వేధించినప్పటికీ వాటికి ఏమాత్రం భయపడకుండా టిడిపి విజయమే ధ్యేయంగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కష్టంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కార్యకర్తలే టీడీపీకి కొండంత బలం అని అన్నారు. బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలుగుదేశం పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తించి అలాంటివారికి ప్రభుత్వంలో పెద్దపీట వేసిందని తెలిపారు. టిడిపి జిల్లా కమిటీలో ఎంతో పారదర్శకంగా అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించేలా పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీ వేసి జిల్లా టీడీపీ అధ్యక్షునితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేస్తోందని తెలిపారు.సామాన్య కార్యకర్తలకు కూడా తెలుగు దేశం పార్టీ గుర్తించి ఈ కమిటీల్లో ఎంపిక చేసి పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ ఎంతో నిబద్ధతతో ,క్రమశిక్షణకు పెద్దపీట వేసిందని చెప్పడానికి ఇదే నిదర్శనం అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేపట్టిందని తెలిపారు. ఎన్నికలకు ముందు టిడిపి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదిలోపే అమలు చేసి సూపర్ హిట్ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పేదల పక్షపాతి అని కొనియాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి పని చేయాలని అన్నారు. అదే విధంగా సీని హీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ల సీని రంగ ప్రస్థానం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ కి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్లో చోటు సంపాదించడం ఎంతో అభినందనీయమని ఆయనకు ప్రత్యేకంగా బాపట్ల నియోజకవర్గ ప్రజల తరఫున ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య,వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు,సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ , తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబి రెడ్డి, శాసనమండలి సభ్యులు,చీప్ విప్ శ్రీమతి పంచుమర్తి అనురాధ , వీరంకి వెంకటగురుమూర్తి , మన్నే సుబ్బారెడ్డి , రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ మరియు బాపట్ల పార్లమెంట్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకాని పూర్తిస్థాయి అధికారులు

కర్లపాలెం,ఆగస్టు25,ప్రభాతవార్త: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలో ఉన్న అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి కానీ తూతూ మంత్రంగా కేవలం కొంతమంది అధికారులు మాత్రమే హాజరు కావడం పట్ల మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ప్రతి సేకరించి ఆ శాఖ అధికారి హాజరై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను పరిష్కరించడానికి వీలుగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కీలక అధికారుల డుమ్మా కొడుతున్నారు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అన్ని శాఖల అధికారులు హాజరైతే ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించే అవకాశం ఉంటుందని మండల ప్రజానీకం విజ్ఞప్తి చేస్తున్నారు



# విష జ్వరాలు ప్రబలకుండా ఫాగింగ్

పిట్టలవానిపాలెం,ఆగస్టు25,ప్రభాతవార్త: డెంగ్యూ మరియు విష జ్వరాలు ప్రబలకుండా గ్రామం లో ఫాగింగ్ చేస్తున్నామని సర్పంచ్ కుంతం అనూష ప్రసన్నరాజుఅన్నారు.సోమవారం పిట్టలవానిపాలెం మండలం ఖాజీ పాలెం గ్రామపంచాయతీ పరిధిలో డెంగ్యూ మరియు విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, గ్రామ సర్పంచ్ కుంతం అనూష ప్రసన్నరాజు ఆధ్వర్యంలో గ్రామంలో ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ ఎంపీడీవో ఎలీషా బాబు, గ్రామ సెక్రెటరీ శివకుమార్, ఎస్ సి ఓ షేక్ షకీల్, ఎంపీహెచ్ ఈవో నాగేశ్వరరావు, హెచ్ ఎస్ యు నరసింహారావు, ఎం పి హెచ్ ఎ షేక్ హసన్ జానీ, ఎం ఎల్ హెచ్ పి రాజకృపానిధి మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# శ్రీచెన్నకేశవ స్వామి వారి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పిట్టలవానిపాలెం,ఆగస్టు25,ప్రభాతవార్త: శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానమునకు నియమించిన 9 మంది సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహమూర్తి తెలిపారు. సోమవారం పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న సభ్యులతో ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులను దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీరామచంద్ర మోహన్ ఆదేశముల ప్రకారము దేవస్థానములో ఉదయం 9:30 నిమిషాలకు బాపట్ల డివిజన్ ఇన్స్పెక్టర్ ఎం గోపి ఆధ్వర్యంలో సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులందరు కలిసి ఎండూరి సాయి గుప్తాను శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడటం జరిగిందని బాపట్ల డివిజన్ ఇన్స్పెక్టర్ గోపి తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి ఆలయ అర్చక స్వాములు అభిమానులు ప్రజాప్రతినిధులు దేవస్థానం సిబ్బంది హాజరయ్యారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలియపరిచారు



# గ్రామీణుల కోసమే ఉచిత క్యాంపులు ఏర్పాటు



పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాలలోని వారికి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా వారికి సేవ చేయవచ్చనే ఉద్దేశంతో ఫ్రీ గ్రేస్ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని సంస్థ అధినేత డాక్టర్ నిస్సీ జోసఫ్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిస్సీ జోసఫ్ మాట్లాడుతూ గ్రామీణులు ప్రత్యేకంగా పట్టణానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొనేందుకు నిర్లక్ష్యంగా ఉంటారని, అలాంటి వారికి తమ సంస్థ సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామీణులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సేవే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ శిబిరంలో అమెరికా నుంచి ఫుల్ బ్రైట్ స్కాలర్ డాక్టర్ శేఖర్, డాక్టర్ డెహనాజ్, డాక్టర్ మాధవి నెల్లూరి డాక్టర్ చౌశ ంత్, తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రవి, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య రూపకంలో కృష్ణకిషోర్‌కు సత్కారం



పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా హైదరాబాదు శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర కళాపరిషత్‌లో జరిగిన సాహిత్య రూపంలో ఎం.కృష్ణకిషోర్ పాల్గొని ప్రశంసలు పొందారు. సాహిత్య రూపకంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగా కృష్ణకిషోర్ తనదైన శైలిలో పాత్ర ధరించి ఆహుతుల మన్ననలు అందుకొన్నారు. కృష్ణకిషోర్ శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థి, విశ్రాంత తెలుగు పండితులు కావడంతో ఆయన అభిమానులు, తోటి స్నేహితులు, సహోపాధ్యాయులు, బంధువులు కృష్ణకిషోర్‌కు అభినందనలు తెలిపారు. కృష్ణకిషోర్ రానున్న కాలంలో భువనవిజయం, సాహిత్య రూపకాలలో, అష్టావధానాల్లో విరివిగా పాల్గొని తెలుగు సాహిత్యాన్ని సాహితీ ప్రపంచానికి అందించాలని భావనారాయణస్వామి పూర్వవిద్యార్థి నారాయణం రాంబాబు ఆకాంక్షించారు.

# మంచినీటి లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలి



పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: మంచినీటి లీకేజీలను గుర్తించి తక్షణమే వాటికి మరమ్మత్తులు నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ఆదేశించారు. పట్టణంలోని 11వ వార్డును సోమవారం సందర్శించిన ఆయన వార్డులోని పలు సమస్యలకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేశారు. మంచినీరు వృధాగా పోవడం, పైపులకు సంబంధించిన లీకులను పరిశీలించారు. మరమ్మత్తులు చేసిన తక్షణమే గుంతలను పూడ్చాలని, గుంతల వద్ద కనపడే విధంగా పచ్చ జెండాలను ఉంచాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మంచినీటని సరఫరా చేయాలన్నారు. ప్రజలు కూడా నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా వార్డుల్లోని పలు చోట్ల డ్రెనేజి సమస్యలను గుర్తించారు. తక్షణమే పూడిక తీయాలని ఆదేశించారు. అదేవిధంగా వినాయక చవితి మండపాల వద్ద శానిటేషన్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా చెత్తా చెదారాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ మంచి వాతావరణంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు పది అర్జీలు

పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: ప్రతి సోమవారం ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే పీజీఆర్ఎస్‌కు 10అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. అందులో రెవెన్యూకు సంబంధించి 6అర్జీలు, డిఆర్‌డిఏకి సంబంధించి రెండు అర్జీలు, సర్వేకి సంబంధించి రెండు అర్జీలు అందాయన్నారు. వీటిని సమస్య పరిష్కారానికి ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్ ఒక చక్కటి వేదిక అని చెప్పారు. పిజిఆర్ఎస్‌లో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కూడా పిజిఆర్ఎస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉంటారన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మొగసాటి శ్రీనివాస్, రామారావు, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపిఆర్డీ మల్లికార్జునరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# చేబ్రోలు ఎస్సైగా వీరనారాయణ



పొన్నూరు, ఆగస్టు 25,ప్రభాతవార్త: చేబ్రోలు ఎస్సైగా వీరనారాయణ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నల్లపాడు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వీరనారాయణ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేబ్రోలుకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటకృష్ణ విఆర్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీరనారాయణ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలపై పట్టుసాధించి శాంతిభద్రతలను పరిరక్షించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మండలంలో కోడి పందాలు, పేకాట, గంజాయి విక్రయాలు, అక్రమ మద్యం అమ్మకాలు తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాని వీరనారాయణ కోరారు.

# కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన,అఖిలభారత సంస్కారభారతి కార్యదర్శి గోఖలే

తెనాలి టౌన్, ఆగస్ట్ 25 (ప్రభాతవార్త): పట్టణంలోని,ఆటోనగర్లో ప్రసిద్ధి చెందిన సూర్యశిల్పశాల వారి కాటూరి ఆర్ట్ గ్యాలరీని, సంస్కార భారతి అఖిలభారత సంఘటన కార్యదర్శి అభిజిత్ గోఖలే, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు,ఎస్వీఎన్.కృష్ణ కార్యదర్శి రామ్ కుమార్ సభ్యులు అల్లు రాంబాబు,మురళీధర్ లతో కలిసి సోమవారం సందర్శించారు.ఒక కార్యక్రమ నిమిత్తం విజయవాడ విచ్చేసిన వారిని తమ ఆర్ట్ గ్యాలరీని సందర్శించవలసిందని, కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర కోరికమేరకు సోమవారం ఆర్ట్ గ్యాలరీకి విచ్చేసిన సందర్భంగా మూడు టన్నుల ఐరన్ స్క్రాప్ తో తయారు చేసిన బుల్ విగ్రహాన్ని ఆవిష్కరింపచేసారు. అనంతరం ఆర్ట్ గ్యాలరీని తిలకించిన ఆయన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి శివాజీ మహారాజ్ పట్ల వారికి ఉన్న భక్తిని ప్రదర్శించారు.ఈ సందర్భంగా విలేకర్లతో కళా రత్న కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంస్యం,ఫైబర్, పంచలోహ,స్టెయిన్లెస్ స్టీల్, ఐరన్ స్క్రాప్ తో చేసిన విగ్రహాలతో ఆర్ట్ గ్యాలరీ ఉండటం భారతదేశంలో ఇది ఒకటేనని సగర్వంగా చెప్పారు.ఇప్పటికీ ఈ ఆర్ట్ గ్యాలరీని ఎంతోమంది ప్రముఖులు సందర్శించి ప్రశంసించారని, శివాజీ మహారాజ్ విగ్రహాన్ని 21.6 అడుగుల ఎత్తు 15.6 వెడల్పు గల సప్తపలకల మండపంలో పదిటన్నుల ఐరన్ స్క్రాప్ తో తయారు చేస్తున్నట్లు అది పూర్తి అయితే ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించితే ప్రపంచంలోనే అతి గొప్ప కళాఖండం ఉన్న ఆర్ట్ గ్యాలరీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కళాఖండాలలో కొన్నింటిని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో అనుకరించాలని ఉద్దేశంతో ముందుగా విజయనగరంలోని హంపిలో శిథిలావస్థలో ఉన్న రథాన్ని పోలిన రథాన్ని తయారు చేస్తున్నట్లు కాటూరి వెంకటేశ్వరరావు చెప్పారు .ముఖ్యఅతిథిగా విచ్చేసిన అభిజిత్ గోఖలే మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఐరన్ స్క్రాప్ విగ్రహాలు బంగారంతో చేసే ఆర్నమెంట్లు అతి జాగ్రత్తగా ఎలా అతుకుతారో అలా జాగ్రత్తగా ఐరన్ ముక్కలను అతికి చక్కని కళాఖండాలను తయారుచేశారని అలాగే పురాణ పురుషులు రాముడు,కృష్ణుడు మరియు నవయుగ పురుషులు వల్లభాయ్ పటేల్ మరియు ఇతర రాజకీయ నాయకులు విగ్రహాలు కూడా ఎంతో చక్కగా తయారు చేశారని, జీవం ఉట్టిపడేలాగా,తీర్చి దిద్దిన,శిల్పకళాకారులు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు,రవిచంద్రలను ప్రశంసించారు. అనంతరం సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీఎన్.కృష్ణ మాట్లాడుతూ కళలకు కాణాచి అనగానే గుర్తుకు వచ్చేది తెనాలి అని ఎందరో కళాకారులు తెనాలి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని ఆ కోవకు చెందిన వారే కాటూరి వెంకటేశ్వరరావు మరియు వారి కుమారుడు రవిచంద్ర అని ప్రశంసించారు. అలాంటి కాటూరు వెంకటేశ్వరరావు మా సంస్కార భారతి సభ్యులు అయిఉండటం మాకు గర్వకారణంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. యువశిల్పి కాటూరి రవిచంద్ర మాట్లాడుతూ విభిన్న మెటీరియల్ లో తయారు చేసిన విగ్రహాలు ఉన్న గ్యాలరీ ఆంధ్రప్రదేశ్ లోనే అతి పెద్ద ఆర్ట్ గ్యాలరీ తమదేనని ఇంకా ఈ గ్యాలరీలో ఎన్నో కళాఖండాలను రూపొందిస్తున్నామని తెలియజేశారు.అలాగే ఈరోజు మా ఆర్ట్ గ్యాలరీకి విచ్చేసిన అతిధులు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.



# 'మున్సిపల్ గ్రీవెన్స్' కు 3 అర్జీలు

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 25 (ప్రభాతవార్త):ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక(పిజిఆర్ఎస్)కార్యక్రమంలో పురపాలకసంఘానికి మూడు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కార్యాలయం అధికారులు తెలిపారు.మున్సిపల్ కమీషనర్ తన కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ముఖ్యంగా పట్టణంలో నూతన సీసీ రోడ్లను నిర్మించాలని,మురుగునీటి పారుదలకు సైడు కాల్వల ఏర్పాటు చేయాలని,టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒకే అర్జీ వచ్చినట్లు,వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశిస్తామన్నారు.

## 'కలెక్టర్ గ్రీవెన్స్'కు 146 ఫిర్యాదులు



నరసరావుపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త : కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ పి.అరుణ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 146 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలన్నారు. శాఖలవారీగా ఆయా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశాలిచ్చారు.

**ఎన్ఎస్‌పి కాలనీలో నివాసితులకు ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలు, ఇళ్ళు ఇవ్వాలి...**

ఎన్ఎస్‌పి కాలనీలో నివాసం ఉంటున్న 62 కుటుంబాలకు నివాస స్థలాలు, పక్కా గృహాలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం కె.కృష్ణ, బోరుగడ్డ అంబేద్కర్, కంభాల ఏడుకొండలు, వై.వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఎటువంటి నివాస స్థలాలు చూపించకుండా పోలీసులు ప్రొక్లెయిన్‌లతో ఇళ్ళను కూల్చివేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అవసరాలకు పేదల భూమి అవసరమా అన్నారు. కలెక్టర్ చెప్పినా పోలీసులు వినకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తక్షణమే తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

**కౌలు రైతు సంఘం నిరసన...**

పల్నాడు జిల్లాలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కౌలు రైతుల సంఘం నాయకులు వై.రాధాకృష్ణ, రామారావు, పిచ్చారావు, ఆంజనేయులు, సుబ్బారావు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు భూ యజమానులతో లింక్ పెట్టడం సరికాదన్నారు. మండలస్థాయిలో బ్యాంక్ అధికారులు, రెవిన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. అదే విధంగా దేవాదాయశాఖ భూములకు సంబంధించి రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు అందజేయాలని వారు కోరారు.

## వ్యక్తి ఆత్మహత్య


సత్తెనపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం ఎంపీడీవో ఆఫీస్ ప్రక్కన ఉన్న చెట్లలో రామలింగారెడ్డి (48) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెన్షన్ తొలగించారనే దిగులుతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య రామలింగమ్మ ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుంచి ఒకటి సమస్యపై రూ.6 వేలు పెన్షన్ తీసుకుంటున్నట్లు లింగమ్మ తెలిపారు. పెన్షన్ల వెరిఫికేషన్ చేసి పెన్షన్లు తీసివేసిన అధికారులు సరైన పత్రాలతో మరోసారి పెన్షన్‌కు అప్లయ్ చేసుకోవాలంటూ సూచించారని లింగమ్మ తెలిపారు.

## సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ 'గజ్జల'



సత్తెనపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : ప్రముఖ సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి రామిరెడ్డిల జన్మదినోత్సవ వేడుకల్లో సోమవారం వైకాపా నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. సోమవారం కార్తికేయ రెసిడెన్సీలో జరిగిన వేడుకల్లో డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొని న్యాయవాది ఎల్లారెడ్డి రామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. ఆయన ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, రాయపాటి పురుషోత్తమరావు, భవనం వెంకటరామిరెడ్డి, వైకాపా పట్టణ అధ్యక్షులు మౌలాలి, న్యాయవాదులు రాజారపు శివ నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, జూపల్లి శేషయ్య, వీరయ్య, ఎం.ఏడుకొండలు, సాంబిరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, నాగూర్‌బాబు, నవ జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ కేటగిరిలో జిల్లా ఫస్ట్ ర్యాంకర్ షమ్మ సుల్తానా



కాకుమాను ఆగస్టు 25 (ప్రభాత వార్త): మండల పరిధి కొమ్మూరు గ్రామానికి చెందిన షమ్మ సుల్తానా షేక్, డీఎస్సీ ఎస్ ఎ సోషల్ స్టడీస్ ఉర్దూ మీడియం ఫలితాలలో ఉర్దూ క్యాటగిరిలో 62.45 స్కోర్ తో బి సి ఇ లో జిల్లా ఫస్ట్ ర్యాంకర్ గా నిలిచారు. భర్త గఫూర్ వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఇద్దరు పిల్లలు తల్లి అయినా ఉపాధ్యాయురాలు కావాలని పట్టుదలతో కష్టపడి చదివినట్లు షమ్మ సుల్తానా తెలిపారు. ఉర్దూ క్యాటగిరిలో బి సి ఇ లో జిల్లా ఫస్ట్ ర్యాంకర్ గా నిలిచిన షమ్మ సుల్తానా ను పలువురు అభినందించారు.

## హుండీ లెక్కింపు



కాకుమాను ఆగస్టు 25 ( ప్రభాత వార్త): మండల పరిధిలోని కొండపాటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం నందు హుండీలను లెక్కించినట్లు ఆ ఆలయ ఎండోమెంట్ అధికారి జె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు.హుండీల ఆదాయం 12,65,728/ రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు ను దేవదాయ శాఖ బాపట్ల ఇన్స్పెక్టర్ యం.గోపి పర్యవేక్షి ంచారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పూజారి ముప్పా.నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు యర్రాకుల.దానయ్య, పొన్నం.వీరయ్య, పొన్నం . ఫణి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కు చెందిన ఆర్. యస్. ఎల్ బి.వి. బాబురావు,చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పి ధరలకే ఎరువులను విక్రయించాలి



రాజుపాలెం, ఆగస్టు 25 ప్రభాతవార్త : మండలంలోని అంచులవారిపాలెం, కోటనెమలిపురం, పెద నెమలిపురి, అనుమలవారిపాలెం గ్రామాలలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సరోజ, ఎస్.ఐ. వేణుగోపాల్, మండల వ్యవసాయ అధికారి వెంకట నరసయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎరువుల పంపిణీ నిర్వహించారు. అలాగే ప్రైవేట్ షాపులలో ఉన్నటువంటి నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రైవేట్ డీలర్స్, సొసైటీలలో ఎంఆర్‌పి ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే అట్టి షాపుల లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందన్నారు. అలాగే కృత్రిమ కొరత సృష్టించినట్లయితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులకు షాపు పై ఉన్నటువంటి గరిష్ట ధరకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, ఎరువులు ఉన్నవి, లేనివి స్టాక్ బోర్డ్ మీద కనపడే విధంగా ఉంచాలని ఏఓ, ఎస్.ఐ.లు తెలియజేశారు.

## డీఎస్సీలో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఆశాజ్యోతి



పెదకూరపాడు, ఆగస్టు 25 ప్రభాతవార్త : మండలంలోని జలాలపురం గ్రామంలోని మన్నం చిన్నమ్మ - లూర్దుమేరి ప్రథమ పుత్రిక మన్నం ఆశాజ్యోతి తన మొదటి ప్రయత్నంలోనే డీఎస్సీ - 2025లో సైన్స్ విభాగంలో మూడు పేపర్లలో 12, 15, 18 వ ర్యాంక్ సాధించింది. తన పాఠశాల, కళాశాల చదువు పూర్తిగా గురుకుల విద్యాలయంలో చదవడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల మంచిగా చదివి ఇలా మంచి ర్యాంక్లు సాధించిందని పలువురు అభినందించారు.

## మైకేల్ ఫారడేకి ఘన నివాళి



పెదకూరపాడు, ఆగస్టు 25 ప్రభాతవార్త : సుప్రసిద్ధ భౌతిక, రసాయనిక శాస్త్రవేత్త మైకేల్ ఫారడే వర్ధంతి ఆగస్టు 25 సందర్భంగా పెదకూరపాడు జెడ్పీహైస్కూల్లో ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. ఫారడే డైనమో సృష్టికర్త అని, ఒక బుక్ బైండర్‌గా పని చేస్తూ బైండింగ్‌కి వచ్చిన పుస్తకాలను చదివి తాను స్వయంగా సైన్స్ పట్ల మక్కువ పెంచుకొని, ప్రయోగాలు చేస్తూ గొప్ప శాస్త్రవేత్తగా స్వయం కృషితో పైకెదిగారని హెచ్.ఎం. కె.వి.రమణ తెలిపారు. విద్యుదయస్కాంత ప్రేరణ, విద్యుద్విశ్లేషణ నియమాలు, ఫారడే సీతాకోక చిలుక వల వస్తున్న ఆయన ఆవిష్కరణలే ఆయన గౌరవార్థం కెపాసిటెన్స్ ప్రమాణం ఫారడ్‌లో తెలుపుతున్నారు. విద్యార్థులంతా శాస్త్రీయ అభిరుచులు, వైఖరులు పెంపొందించుకొని యువ శాస్త్రవేత్తలు ఎదగాలని ఫారడే జీవితం ద్వారా స్ఫూర్తి పొందాలని, ఉపాధ్యాయులు, కూడా విద్యార్థులలో సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని తెలియజేశారు.

## ప్రభుత్వ ధరలకు ఎరువులు విక్రయించాలి

నిజాంపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్తః ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారి సిహెచ్ విజయరాజు అన్నారు. సోమవారం మండలంలోని కూచినపూడి పిఎసిఎస్‌లోని ఎరువుల గోదామును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సు దారులు ఎవరైనా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అవసరమైతే దుకాణం లైసెన్స్‌ను రద్దుచేసి కేసులు నమోదు చేస్తామన్నారు.



అనంతరం ఎరువుల విక్రయాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు డివిఆర్, డైరెక్టర్లు, సిఇఒ, పోలీస్, రెవెన్యూ, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు అందజేసే భోజనం పరిశుభ్రంగా వండాలి

నిజాంపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్తః ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేసిందని ఎంఇఓ శోభాచంద్ తెలిపారు. సోమవారం స్థానిక జడ్‌పి ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



## ప్రజాసమస్యల పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక'

రేపల్లె(నిజాంపట్నం), ఆగస్టు 25, ప్రభాతవార్తః ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కారవేదికను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రేపల్లె ఆర్‌డిఓ రామలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి 7 అర్జీలు వచ్చాయని వాటిని ఆయా శాఖలకు పంపి పరిష్కరిస్తామన్నారు.



## రెస్టారెంట్,బార్‌ల నిర్వహణకు నోటిఫికేషన్

రేపల్లె(నిజాంపట్నం), ఆగస్టు 25, ప్రభాతవార్తః రాష్ట్రంలో రెస్టారెంట్, బార్‌ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం బార్‌పాలసీ 2025-28 విడుదల చేసిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఒంగోలు అసిస్టెంట్ కమీషనర్ కె విజయ తెలిపారు. సోమవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయ ంలో ఎ4 షాపు, లైసెన్సీల, రియల్‌ఎస్టేట్, రెస్టారెంట్‌ల నిర్వాహకులు, ఆసక్తిపరులతో మాట్లాడారు. లాటరీ పద్దతిలో ఎంపిక ఉంటుందని ఆమె తెలియజేశారు. ఉత్సాహవంతులు రెస్టారెంట్, వార్‌ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.



## 'పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి తప్పించండి'



కొల్లిపర, ఆగస్టు 25 (ప్రభాతవార్త) : సామాజిక పెన్షన్లు ఇచ్చే బాధ్యత నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం కొల్లిపర తహశీల్దార్ జి.సిద్దార్ధకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ విధులకు ఇబ్బంది కలిగించే ఈఈ సామాజిక పెన్షన్లు పంపిణీ బాధ్యత నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ములకా శివసాంబిరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మలజ్యోతి, ఎం.సీతమ్మ, ఎస్.శ్రీలక్ష్మి, లక్ష్మీదేవి, ఎం.జ్యోతి, టి.లావణ్య, ఎం.వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ

కొల్లిపర, ఆగస్టు 25 (ప్రభాతవార్త) : మండలంలోని తూములూరు గ్రామాలలో ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం (పీఏసీఎస్) జీడీసీ ఎంఎస్, ప్రైవేట్ ఎరువుల దుకాణాలనుమండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ సిద్దార్థ, ఎస్సై కోటేశ్వరరావు సంయుక్తంగా తనిఖీ చేశారు. డీఏపీ ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్‌ను రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## సంగం డెయిరీ బోనస్ పంపిణీ

కొల్లిపర, ఆగస్టు 25 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని దావులూరిపాలెం గ్రామంలో 72పాల ఉత్పత్తిదారులకు 1లక్ష12వేల రూపాయలను బోనసులు సోమవారం అందజేసినట్లు సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు శాఖమూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ లక్ష్మీజ్ఞాననంద భగవాన్ తెలియజేశారు. సంగం డెయిరీకి పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారులకు డెయిరీ నుంచి అనేక సేవలు అందిస్తూ రైతుల ఆర్థిక అభివృద్ధి కొరకు డెయిరీ ఛైర్మన్ దూళిపాళ్ల నరేంద్రకుమార్ పని చేస్తున్నారని మేనేజర్ రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ అధికారులు ఉప్పాల సందీప్ కృష్ణ, అమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ఏమినేని వెంగయ్య, ఉయ్యూరు గంటయ్య, సంఘ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.





## ఎరువుల షాపుల్లో తనిఖీలు

కొల్లూరు, ఆగస్టు 25 (ప్రభాతవార్త) : మండలంలోని ఎరువుల షాపులను తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు,హెడ్ కానిస్టేబుల్ నాగరాజులు సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పాస్ మిషన్‌లో ఉన్నటువంటి స్టాకు, పెరుగు షాపుల్లో ఉన్న స్టాకును సరిపోల్చినట్లు వారు వివరించారు. ఎరువుల బిల్లు, పుస్తకాలను,



స్టాక్ రిజిస్టర్లు బోర్డును పరిశీలించారు. కొల్లూరు మండల తహశీల్దార్ బి.వెంక టేశ్వర్లు డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఎరువులను నిర్ణయించిన ధర కంటే అధికంగా అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎవరైనా ఎరువులను ఉంచితే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి నరేంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచామని ఆయన తెలియజేశారు. మండలంలో ఎవరైనా యూరియా అక్రమంగా నిలువ ఉంచితే ఎన్ఫోర్స్మెంట్ టీంకు తెలియజేయవలసిందిగా ఆయన కోరారు. ఈ ఖరీఫ్ సీజన్ అయ్యే వరకు ఎన్ఫోర్స్మెంట్ టీం పర్యవేక్షిస్తుందని ఆయన వివరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వీఆర్వో రామారావు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీని నిర్వహించి యువతకు ఇచ్చి మాటను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 25 ప్రభాతవార్త : మెగా డీఎస్సీని నిర్వహించి యువతకు ఇచ్చి మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో పారదర్శకతతో మెగా డీఎస్సీ నిర్వహించిందన్నారు. నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యా రంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెట్టేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికి అండగా నిలబడ్డామన్నారు. యువత బాగుపడటం ఇష్టంలేని వైకాపా నేత జగన్‌మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించారన్నారు. అవన్నీ తట్టుకొని మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. 2014-19 మధ్య రెండు డీఎస్సీలు జరిపి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను టిడిపి ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. నారా చంద్రబాబునాయుడు 14 ఏళ్ళ పాటు ముఖ్యమంత్రి హోదాలో దాదాపు 13 డీఎస్సీలు జరిపి 1,80,208 పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టి ంచారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు.



## శ్రీకృష్ణుడి రూపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడంపై హర్షం

### -బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్

మంగళగిరి, ఆగస్టు 25, ప్రభాతవార్త ; తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడానికి సహకరించిన మంత్రి నారా లోకేష్, నిర్వాహకులు, గ్రామస్తులకు, ఈ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్పందించిన హిందూ సంఘాలు, బిసి సంఘాల ప్రతినిధులకు బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మంగళగిరిలోని బిసివై పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు, యాదవ సంఘాలు పెద్ద ఎత్తున వ్యతిరేకించాయన్నారు. తాను కూడా తక్కెళ్లపాడుకు వెళ్లి విగ్రహం ఏర్పాటు చేయవద్దని నిర్వాహకులకు చెప్పి వస్తే... విగ్రహం పెట్టబోమని ప్రకటించి మళ్లీ రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. దీంతో తాను విశాఖపట్న నుంచి ఛలో తక్కెళ్లపాడుకు పిలుపునిచ్చానన్నారు. దీంతో వివాదాన్ని గుర్తించిన నారా లోకేష్ జోక్యంతో నిర్వాహకులు బేషిజాలకు పోకుండా శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించి, ఎన్టీఆర్ రూపంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వారందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.





**ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు..**

వివాదాస్పద ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించిన తనపై కొందరు బెదిరింపులకు దిగుతున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులు పెడతామని, కుట్ర చేస్తామని బెదిరిస్తున్నారని, అలాంటి ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. గతంలో తన ఇంటిపై దాడి చేసిన అల్లరిమూకల పరిస్థితి ఏమైందో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. మంగళగిరి పార్టీ ఆఫీసుకు వస్తామని కొందరు తనను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని వాటన్నిటికీ బెదిరే ప్రసక్తే లేదన్నారు. కొందరు పనిగట్టుకొని శ్రీకృష్ణుడిని అవమానించే విధంగా మాట్లాడుతున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణుడు ఎలా ఉంటాడో తెలుసా? అని... రామారావు వల్లే శ్రీకృష్ణుడికి ప్రాచుర్యం వచ్చిందనే అర్థం వచ్చేలా సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడుతున్నారన్నారు. అలా మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుళ్ల రూపంలో నటుల విగ్రహాల ఏర్పాటు చేసే సంస్కృతి నశించాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఇప్పుడు శ్రీకృష్ణుడు రూపంలో ఎన్టీఆర్ విగ్రహాలు పెట్టాలని ప్రయత్నించినట్టుగానే, శివుడి రూపంలో చిరంజీవిని, అమ్మవారి రూపంలో రమ్యకృష్ణ విగ్రహాలను ప్రతిష్టించినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ విష సంస్కృతి నశించాలని కోరారు . రెండు తెలుగు రాష్ట్రాలలో గతంలో శ్రీకృష్ణుడు రూపంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు రామచంద్రయాదవ్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఆ విగ్రహాల తొలగింపుకు త్వరలోనే కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామన్నారు. రామారావు విగ్రహాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, మనోభావాలను కించ పరిచేలా ఏర్పాటు చేస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి మాత్రం లేదన్నారు.

## సమతుల్య ఆహారంపై కెఎల్‌యు విద్యార్థులకు అవగాహన



తాడేపల్లి, ఆగస్టు 25,ప్రభాతవార్త : మండల పరిధిలోని పెనుమాక గ్రామంలో "స్మార్ట్ విలేజ్ రివల్యూషన్" కార్యక్రమం కింద, కెఎల్‌యు లోని ఇసీఈ, ట్రిపుల్ ఈ, సీఎస్ఈ విభాగాల నుంచి విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్ళి కుటుంబాల ఆహారపు అలవాట్లు, పోషాకాహారం పై అవగాహన, గర్భిణీస్త్రీలు, బాలింతల ఆహారపు జాగ్రత్తలు పిల్లల పెరుగుదలలో పోషకాహార ప్రాధాన్యత వంటి అంశాలపై సర్వే నిర్వహించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పిల్లలకు ఇచ్చే ఆహారం, గర్భిణీస్త్రీలు, బాలింతలకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ పైలట్ స్టడీ కేవలం విద్యార్థులకు సామాజిక అనుభవాన్ని కలిగించడమే కాకుండా సేకరించిన సమాచారం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ కొత్త విధానాలు రూపొందించేందుకు మార్గనిర్దేశం చేస్తుంది. గ్రామీణ కుటుంబాల జీవనశైలిని మెరుగుపరచడానికి సమతుల్య ఆహారం, ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. కార్యక్రమంలో ఎస్వీఆర్ కోఆర్డినేటర్లు పి.సత్యనారాయణ, టి.శివకృష్ణ విద్యార్థులతోకలసి చురుకైన పాత్ర పోషించారు.

## సీతానగరంలో మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నిర్మించిన కర్మకాండల సత్రం ప్రారంభం

తాడేపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త : రాష్ట్ర ఐటి, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సీతానగరంలోని పుష్కరఘాట్ వద్ద నిర్మించిన కర్మకాండల సత్రాన్ని కూటమి నాయకులు ప్రారంభించారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు మంత్రి లోకేష్ సుమారు రూ. 8లక్షలతో కర్మకాండల సత్రం నిర్మించారు. అడిగిన వెంటనే సొంత నిధులతో సత్రం నిర్మించినందుకు స్థానికులు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ పాలనలో అంతా అరాచకం, దౌర్జన్యాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, బిజెపి పట్టణ అధ్యక్షులు వల్లూరు శివరామకృష్ణ, తాడేపల్లి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి దారదాసు, మేకా పుల్లారెడ్డి, నాయకులు ఇట్టా పెంచలయ్య, అదంకి మురళీ, దానబోయిన సుందరరావు యాదవ్, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, షేక్ నాగుల్‌మీరా, ఇట్టా భాస్కర్, తాడిబోయిన భాస్కర్, షేక్ మస్తానయ , కొయ్యగూర మహాలక్ష్మీ, అన్నెం కుసుమ, పి.కృష్ణవేణి, ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ చాంద్‌బాషా, షేక్ సైదా, వల్లభాపురం పీటర్‌పాల్, గోలి శౌరీ, గాడి సాంబశివరావు, పోతాబత్తుల శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, పుల్లెపు భాస్కర్‌రావు, చొంగల హరినాథ్, బండి సాంబిరెడ్డి, కొర్రపాటి విజయ్, బొల్లేద్దుల మరియన్న, జి.అంకాల రావు, గాజుల కృష్ణ, చుంచు లక్ష్మీ నారాయణ, కంచర్ల శివప్రసాద్, బెజ్జం బాబురావు, దుర్గారావు, తాడిబోయిన గోపి, కె.సాయిచంద్, సైకం సాంబయ్య, పి.హనుమంతు, సంక్రాంతి అశోక్, అంజలి, విశాల తదితరులు పాల్గొన్నారు.






## బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన బిపి మండల్ :కేసన శంకరరావు

తాడేపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త : అనాదిగా సామాజిక అన్యాయానికి గురైన వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీల జీవితాల్లో వెలుగులు నింపిన బడుగుల ఆరాధ్య దైవం బిపి మండల్ అంటూ, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరావు కొనియాడారు. ఆగస్టు 25 బిందేశ్వరీ ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు బిపి నేతలు పూలమాలలు వేసి మిఠాయిలు పంచుకుంటూ ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ మండల్ బీహార్‌లోని మదేపురాకు చెందిన ఓ భూస్వామ్య యాదవ కుటుంబ బిహారీలాల్ మండల్ సీతాపతి మండల్ దంపతులకు జన్మించారు. తన జీవితకాలమంతా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే కృషి చేశారన్నారు. ఈ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామ్ బాబాజీ. గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, సీనియర్ బిసి నాయకులు కేశన కోటేశ్వరరావు, వాకా వెంకటేశ్వరరావు, ఏ.శ్రీనివాస్, జంజనం వరప్రసాద్, దానా గౌడ్, యువజన నాయకులు సిరాజ్, శివ, గోపి, నాగబాబు పలువురు బిసి నాయకులు పాల్గొని మండల్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# పల్నాడు జిల్లా వార్త



## విద్యారంగాన్ని దేశంలో తొలిస్థానంలో నిలబెడతాం: ఎమ్మెల్యే 'యరపతినేని'

పిడుగురాళ్ల, ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తోందని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి యేటా మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామన్నారు. జగన్‌రెడ్డి మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు 24 కేసులు వేశారని, వాటిని తట్టుకొని మెగా డీఎస్సీ నిర్వహించిన ఘనత మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులతోపాటు సరిపడా ఉపాధ్యాయులను నియమించేందుకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో 18 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. కస్తూర్బా పాఠశాలల్లో 729 నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేశామన్నారు. జూనియర్ కళాశాలల్లో 3619 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను పునరుద్ధరించామన్నారు. వైసీపీ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతకు అన్యాయం చేశారన్నారు. 2013లో రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని జగన్‌రెడ్డి పునరుద్ధరించారన్నారు. టీచర్లు లేకుండా పాఠశాలలు నడిపారన్నారు. పీఆర్సీ సాధన కోసం ఉద్యోగులు నిర్వహించిన నిరసనలో ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించారన్నారు. ఆన్‌లైన్‌లోనూ నోట్ పుస్తకాలు తనిఖీ చేసి టీచర్లపై ఒత్తిడి తెచ్చారన్నారు. నాడు, నేడు పనుల పర్యవేక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులకు అప్పగించారన్నారు. విద్యార్థులకు గుడ్డు పెట్టలేదని హెచ్‌ఎంలకు షోకాజు నోటీసులు ఇచ్చారన్నారు. సకాలంలో ఒక్క నెల కూడా వైసీపీ ప్రభుత్వం జీతాలు చెల్లించలేదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## న్యాయ అవగాహన సదస్సు

గురజాల, ఆగస్టు 25 ప్రభాతవార్త: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన పట్టణంలోని ఎస్సీ కాలనీలో బాల్య వివాహాలు, ముందస్తు గర్భధారణ వలన కలిగే అనార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వై శ్రీనివాసరావు బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కలిపంచారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చలమరాజు, న్యాయవాదులు ప్రభుదాసు, జానీబాషా, డాక్టర్ సాయికిరణ్‌కుమార్, సాల్మన్‌రాజు, ఎస్ఐ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే ట్రాక్‌పై ఇద్దరు అనుమానాస్పద మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 25 ప్రభాతవార్త: పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డు రైల్వే ట్రాక్ సమీపంలో ఇరువురు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సంఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. రైల్వే ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ మృతిచెందిన వారు పట్టణానికి చెందిన షేక్ షఫీఫ్ (22), గరికిపూడి ఏసుదాసు (36)గా గుర్తించామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు ఏసుదాసు తండ్రి మాట్లాడుతూ తన కుమారుడిని కొందరు వ్యక్తులు కావాలని పాత కక్షలతో హత్య చేసి రైల్వే ట్రాక్‌పై పడవేశారని ఆరోపించారు. గతంలో వారికి మా కుమారుడికి మధ్య ఘర్షణ కూడా జరిగిందన్నారు. ఈ హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## మాచర్లలో ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్వో తనిఖీ



మాచర్ల, ఆగస్టు 25 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలో సోమవారం ఎరువుల దుకాణాలను మాచర్ల తహశీల్దారు బి.కిరణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి, పట్టణ ఎస్సై వెంకటరావులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎరువుల నిల్వలు, రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. అధిక ధరలకు అమ్మకాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో మాచర్ల వ్యవసాయ విస్తరణాధికారి ఎం.మార్కండేయులు, ఎంపీఈఓ జి.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ నూతన సభ్యుల పరిచయ వేదిక



మాచర్ల, ఆగస్టు 25 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలోని వైభవ్ రెసిడెన్సీ ఫంక్షన్ హాలులో రోటరీ క్లబ్ నూతన సభ్యుల పరిచక వేదిక మెంబర్షిప్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కర్నాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లబ్ చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సభ్యులు సలహాలు, సూచనలు అందజేశారు. రోటరీ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, ట్రెజరర్ యనమదల వెంకట్రామయ్య, ప్రోగ్రాం కన్వీనరు కర్నాటి శ్రీనివాసరావులు ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కూరపాటి శ్రీనివాసరాజు, ఆవుల వీరాంజనేయులు, సింహారెడ్డి, పంతంగి వెంకటేశ్వర్లు, సూర్యదేవర నరసింహారావు, ఉదయ్, క్లబ్ మెంబర్‌షిప్ డైరెక్టర్ కర్నాటి వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ర్యాలీ

మాచర్ల, ఆగస్టు 25 ప్రభాతవార్త: జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడుతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాచర్ల పట్టణంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ ర్యాలీ చేపట్టింది. ఆటో డ్రైవరన్ల జీవన స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని చేయూతనందించాలి కుటుంబాలను ఆదుకోవాలని తహశీల్దారుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అబ్రహాంలింకన్ మాట్లాడుతూ మాచర్ల పట్టణం నుంచి పలు మండల గ్రామాలకు ప్రజా అవసరాల నిమిత్తం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే ఆటో డ్రైవర్ల జీవనోపాధి కోల్పోయి ఆకలికేకలతో బాధపడుతున్నారన్నారు. స్త్రీశక్తి పథకం ఉచిత బస్సు పథకానికి మేం వ్యతిరేకం కాదన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## మాచర్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా కలివెల జ్యోతి ఏకగ్రీవం



మాచర్ల, ఆగస్టు 25 ప్రభాతవార్త: మాచర్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా కలివెల జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో గురజాల ఆర్డీవో మురళి సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా జ్యోతిని వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈపదవి రావడానికి కృషి చేసిన మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, తోటి కౌన్సిల్ సభ్యులు, టీడీపీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు బి.కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు

కారంపూడి, ఆగస్టు 25 ప్రభాతవార్త: నరసరావుపేట నుంచి కారంపూడి వరకు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సురేష్‌బాబు సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా వాహనాలకు సరైన పత్రాలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రహదారి భద్రతా నియమాలను పాటించాలని అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్తే కేసు నమోదు చేస్తామన్నారు. ద్విచక్రవాహనం నడిపే వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మద్యం సేవించి అధిక వేగంతో వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట పల్నాడు జిల్లా ఆర్టీసీ సీఐ యర్రయ్య, సిబ్బంది ఉన్నారు.



## విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

కారంపూడి, ఆగస్టు 25 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద 50 భోజన ప్లేట్లు, గ్లాసులను పంపిణీ కార్యక్రమం సోమవారం చేశారు. గ్రామానికి చెందిన చిరుమామిళ్ల రామలక్ష్మయ్య విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విలియం సౌరిబాబు, సర్పంచ్ గంగనపల్లి పుష్పలత శివరాం, టీడీపీ నేత చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్పీ

నరసరావుపేట క్రైం, ఆగస్టు 25 ప్రభాతవార్త : వినాయక చవతి ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు ఎవరికి ఎటువంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సింగల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుసరించాలని తెలిపారు. అదే విధంగా నిమజ్జన సమయంలో నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలన్నారు.



**ఎల్.హెచ్.ఎం.ఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి :**

జిల్లా ప్రజలు ఎల్.హెచ్.ఎం.ఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ కె శ్రీనివాసరావు సూచించారు. ప్రజల ఆస్తులకు రక్షణకవచంలా మొబైల్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాముఇల్లు విడిచి పనులపై బైటకు వెళ్లేందుకు పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమ స్మార్ట్ ఫోనులో ఎల్.హెచ్.ఎం.ఎస్ యాప్‌నుడౌన్లోడ్ చేసుకుని ఇంటి నుండే వివరాలను పోలీస్‌స్టేషన్‌కు తెలియచేసే సౌకర్యం ఉందని జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు తెలిపారు.

## దివ్యాంగుల పెన్షన్లు మానవత్వం లేకుండా తొలగిస్తున్నారు : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త : కనీస మానవత్వం లేకుండా కూటమి ప్రభుత్వం లక్షలాది మంది దివ్యాంగుల పెన్షన్ తొలగిస్తున్నారని, సుపరిపాలన అంటే ఇదేనా అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం సత్తెనపల్లి వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పెన్షన్లు తొలగించిన వికలాంగులతో పాటు విలేకర్లతో మాట్లాడారు. దివ్యాంగుల పెన్షన్‌లలో కోతలు లేకుండా పూర్తిస్థాయి పెన్షన్లు ఇవ్వాలన్నారు. నేరుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దివ్యాంగులు వైకల్యం పర్సంటేజ్‌ని తగ్గించి సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వ వైద్యులకు ఆదేశాలివ్వడం, బెదిరించడం దారుణమైన విషయం అన్నారు. పల్నాడు జిల్లాలో 6300 మందికి నోటీసులు ఇచ్చారని, మరో మూడు వేల మందికి ఎటువంటి నోటీసులు లేకుండానే పెన్షన్ తీసి వేశారని తెలిపారు. దివ్యాంగుల పట్ల మానవత్వాన్ని ప్రభుత్వం చూపడం లేదన్నారు. ఒక్క నరసరావుపేట మున్సిపాల్టిలో 830 మందికి పెన్షన్‌లు ఆపి రీ వెరిఫికేషన్ నోటీసులు ఇచ్చారన్నారు. 90 శాతం వైకల్యం ఉన్నవారికి పర్సంటేజ్‌లు తగ్గించి రూ.15 వేలు ఇవ్వాల్సిన పెన్షన్‌లను రూ.6 వేలకు తగ్గించి ఇస్తున్నారన్నారు. అచ్చంపేటలో రీ వెరిఫికేషన్ కోసం నోటీసు ఇచ్చిన రూపేష్ అనే పిల్లవాడు కనీసం అధికారుల దగ్గరకు వచ్చే అవకాశం కూడా లేదన్నారు. పెన్షన్ తీసుకునే లబ్ధిదారుల పట్ల రాజకీయాలు చేయడం, రెడ్‌బుక్ పాలన అమలు చేస్తూ వేధించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పెన్షన్లు తొలగించే కార్యక్రమాన్ని నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, అచ్చి శివకోటి తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

నరసరావుపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త : మండలంలోని శంకరభారతీపురం జెడ్పీహైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం ద్వారా ఎంతో మందికి మంచి జరుగుతుందన్నారు. విద్యార్థులకు వీల్‌చైర్స్, కృత్రిమ అవయవాలు, వినికిడి సాధనాలు, బ్రెయిలీ కిట్లు అందించేందుకు ఈ నిర్ధారణ కార్యక్రమం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం అందరి బాధ్యత అన్నారు. విద్య, సామాజిక అభివృద్ధికి ఒక మైలు రాయిగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పట్టణ, పరిసర ప్రాంతాల్లో చవితి వేడుకలకు ఏర్పాట్లు

నరసరావుపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త : పట్టణ, పరిసర గ్రామాల్లో ఇప్పటికే వినాయకచవితి పర్వదినానికి సంబంధించి ఏర్పాట్లను ఆయా కమిటీలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ఇచ్చిన పిలుపును అనుసరిస్తూ కోటప్పకొండరోడ్డులోని గణేష్ సెంటర్ వద్ద వినాయకచవితి పందిరి పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యాలెస్‌తో తయారు చేసే విగ్రహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నారు. కలుషితమైననీరు తయారై జంతువులు, మనుషులు అనేక రోగాల భారిన పడుతున్నారని తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ అల్లంశెట్టి కిషోర్‌బాబు మాట్లాడుతూ పందిరిలో 400 మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని, ఈ ఏడాది 26వతేదీన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయగణపతి ఫౌండేషన్ అధ్యక్షులు జలసూత్రం సృజన్, అల్లంశెట్టి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ వైద్యుడు బాబురెడ్డికి ఘననివాళి

నరసరావుపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త : నరసరావుపేటకు చెందిన కమల నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ కె.హెచ్. బాబురెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు మాట్లాడుతూ ఎంతో గౌరవంతో సమాజంలో గుర్తింపు పొందిన వైద్యులలో డాక్టర్ బాబురెడ్డి ఒకరన్నారు. సమాజానికి మేలు చేయాలన్న తలంపుతో అందరికీ స్ఫూర్తివంతంగా తన దేహాన్ని సైతం గుంటూరు మెడికల్ కళాశాలకు దానం చేసి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఇటువంటి ఆదర్శ భావాలు కలిగిన వైద్యులు సమాజానికి అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.



**చోరీ జరిగిన షాపును పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ...**

పట్టణంలోని మల్లమ్మసెంటర్‌లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగిన బేకర్స్ మార్ట్ దుకాణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పరిశీలించారు. దుకాణం యజమానిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యంత రద్దీగా ఉండే మల్లమ్మసెంటర్‌లో చోరీ జరగడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. షాపు షట్టర్లు పగులకొట్టి నేరుగా అగంతకులు షాపులోకి ప్రవేశించి రూ.1.50 లక్షలను చోరీ చేయడం జరిగిందని షాపు యజమాని హర్షవర్ధన్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు తెలియజేశారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఇఒ సత్యనారాయణ సింగ్

చిలకలూరిపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త: పట్టణంలోని 18వ వార్డులో ఉన్న శారదా మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సోమవారం చిలకలూరిపేట మండల విద్యాశాఖాధికారి బి సత్యనారాయణ సింగ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి క్లాసులోనికి వెళ్లి విద్యార్థులను వారు చదివే విధానాన్ని పరీక్షించారు. స్కూల్ రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు నార్నె విజయశ్రీతో కలసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తయారుచేసే వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరుపట్టీలను, వచ్చిన విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి క్లాసు ఉపాధ్యాయురాలితో యంఈఓ మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి అవకాశం ఉంటే మరొక ఉపాధ్యాయుడిని కేటాయించాలని ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ యంఈఓని కోరారు. పరిశీలించి ఉపాధ్యాయులను కేటాయిస్తామని యంఈఓ హామీ ఇచ్చారు.



## నియోజకవర్గ, పట్టణ టిడిపి వాణిజ్యవిభాగాల కార్యవర్గాలు ఏకగ్రీవం

చిలకలూరిపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో బాగంగా నియోజకవర్గ, పట్టణ వాణిజ్య విభాగాల కార్యవర్గాలను పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా అర్వపల్లి వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తవ్వా నాగమల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడిగా కొలిశెట్టి రంగానాథ్, ప్రధాన కార్యదర్శిగా ఊటుకూరి చంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, మురకొండ మల్లిబాబు, కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు ఐటిడిపి కార్యవర్గాలు ఏకగ్రీవం

చిలకలూరిపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో బాగంగా సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు నియోజకవర్గ పరిధిలోని చిలకలూరిపేట, నాదెండ్ల యడ్లపాడు ఐటిడిపి కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. చిలకలూరిపేట మండల ఐటిడిపి అధ్యక్షులుగా నెల్లూరి రేవంత్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సలీం మాలిక్, నాదెండ్ల ఐటిడిపి అధ్యక్షుడిగా చుండు అనిల్, ప్రధాన కార్యదర్శిగా నల్లమోతు నాగభరత్, యడ్లపాడు మండల ఐటిడిపి కమిటి అధ్యక్షులుగా షేక్ అజారుద్దిన్, ప్రదాన కార్యదర్శిగా పఠాన్ చిననాగూర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్ బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, నియోజకవర్గ సమన్వయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

యడ్లపాడు, అగస్టు 25, ప్రభాతవార్త : యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఇన్‌చార్జ్ ఎంపీడీవో షేక్ జాకీర్ హుసేన్ అధ్యక్షతన నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ప్రజెంటేష్ ద్వారా తెలిపారు. వ్యర్థాల సేకరణ, తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం తడి వ్యర్థాల ద్వారా ఎరువుల తయారి, పోడి వ్యర్థాల ద్వారా రిసైకిల్ రెడ్యూస్ చేయుటం గ్రామంలో పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుట ద్వారా ప్రజల అరోగ్యం మెరుగుపడుతుందని, అనారోగ్య, వ్యాధులు తగ్గుతాయని, పంచాయితీలు, గ్రామస్తులు అలోచనతో కార్యక్రమం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాన్ని అసిస్ట్, ఐటిసి సౌజన్యంతో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్ట్ సిబ్బంది కె ఏసోబు, టి అనిల్‌కుమార్, నజీర్, బాజీ, రిసోర్స్ పర్సన్ సిహెచ్ బొల్లయ్య, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.




## 3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు, అగస్టు 25, ప్రభాతవార్త : మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశము సెప్టెంబర్ 3వ తేది ఉదయం 11గంటలకు మండల పరిషత్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరము నందు జరుగుతుందని ఎంపీడీవో ఇన్‌చార్జ్ షేక్ జాకీర్ హుసేన్ సోమవారం తెలిపారు. కావున సదరు సమావేశమునకు మండల ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులందరూ తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనదన్నారు. మండలములోని వివిధ శాఖల అధికారులందరూ వారి వారి శాఖల యొక్క పూర్తి సమాచారముతో హాజరు కావలసినదిగా కోరడమైనదన్నారు.

## సూపర్‌సిక్స్ హామీలపై బహిరంగ సభ: ఎమ్మెల్యే

కారంపూడి, ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ఈ నెల 29న కారంపూడిలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. కారంపూడిలో 6000 మంది మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



## వెబ్‌సైట్‌లో నమోదుతో గణేష్ మండపాల అనుమతి సులభతరం

వెల్దుర్తి, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఈ ఏడాది గణేష్ ఉత్సవాల మండపాల కోసం పర్మిషన్ తీసుకోవడం మరింత సులభం అయ్యిందని వెల్దుర్తి మండల ఎస్సై సమందర్‌వలి ఒక ప్రకటనలో తెలియజేశారు. గతేడాది వరకు మండపాల నిర్మాణం కొరకు ప్రతిఒక్కరూ వ్యక్తిగతంగా పోలీసు స్టేషన్‌కి వచ్చి పర్మిషన్ దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఈ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నమోదు చేసుకోవడంతో అన్ని విభాగాలకు సమాచారం చేరుతుంది. పోలీసు విభాగం తనిఖీ చేసిన తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) ఇవ్వబడుతుందని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మొబైల్ నంబరుతో లాగిన్ అయి క్యూఆర్ కోడ్ తీసుకుని మండపం వద్ద ప్రదర్శించేలా అతికించుకోవాలని సూచించారు. ఈ పండుగలో డీజే పర్మిషన్ ఇవ్వబడదని తెలియజేశారు. కేవలం మైక్ మాత్రమే ఉపయోగించుకోవాలని, విగ్రహాల ఎత్తు 12 అడుగులకు మించి ఉండకూదని, విద్యుత్తు వంటి ఇతర అనుమతులు, సంబంధిత విభాగాల నుంచి ముందుగానే పొందాలని ఆయన సూచించారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, గురజాల డీఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ప్రజలందరూ ఈ పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో మంచి వాతావరణంలో అన్ని శాఖలకు సహకరించి గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరుపుకోవాలని ఎస్సై సమందర్‌వలి కోరారు.



## నరసరావుపేటలో వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ బ్రాంచ్ ప్రారంభం

నకరికల్లు, ఆగస్టు 25 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలో సోమవారం వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ బ్రాంచ్‌ని నూతనంగా ప్రారంభించారు. డిప్యూటీ గవర్నర్ యక్కల సుజాత, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మద్ది అంజనాదేవి, నంబూరి లీలాకుమారి ఎంపికయ్యారు. కోశాధికారిగా అనురాధ, జోన్ ఛైర్మగా కొత్తమాసు ఉమాదేవి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి మంచి చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, హనుమంతరావు, చేగు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



26-8Pg5 9 th pg_26-8Pg5.qxd 8/25/2025 10:21 PM Page 1



# 30 రోజుల్లో బెయిలు లేదా రాజీనామా



## అరెస్టయితే ప్రధానికైనా, ముఖ్యమంత్రికైనా అదే నియమం

### జైలునుంచి పాలన న్యాయం కాదుకదా!: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అదిమర్యాదపూర్వకంగాఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు.మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశంపైనా స్పందించారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సిఎం, పిఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డిజిపి, చీఫ్‌సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మాపార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు అని అమిత్ షా అన్నారు. ప్రధానిగానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం.

చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోడీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళితే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా? అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు ఖచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్‌గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదికాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది. అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలోఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతి పక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదుఅని అమిత్ షా స్పష్టంచేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు అని తెలిపారు.



# రాజస్థాన్‌లో భారీ వరదలు

### రెండు కిలోమీటర్ల మేర గొయ్యి!

**జైపూర్, ఆగస్టు 25:** గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజస్థాన్‌లో భారీ వరదలు పోటెత్తాయి. వర్షాల వల్ల సుర్వాల్ జలాశయం పొంగి పొర్లటంతో రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపుర్ గ్రామంలో 2కిలోమీటర్ల మేర గొయ్యి ఏర్పడి జలపాతాన్ని తలపిస్తోంది. పొలాల మీదుగా నిరు ఉధృతంగా ప్రవహించి జదవత గ్రామాన్ని ముంచెత్తడంతో విధ్వంసం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.సవాయ్ మాధోపుర్‌లో 2 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతున బిలం ఏర్పడడంతో గ్రామా నికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వర్షం ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. నీటి ఉధృతికి రెండు ఇళ్లు, పలుదుకాణాలు, రెండు దేవాలయాలుకూలినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు, భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నారు. సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించి గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కరోడి లాల్ మీనా పేర్కొన్నారు. బిలంలోకి చేరుకున్న నీటిని యంత్రాల సహాయంతో మళ్లించాలని అధికారులను ఆదేశించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నేల కోతను ఆపడం అసాధ్యమన్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని పలు గ్రామాలు వరద నీటిలో మునిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. నిమోడా అనే గ్రామంలో దాదాపు 400 ఇళ్లు కూలిపోవడంతో అక్కడి ప్రజలు నిరాశ్రయులయ్యారని వారిని సహాయక శిబిరాలకు తరలించామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సైన్యం, జాతీయ రాష్ట్ర విపత్తు సహాయ దళాలు సహాయక చర్యలు అందిస్తున్నాయన్నారు.

# రష్యాలో భారత్ కార్మికులకు డిమాండ్

**మాస్కో, ఆగస్టు 25:** రష్యాలో భారత కార్మిక శక్తికి డిమాండ్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. రష్యన్ కంపెనీలు.. ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని సంస్థలు భారతీయులను నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అక్కడి భారత రాయబారి వినయ్‌కుమార్ తెలిపారు. రష్యాలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు భారతీయుల సంఖ్య పెరుగుతుండటంతో కాన్సులర్‌సేవలను మరింత విస్తరిస్తున్నట్లు చెప్పారు. అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాలు వలసలపై ఆంక్షలు విధిస్తున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'రష్యాలో మానవ వనరుల అవసరం ఉంది. భారత్ వద్ద నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉంది. ఈ క్రమంలోనే స్థానిక చట్టాలను అనుసరించి కంపెనీలు భారతీయులను నియమించుకుంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్రరంగాల్లో ఉపాధి పొందుతున్నారు. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ పెరుగుతోంది' అని ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో వినయ్‌కుమార్ వెల్లడించారు.

స్థానికంగా భారతీయ కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో.. పాస్‌పోర్ట్ పొడి గింపు వంటి కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధానికితోడు యువ రష్యన్లు ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు విముఖత చూపుతుండటం వంటి కారణాలతో.. 2030 కల్లా రష్యాలో 31 లక్షల మంది కార్మికులకు కొరత ఏర్పడనున్నట్లు అంచానా.

ఈ నేపథ్యంలో ఇక్కడి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక కొరతను తీర్చడానికి ఈ యేడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారతీయ కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

# అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు!



**వాషింగ్టన్, ఆగస్టు 25:** అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి రావడానికి కొన్ని రోజులముందే భారత్ లాబీయింగ్ యత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వంతో వ్యూహాత్మక అంశాల్లో కమ్యూనికేషన్లు నిర్వహించడం, సోషల్ మీడియా, మీడియా రిలేషన్స్, డిజిటల్ ఆడిట్ వంటివాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సంస్థను నియమించుకొంది. ఫారెన్ ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫైలింగ్ ప్రకారం.. భారత దౌత్య కారాలయం నెలకు 75,000 డాలర్లు చెల్లించేలా మూడు నెలలకు మెర్క్యురీ పబ్లిక్ ఆఫైర్స్ సంస్థతో ఒప్పందం చేసుకొంది. ఇది ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చింది. మెర్క్యురీ సంస్థ మాజీ రిపబ్లికన్ సెనెటర్ డేవిడ్ విట్టర్, 2020 ట్రంప్ ట్రాన్సిషన్ బృందం కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేసిన బ్రయాన్‌తో కలిసి భారత్ కోసం పనిచేస్తుంది. న్యూయార్క్ రాష్ట్రానికి సెనెటర్‌గా ఎన్నికైన తొలి ఇండో-అమెరికన్ కెవిన్ థామస్ సాయం చేయనున్నారు. ప్రస్తుతం ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ విలిస్ మెర్క్యురీ సంస్థతో సంబంధాలున్నాయి. 2024వరకు ఆమె ఈ సంస్థకోసం రిజిస్టర్డ్ లాబీయిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత శ్వేతసౌధంలో బాధ్యతలు చేపట్టారు. బ్రయాన్ గతంలో ట్రంప్ ప్రచార బృందంలో, జెడివాన్స్ సెనెట్‌కు పోటీ చేసినప్పుడు పనిచేశారు. విమర్శలు వచ్చాక.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత పాకిస్థాన్ చాలా వేగంగా ఆయనతో సంబంధాలను బలోపేతం చేసుకొంది. భారత్ మాత్రం కొంత వెనకబడిందనే విమర్శలు వచ్చాయి. ఇక పాక్ నాయకత్వం ట్రంప్ మాజీ బాడీగార్డ్ కీత్ షల్లర్ నిర్వహిస్తున్న లాబీయింగ్ సంస్థను నియమించుకొంది. మరోవైపు భారత్ ఇప్పటికే ట్రంప్ మాజీ సహాయకుడు జేసన్ మిల్లర్‌కు చెందిన ఎస్‌హెచ్‌డబ్ల్యు పార్టనర్స్ ఎల్‌ఎల్‌సిని నియమించుకొని నెలకు 1.50 లక్షల డాలర్లు చెల్లిస్తున్నాం. అమెరికాలో కీలకమైన ఒప్పందాలు, ఇతర పనులను పూర్తి చేసుకోవడానికి లాబీయింగ్ సంస్థలను నియమించుకోవడం కొత్తేమీ కాదు. చాలా దేశాలు వీటితో కలిసి పనిచేస్తుంటాయి.

**రష్యాను అదుపు చేయడానికే భారత్‌పై చర్యలు..**

రష్యా దూకుడును అదుపు చేయడానికి ట్రంప్ సర్కారు చాలా చర్యలు తీసుకొందని ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వెల్లడించారు. దీనిలో భాగంగానే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించినట్లు పేర్కొన్నారు. ఆయన ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఎక్కడ తక్కువకు వస్తే అక్కడే చమురు కొంటాం



### రష్యాలో భారత్ దౌత్యవేత్త వినయ్‌కుమార్ స్పష్టీకరణ

**మాస్కో, ఆగస్టు 25:** రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో ఆయిల్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కొన్ని నెలల క్రితమే ట్రంప్ హెచ్చరించారు. భారత్, రష్యానుంచి క్రూడ్ ఆయిల్ కొనటం అంటే.. ఇక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి రష్యాకు నిధులు సమకూరుస్తున్నట్లే అని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికల్ని భారత్ ఏమాత్రం లెక్కచేయలేదు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటూ ఉంది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. ఏకంగా 50 శాతం టారీఫ్ విధించారు. అయినా కూడా భారత్ వెనక్కు తగ్గలేదు. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ వారం రోజుల క్రితం మాట్లాడారు. తాము ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. తమకు భారత ప్రజల ప్రయోజనాలే ముఖ్యం అని అన్నారు. ఈనేపథ్యంలోనే రష్యాతన మిత్ర దేశం భారత్‌కు బంపర్ ఆఫర్ ఇచ్చింది. క్రూడ్ ఆయిల్‌పై5శాతం డిస్కౌంట్ ప్రకటించింది.

**ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాం..**

రష్యానుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై రష్యాలోని భారత అంబాసిడర్ వినయ్‌కుమార్ స్పందించారు.

తాజాగా, రష్యా ప్రభుత్వ మీడియా టాస్ ఏజెన్సీకి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలోని ఆయిల్ కంపెనీలు ఆయిల్ ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాయి.

భారత ప్రభుత్వానికి దేశప్రజల ప్రయోజనాలే ముఖ్యం.

ప్రజలకు సరిపడా ఆయిల్ అందించ డానికి తగిన చర్యలు తీసుకుంటుంది. రష్యాతో పాటు పలుదేశాలకు భారత్ పర స్పరసహకారం అందించటంవల్ల జాతీయ ఆయిల్ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్ నిలకడగా ఉంది. అంతెందుకు.. రష్యాతో అమెరికాకూడా వ్యాపారాలు చేస్తోంది కదా..' అని అన్నారు.

# వివాదాస్పదంగా గోర్ నియామకం



### భారత్-అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు

**వాషింగ్టన్, ఆగస్టు 25:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్‌లో అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్య వర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 యేళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీత మైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

**భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా?**

గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అని అన్నారు. పాకిస్థాన్‌సహా పొరుగు దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈచర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్-అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. ఇకపోతే.. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియమాకం భారత్-అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షడి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను కూడా కలపడం ఇబ్బందికరమే అనితెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోడీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతరసందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..**

2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత్-పాక్-అఫ్ఘానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్-అఫ్ఘానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ సానా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనెట్‌కు పంపే సమయంలో మస్క్-ట్రంప్ విభేదాలు తీవ్రస్థాయిలోఉన్నాయి. అదేసమయంలో ఇస్సాక్‌మన్ డెమొక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా ఉన్న మస్క్ చివరిరోజున.. నాసా చీఫ్‌పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక సెనెట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీకాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోదముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆన చివరి రెండేళ్లు మాత్రమే భారత్‌లో పనిచేశారు.



ఫిజి ప్రధాని సిత్వేని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ దృశ్యం

# గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భీకర దాడులు..

### ముగ్గురు జర్నలిస్టులు సహా 15 మంది మృతి



**టెల్‌అవీవ్, ఆగస్టు 25:** హమాస్ అంతమే లక్ష్యంగా గత 22 నెలలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజాగా గాజా నగరంలోని పలు ప్రాంతాలపై ఐడిఎఫ్ దాడులకు తెగబడింది. నాజర్ ఆస్పత్రిపై సోమవారం జరిపిన దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల్లో ఒక రాయిటర్స్‌కు చెందిన హతేమ్ ఖలీద్, ఓ ఫొటోగ్రాఫర్ అని స్థానిక వార్తాసంస్థ తెలిపింది. 2023 అక్టోబరు 7న మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటివరకూ గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 62 వేలు దాటింది. లక్షలాది మంది గాయపడ్డారు. ఇక ఈ యుద్ధంలో సుమారు 200 మందికిపైగా మీడియా వర్కర్స్ మరణించారు.

**గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం.. 64 మంది మృతి**

గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. వైమానిక దాడులతోపాటు.. ట్యాంకులతోనూ విరుచుకుపడుతోంది. గత 24 గంటల వ్యవధిలో 64 మంది మృతి చెందారని, 300 మందికి గాయాలయ్యాయని హమాస్‌కు చెందిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. గాజాసిటీ లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ 60 వేల మందితో రిజర్వు దళాలను రంగంలోకి దింపింది. మొత్తం గాజాస్ట్రిప్‌ను ఆక్రమించే ఉద్దేశం ఉందని బందీల విడుదలపై హమాస్‌తో పరోక్ష చర్చలు విఫలమైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న సంగతి తెలిసిందే. యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆదివారం దాడులు చేసింది. ఓ విద్యుత్‌కేంద్రం, గ్యాస్ సేష్టన్‌పాటు రాజధాని వ్యాప్తంగా వివిధ ప్రాంతాలపై బాంబుల కురిపించింది.

# సంక్షిప్తంగా..

## ఇడి దాడులతో గోడదూకబోయిన ఎమ్మెల్యే



**కోల్‌కతా, ఆగస్టు 25:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలువురు నేతల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఇడి అధికారులు ముర్షిదాబాద్ జిల్లాలోని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు ప్రదేశాలపై దాడులు నిర్వహించారు. అయితే సోదాల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే తమ ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకి గోడ దూకి పారిపోయేందుకు యత్నించారు. ఇంటి బయట కాపలా అధికారులు కృష్ణ సాహాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పారిపోయే క్రమంలో ఎమ్మెల్యే తన వద్ద ఉన్న సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు తన మొబైల్ ఫోన్‌ను ఇంటికి సమీపంలోని చెరువులోకి విసిరేసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామన్నారు. ఇంటి నుంచి పారిపోవడానికి ఎందుకు ప్రయత్నించారనే విషయంపై కృష్ణ సాహాను విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 2023 ఏప్రిల్‌లో సిబిఐ అధికారులు కృష్ణ సాహాను అరెస్టు చేశారని, 2025 మేలో ఆయనకు బెయిల్ మంజూరయిందని తెలిపారు. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కార్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షను 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## నటి ఆరోపణలు.. ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన కాంగ్రెస్



**తిరువనంతపురం, ఆగస్టు 25:** కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి చేసిన ఆరోపణలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ అతనిపై చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే రాహుల్ మామకుటత్తిల్‌ను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా వ్యవహరిస్తు న్నాడని, మూడేళ్లుగా వేధిస్తున్నారంటూ రీని జార్జ్ అనే నటి ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆ పార్టీ సీనియర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. రాహుల్ పేరును ఆమెనేరుగా ప్రస్తావించనప్పటికీ బిజెపి, సిపిఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉందని ఆరోపించాయి. రాజీనామా చేయాలని నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు. నాపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడాను. వారెవరూ నన్ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి నేనేకాదని నమ్ముతున్నాను. నేను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదుఅని రాజీనామా అనంతరం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయినా విమర్శలు ఆగకపోవడంతో ఇప్పుడు పార్టీ చర్యలు తీసుకుంది.

## యుపిలో ట్రాక్టర్, కంటైనర్ ఢీ: 8 మంది మృతి

**లక్నో, ఆగస్టు 25:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా ఘటల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి 2.15 గంటల సమయంలో 34వ జాతీయ రహదారిపై బులంద్‌షహర్, అలీగఢ్ సరిహద్దుల్లోని ఘటల్ వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి గోగాజీ భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో 8 మంది మృతి చెందారు. మరో 43 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. బాధితులు యూపీలోని కాస్గంజ్ నుంచి రాజస్థాన్‌లోని గోగామేడికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 43మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను ఘటనా స్థలం నుంచి తొలగించామన్నారు. ట్రక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

26-08pg6exHMNWJQE 10_26-08pg6exHMNWJQE.qxd 8/26/2025 12:11 AM Page 1



# మాస్టర్‌ప్లాన్ అమలుకు మరో శివరాత్రి రావాలేమో!

## మంత్రి, కలెక్టర్ ప్రకటనలు ఉత్తుత్తివేనా? ఎమ్మెల్యే హామీల మాటేమిటి?



సన్నిధి వీధిలో మాస్టర్ ప్లాన్‌కు అడ్డంగా ఉన్న భవనం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త** :శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్ అమలుకు మరో శివరాత్రి రావాలా? మహాశివరాత్రి ఏర్పాట్లు సమీక్ష సందర్బంగా సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మహాశివరాత్రి లోపల మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని అడ్డం ఉన్న ఒకే ఒకణ్ణి ఒప్పించి, నష్టపరిహారం చెల్లించి అమలుకు మార్గం సుగమం చేయాలని ఆదేశించారు. నిధులు ఇవ్వటానికి కూడా మంత్రి సిద్దం అంటూ ప్రకటించారు. శివరాత్రి జరిగి ఆరునెలలు అయినా అతీ గతీ లేదు. దాంతో జనం ఇక కొత్త ఆలయ పరిసరాలను చూడవచ్చునని కలలు కన్నారు. కానీ నెలలు గడుస్తున్నా ఆ ఒక్కణ్ణి తొలగించటానికి ఎందుకో మీన మేషాలు లెక్కించుకుంటున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఏమో మేము ప్రతి పాదనలు పంపామంటూచేతులు దులుపుకుంటుండగా ఫైలు కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ఎందుకు ముందడగు వేయటం లేదో ఎవరికి అంతుపట్టడం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్‌ను గతంలో దివంగత నేత గోపాలకృష్ణారెడ్డి అప్పటి ముఖ్యమంత్రి(ప్రస్తుత) నారాచంద్రబాబునాయుడు సూచనలతో మాస్టర్ ప్లాన్‌ను ఆమలు చేసారు. సుమారు రూ.వంద కోట్లు భక్తులు సమర్పించిన విరాళాలతో భూసేకరణ చేసారు. ఆలయం చుట్టు నిర్మించిన నిర్మాణాలే కాకుండా మరో 3.5 ఎకరాల భూములను సేకరించారు. వంద కోట్లు వెచ్చించి సేకరించిన స్థలాలను నేడు పార్కింగ్‌గా వినియోగించుకుంటున్నారు. మాస్టర్ ప్లాన్ కోసం వంద ఇళ్ళు లాడ్జిలు,వ్యాపార సంస్థలను సేవకరించారు. నష్టపరిహారాలు చెల్లించారు. అయితే సన్నిధివీధిలో అందరి కంటే ముందుగా తమ ఆస్తిని అప్పగిస్తామని ఓ లాడ్జి యజమాని దేవస్థానంకు ప్రతిపాదించారు. అయితే ఆయన తప్ప మిగిలినఅ ందరి ఆస్తులను సేకరించారు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాది కావటంతో పరిహారం విషయంలో పేచీ పడింది. ఇలా ఐదేళ్ళు గడిచిన తరువాత కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి స్థానిక శాసనసభ్యుడు ఆయన వెంట పడ్డారు. పలుమార్లు సమావేశం జరిపారు. చివరకు ఫిబ్రవరి 25లో దేవాదాయశాఖ, రెవెన్యూశాఖ మంత్రి కలెక్టర్‌లు పది రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కానీ జరగలేదు. శివరాత్రి తరువాత జిల్లా కలెక్టర్ స్థాయిలో కమిటి సమావేశం జరిపారు. బాధితునికి ఒప్పించారు. ఆతను రాతమూలకంగా ఇచ్చి మూడు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు పరిష్కారం లేదు. మాస్టర్ ప్లాన్‌కుఅ అడ్డంకిగా ఉన్న ఒకే ఒకవ్యక్తితో కలెక్టర్ కార్యాలయం చర్చలు జరిపింది. చివరకు బాధితుడు ఎంత కాలం పోరాటం చేస్తామన్నారు.

# కోవూరులో వేడుకగా స్త్రీశక్తి విజయోత్సవ సభ

## - భారీగా తరలివచ్చిన మహిళా గణం- ఆస్తిలో సమాన హక్కు కల్పించిన చరిత్ర మనది- తాత ఎన్టీఆర్ భావజాలాలను ముందుకు తీసుకెళ్తున్న లోకేష్: ఎమ్మెల్యే



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 25, ప్రభాతవార్త :** సూపర్ సిక్స్. సూపర్ హిట్ అన్న నినాదాలు హోరెత్తాయి. తరలివచ్చిన మహిళాగణంతో కోవూరు వీధులు కిక్కిరిశాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై ఆనందహేళి వెల్లివిరిసింది. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దాదాపు 5వేల మంది మహిళామణుల సమక్షంలో సోమవారం జరిగిన స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఆద్యంతం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు హాజరుకాగా మహిళలు వారికి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. అనంతరం వేదిక వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పాలనలో జరిగిన లబ్ధిని వివరిస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పలువురు మహిళలతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్బంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మహిళా సాధికారత ఎలక్షంగా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా శక్తికి నిదర్శనమే ప్రశాంతిరెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడమని ఉద్ఘాటించారు. చంద్రబాబు అవకాశం ఇవ్వడం వల్లే ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యేగా తాను ఎంపీగా ఇక్కడ ఉన్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నిత్యం కోవూరు ప్రజల అభివృద్ధి గురించి ఆలోచిస్తుంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే మహిళలకు సంబంధించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని, దీని ద్వారా రూ. 3.7 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారని, మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను కూడా తీసుకువచ్చారన్నారు. డ్వాక్రా మహిళలకు(ఓఎస్ఎంఎ) వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం కార్యక్రమం కింద అకౌంట్లో 15000 జమ చేశారని, ప్రతి నెల ఒకటవ తేదీన ఇంటింటికి పెన్షన్ అందజేస్తూ ఆదుకుం టు న్నారన్నారు. ఎంఎస్ఎం ఈ కింద పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తా జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఎంపీగా తనవంతు మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళలు మంచి ఆలోచనలతో ముందుకు వస్తే ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా తగిన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

# నక్సలిజాన్ని సమర్థించినట్టు 'సుప్రీం' తీర్పులో ఎక్కడా పేర్కొనలేదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** సల్వాజడుం రద్దు కేసులో సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించి మాట్లాడటం సరికాదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సుప్రీం తీర్పును తప్పుగా అర్థం చేసుకుంటున్నారని సుప్రీంకోర్టు, హైకోర్టు లకు చెందిన ప్రముఖ విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ బెనర్జీ, జస్టిస్ అంజనా ప్రకాష్, జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ కైలాష్ గంభీర్, జస్టిస్ మదన్, జస్టిస్ జేసీ, జస్టిస్ కురియన్, జస్టిస్ విక్రమ్, జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ గోపాల్ గౌడ, జస్టిస్ మురళీ ధర్, జస్టిస్ గోవింద్ మథుర్, జస్టిస్ చంద్రు, జస్టిస్ గోపాల్ రెడ్డి, జస్టిస్ కన్నన్, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ మోహన్ గోపాల్, జస్టిస్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రఘురామ్ ఓ ప్రకటనలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. సల్వాజుడుం తీర్పు కేసులో నక్సలిజాన్ని గానీ, దాని భావజాలాన్ని గానీ ఎక్కడా సమర్థించినట్లు పేర్కొనలేదని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తరపున ప్రచారం కోసం అమిత్ షా అటువంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదని తప్పుబట్టారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు గౌరవ ప్రదంగా, భావజాల కేంద్రీకృతంగా జరగాల్సిన ఎన్నికలని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగవని, అయినప్పటికీ అత్యున్నత పదవిలో ఉన్న హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనా ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉపరాష్ట్రపతి ఎన్నికను గౌరవప్రదంగా భావించాలని, వ్యక్తిగత దూషణలు, పేరుపెట్టి అవమానించడం వంటి సరికాదని పేర్కొన్నారు.

# సిఎం రేవంత్‌ను కలిసిన బాలాపూర్, ఖైరతాబాద్ గణేశ ఉత్సవ సమితి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి కలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేశ నవరాత్రి వేడుకలకు గణేశ ఉత్సవ సమితి ఆహ్వా నించింది. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నర సింహారెడ్డి, బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ గణేశ అడ్‌హాక్ కమిటీ కలిసింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో అడ్‌హాక్ కమిటీ శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి-2025 నవరాత్రి ఉత్సవాలకు సిఎంను ఆహ్వానించింది.



అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశ దృశ్యం

# వైద్యరంగంలో వినూత్న ఆవిష్కరణలు

## భారత్ బయోడిజైన్ రిసెర్చి ఇన్నోవేషన్ కార్యక్రమం రతన్‌టాటా ఇన్నోవేషన్‌తో కలిసి పనిచేయనున్న బయోడిజైన్ రిసెర్చి : సిఎంచంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి: వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో అంతర్భాగంగా ఈ రీసెర్చి ఇన్నోవేషన్ కార్యకలాపాలు ఉంటాయని ఆయన అన్నారు. ఏఐ, మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియాపసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా భారత్ బయో డిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా పని చేయనుంది. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయటం ద్వారా ప్రజారోగ్య రంగంలో బ్రెయిన్ కార్యక్రమం గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్ కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం సమావేశం అయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్ లతో పాటు పరిశోధనలు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తద్వారా ఏపీ నాలెడ్జి ఎకానమీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ,మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ కలపాల, స్టాన్‌ఫర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ ప్రొఫెసర్ అనురాగ్ మైరల్, ఆసియా పసిఫిక్ బయోడిజైన్ సహాధ్యక్షుడు డాక్టర్ యోనా వైస్‌బచ్, బయోడిజైన్ ఆస్ట్రేలియా ఛైర్ ప్రొఫెసర్ కెవిన్ ఫ్లెగర్, టోక్యో బయోడిజైన్ ప్రతినిధి యూరియోన్ కొబయాషి, తైవాన్ బయోడిజైన్ నుంచి జేమ్స్ చియెన్‌హియా ట్సెంగ్, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ మార్క్ చాంగ్, మిరాయ్ మెడికల్ సహ వ్యవస్థాపకుడు కొలిన్ ఫోర్డే తదితరులు ముఖ్యమంత్రికి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ను వైద్యారోగ్య రంగంలో ఆవిష్కరణలకు, మెడ్‌టెక్ పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే రోడ్‌మ్యాప్ పై ముఖ్యమంత్రి చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతిక బదిలీ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో సహాకారం అందించే అంశంపై గ్లోబల్ నిపుణులు ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ప్రత్యేకించి యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఎయిమ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందంతో భారత్ బయోడిజైన్ బయోడిజైన్ ఆస్ట్రేలియాలు ఉమ్మడిగా పనిచేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించేలా ఈ ఒప్పందం సహకరించనుంది. ఆంధ్రప్రదేశ్ ను గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ, డిజిల్ హెల్త్ ఇన్నోవేషన్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం ప్రధానంగా పనిచేయనుంది. ముందస్తు విశ్లేషణల ద్వారా వ్యాధుల సంక్రమణను నియంత్రించటం, ముందస్తుగా ఆరోగ్య భద్రతా కార్యక్రమాలు, తక్కువ వ్యయంతో ఆరోగ్య సేవల్ని ప్రజలకు అందించే అంశాలపై దృష్టి సారించనుంది. ఆదే సమయంలో అంతర్జాతీయ బయో డిజైన్ ఎకో సిస్టంలను భారత్‌లో ఉన్న భాగస్వాములను అనుసంధా నించటం పైనా ఈ ఒప్పందం సహకరించనుంది. ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ విధానాల్ని ఏపీలో అమలు చేయ టం, బయో డిజైన్‌లో శిక్షణ, పరిశోధనా రంగాల్లో అంతర్జాతీయ సహకారం, ప్రజారోగ్య రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

## కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్



**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ 9 జిల్లాల్లో ప్రారంభమైంది. ఉచితంగా 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం మొదలైంది. చౌకబియ్యం పక్కదారి పట్టకుండా నివారించడమే లక్ష్యంగారాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులను నేటి నుంచి పంపిణీ చేస్తోంది. లబ్దిదారులకు సాంకేతిక హంగులతో స్మార్ట్ కార్డులు అందిస్తున్నారు. క్యూఆర్ కోడ్‌వంటి ప్రత్యేకతలు రూపొందించారు. దీనివల్ల రాష్ట్రంలో ఎక్కడి వారైనా, ఎక్కడి నుంచైనా రేషం తీసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పంపిణీ ప్రక్రియ వచ్చే నెల 15 తేదీ వరకు 4 విడతల్లో జరగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడలో వరలక్ష్మీ నగర్ లోను,కృష్ణాజిల్లా పెనమలూరులోను స్మార్ట్ రైస్ కార్డులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఏ కార్డులను ప్రారంభించారు. అనంతరం సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నారు. 15 రోజుల్లో 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు ఉచితంగా ఇంటింటికీ వెళ్లి అందించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. ఇక రాష్ట్రంలో నేటి నుంచి మొదటి విడత ప్రక్రియ కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. అదే విధంగా రెండో విడతను ఈనెల 30వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ రైస్ కార్డులను ఏటీఎం కార్డు తరహాలో జేబులో ఇమిడి పోయే విధంగా తయారు చేశారు. ఈ స్మార్ట్ కార్డులపై ఒకవైపు రాజముద్రతో పాటు లబ్ధిదారు ఫొటో ఉండే విధంగా రూపొందించారు. మరోవైపు క్యూఆర్ కోడ్ ఉండేలా ముద్రించారు. కార్డుపై ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొత్తగా రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలోనే కార్డులు రానున్నాయని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 6.70 లక్షల కార్డుదారులతో పాటు అడ్రస్ మార్పు చేసుకున్న వారికీ స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ సహా పలు సాంకేతిక అంశాలతో స్మార్ట్ కార్డులు తయారు చేశారు. రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ పోస్ యంత్రాలనూ ప్రభుత్వం ఆధునికీకరించింది. స్మార్ట్ రైస్ కార్డుతో స్కాన్ చేసి బయోమెట్రిక్, ఐరిష్ గుర్తింపుతో సరకులు పంపిణీ చేసే ఏర్పాట్లు చేశారు. సరకుల పంపిణీ సమాచారం ఎప్పటికప్పుడు కేంద్ర సర్వర్ కు చేరవేసేలా రూపొందించారు. రేషన్, సరకుల పంపిణీలో అక్రమాలు వివరించడమే లక్ష్యం.

# స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత

## సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**ముత్తుకూరు (నెల్లూరు), ఆగస్టు 25, ప్రభాతవార్త :** ముత్తుకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకొస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు అంటూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వాహనాలను తెచ్చారు. ఆ వాహనాలు వచ్చిన సమయంలోనే రేషన్ సరుకులు తీసుకోవాలని, అవి కూడా ఇంటి వద్దకు రావు వీధిలో ఎక్కడో ఒక చోట నిలుపుతారన్నారు. వాహనాలు వచ్చిన గంటలో రేషన్ సరుకులు తీసుకోకపోతే ఇక ఆ నెలలో కట్, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో పాత విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ షాపుకి వెళ్లి సరుకులు పొందవచ్చు65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులే ఇచ్చే ఏర్పాటు చేసింది. ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరుకులు అందజేస్తున్నారు. మొదట రేషన్ కార్డు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ప్రయోజనాల కన్నా పాలకుల ఫొటోలకే ప్రాధాన్యమిచ్చారు. ఇప్పుడు మా ప్రభుత్వం కేవలం లబ్ధిదారుల ఫొటోలతోనే స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఈదురు రామ్ ప్రదీప్ కలిసేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యూరియా కొరత లేదు

## కాంగ్రెస్ చేస్తున్నది తప్పడు ప్రచారం

## బిసి రిజర్వేషన్లు బిసిలకు ఇవ్వాలి

## నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలకు చెందాల్సిన రిజర్వేషన్లు బిసిలకే దక్కాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సోమ వారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఇందూర్‌లో బూత్ స్థాయి సభ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు యూరియా కొరత అంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, బిజెపి ఎక్కడా కూడా యూరియా పంపిణీని ఆపలేదు. తెలంగాణకు అవసరమైనంత మేరకు యూరియా సరఫరా చేసిందన్నారు. తెలంగాణలో నడుస్తోంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ యూరియా కొరత మాత్రమే అన్నారు. తాను పలు జిల్లాల్లో పర్యటించి కలెక్టర్లతో మాట్లాడానని, ఎక్కడా కూడా యూరియా కొరత లేదని వారు చెప్పారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటగా రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని, రైతుల ఆత్మ హత్యలు ఎక్కువగా జరిగినది కూడా బిఆర్ఎస్ పాలనలోనే. అందుకే రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపి ధర్మ పురి అర్వింద్ జన్మదినం సందర్భంగా హృదయపూర్వక శుభా కాంక్ష లు తెలిపిన ఆయన రూ.25 లక్షల వరకు ధర్మపురి అర్వింద్ ట్రస్ట్ ద్వారా కార్యకర్తల సంక్షేమం కోసం వితరణ చేశారు. కార్యకర్తల పట్ల అర్వింద్‌కి ఉన్న ప్రేమ గొప్పది అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు రావడం ప్రధాని నరేంద్ర మోడీ గొప్పతనం, అర్వింద్ అలుపెరుగని ప్రయత్నం అన్నారు. ప్రధాని మోడీ తెలంగాణలో 32 లక్షల మంది రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. తెలం గాణలో రైతుబంధు బంద్ అయిందని, తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో అనేక వాగ్ధానాలు చేసి మాట తప్పిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వలేదని, రైతు భరోసా సరిగ్గా ఇవ్వలేద న్నారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున పేదలకు ఇళ్లు కడతామని చెప్పారు, కానీ అమలు చేయలేదన్నారు. అన్నీ అబద్ధాలతోనే కాంగ్రెస్ కాలయాపన చేస్తుంద న్నారు. ఓటు చోరీతోనే గెలుస్తోందని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆరోపించారు.

# మిక్ కళాశాల అధ్యాపకుడు జి వి పి చంద్ర శేఖర్ యాదవ్‌కి డాక్టరేట్

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** మిక్ కాలేజీ అఫ్ టెక్నాలజీ, కంచికచర్ల లో పని చేయుచున్న జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ కి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం లో కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. వంశీ కిరణ్ గారు తెలిపారు. "క్వాడ్రాటిక్ ఫ్రీక్వెన్సీ మోడులాటెడ్ థర్మల్ వేవ్ ఇమేజింగ్ ఫర్ కేరెక్టరైజషన్ అఫ్ సాలిడ్స్" అను అంశం పై జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్బంగా డా. జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ ను కళాశాల సి. ఈ. ఓ. డి. పాండురంగ రావు, మేనేజ్మెంట్ మెంబెర్ ఎమ్. సుహాస్ గారు, ప్రిన్సిపాల్ డాక్టర్. టి. వంశీ కిరణ్. ఇతర అధ్యాపకులు అభినందిచారు.

# పూజల పేరిట పురోహితుడికి టోపీ

## రూ.6 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

**హైదరబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు శృతి మించు తున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని, రోజుకో కొత్తరకం పద్ధతుల్లో అమాయకపు ప్రజలను బురిడి కొట్టిస్తున్నారు. తాజాగా పూజల పేరుతో నగరానికి చెందిన ఓ పురోహితుడికి కుచ్చు టోపీపెట్టి అతడి ఖాతా లో ఉన్న రూ. 6 లక్షలు స్వాహా చేశారు. సైబర్ నేరాల కట్టడికి పోలీసులు విశ్వప్రయత్నం చేస్తున్నా నిత్యం ఎక్కడో ఒకచోట మోసాలు జరుగుతుం డటం కలకలం రేపు తోంది. వివరాల్లోకి వెళ్తే.. పాతబస్తీ పురానాపూల్‌కి చెందిన పురోహితుడు(52)కి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాను సికిందరాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి క్యాప్టెన్ అమన్‌కుమార్ మాట్లాడుతున్నానని పరిచయం చేసుకొని, కల్నల్ సార్ ఆరోగ్యం బాగోలేదని ఇందుకోసం 11 రోజుల పూజ జరిపించడానికి 21 మంది పురోహితులు కావాలని తెలిపాడు. నిజమేనని నమ్మిన పురోహితుడు 11 రోజుల పూజకయ్యే ఖర్చుతో పాటు పురోహితుల సంభావన తదితర వివరాలను తెలపగా, అడ్వాన్స్ కింద రూ. 3 లక్షలు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు నమ్మకం కలిగించేందుకు ముందు గా ఆయన యుపిఐకి రూ. 10 వేలు పంపించారు. అనంతరం వేరే నంబర్ నుంచి విడియో కాల్‌చేసి మిగతా డబ్బు పంపుతా మని పురోహితుడిని నమ్మించి ఆయన బ్యాంకుఖాతా, ఎటిఎమ్ కార్డు, పిన్ నంబర్ వివరాలు తీసుకు న్నారు. ఇంకేముంది విడతల వారీగా పురోహితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 5.99 లక్షలు కాజేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధి తుడు సోమవారం సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ డయల్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీ సులు దర్యాప్తు చేపట్టారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఎటిఎమ్ కార్డు, పిన్‌నంబర్, ఒటిపి తదితర వివరాలు చెప్పవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ సభ్యురాలుగా శ్రుతి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ (ఐడబ్ల్యూ ఎఫ్) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎం. శ్రుతి ఎంపిక య్యారు. అహ్మదాబాద్ వేదికగా సోమవారం జరిగిన జాతీయ సమ్మేళనంలో వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు ఎన్నికలు జరిగాయి. ఇందులో శ్రుతి జాతీయ కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికైనట్లు ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సహదేవ్ యాదవ్ ప్రకటించారు.

వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు విశేషంగా సేవలు అందించిన శ్రుతి ప్రస్తుతం ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, రాష్ట్ర శాఖకు అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు.



ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమైన ఎంపి అసదుద్దీన్ ఒవైసి

## హైదరాబాద్‌లో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలి : ఎంపి అసదుద్దీన్‌ఒవైసి

**హైదరాబాద్ (యాకుత్‌పుర), ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సోమవారం ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి కలిశారు. కొద్ది రోజులుగా హైదరాబాద్ నగరంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని ఎంపి ఒవైసి.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో మలక్‌పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## కూరగాయలకు ఇతర రాష్ట్రాలే దిక్కు

### యేటా 19 లక్షల టన్నుల కొరత

### రాష్ట్ర అవసరాల్లో బయట నుండి 60 శాతం

### మహారాష్ట్ర క్యాలీఫ్లవర్, యుపి మిర్చి, జైపూర్ టమోట

### కొరత ఉన్న వాటిపై దృష్టి సారించని ఉద్యాన శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వినియోగించే కూరగాయలకు సంబంధించి ఉద్యాన శాఖ వైఫల్యంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. జనాభా అవసరాలకు తగినట్లుగా రాష్ట్రంలో కూరగాయల సాగు జరగడం లేదు. రాష్ట్రంలో కొరత ఉన్న కూరగాయలను ప్రోత్సహించి, వాటిని సాగు చేయించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా రాష్ట్ర అవసరాల్లో 60 శాతం ఇతర రాష్ట్రాల నుండే దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూరగాయల సాగు చేసేందుకు ప్రోత్సాహం లేక, తగిన సమాచారం, సలహాలు ఇచ్చేవారు లేక వాటి సాగు పట్ల రైతాంగం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చివరకు పచ్చి మిర్చికి కూడా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అగత్యం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా 3.10 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు అవుతున్నట్లు ఉద్యాన శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఏడాదికి 42 లక్షల టన్నుల కూరగాయలు అవసరం కాగా 23 లక్షల టన్నులు మాత్రమే సాగవుతోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 19 లక్షల టన్నుల కూరగాయల కొరత ఏర్పడుతోంది. ఫలితంగా పంటలు అధికంగా పండే తెలంగాణలో ప్రస్తుతం కాయగూరలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వేసవిలో అన్ సీజన్‌లో 60 శాతం నుండి 70 శాతం కూరగాయలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి అవుతున్నాయి. సాగు ఎక్కువగా జరిగే అక్టోబరు నుండి మార్చి వరకూ మాత్రమే 50 శాతం కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర నుండి క్యాలీఫ్లవర్, రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుండి టమోటాలు, ఉత్తరప్రదేశ్ నుండి పచ్చిమిర్చి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తోంది. శ్రీలంకలో సంక్షోభం కారణంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఆ దేశానికి టమోటాలు, ఇతర కూరగాయలు సరఫరా అవుతుండడంతో తెలంగాణలో కూరగాయల ధరలు భారీగా పెరిగినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా జైపూర్ నుండి టమోటాలు, ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్ మార్కెట్ నుండి పచ్చిమిర్చి, మహారాష్ట్ర నుండి క్యాలీఫ్లవర్ హైదరాదాబాద్‌తో సహా తెలంగాణలోని పలు పట్టణాలకు వచ్చినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూరగాయల ధరలు గత నెలతో పోలిస్తే చెప్పకోదగ్గ స్థాయిలో పెరిగాయి. నెల క్రితం కిలో 10 రూపాయలకు అమ్మిన టమోటా ప్రస్తుతం హైదరాబాద్‌లో క్వాలిటీని బట్టి 150 రూపాయలు పలుకుతోంది. బోడ కాకరకాయలు అయితే కిలో 400 రూపాయలు, మిర్చి 130 రూపాయలు, ఇక బీరకాయ, బెండకాయలు తదితర కూరగాయలు అన్నీ కిలోకు 60 రూపాయల పైబడి ధరలు పలుకుతున్నాయి. ఇక క్యాబేజీ విషయానికి వస్తే అన్ని రాష్ట్రాల నుండి హైదరాబాద్‌కు 1,650 క్వింటాళ్లు వస్తోంది. అయితే ఇటువంటి కూరగాయలను తెలంగాణలోనే పండించే అవకాశం ఉన్నా ఉద్యాన శాఖ నిర్లక్ష్యం కారణంగా ఇతర రాష్ట్రాలే దిక్కవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికే మద్దతు

### డిసెంబర్‌లో పార్టీ శతజయంతి వేడుకలు

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా ప్రకటించారు. సోమారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేస్తే ఏ ప్రభుత్వాన్ని అయినా నిలదీసే హక్కు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉంటుందన్నారు. భారత ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. కుల రాజకీయాలు, మత రాజకీయాలకు కేరాఫ్‌గా బిజెపి నిలిచిందని మండిపడ్డారు. ఓట్ల చోరీతో బిజెపి అధికారంలోకి రావడం చాలా అన్యాయమని.. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నట్టు తెలిపారు.

## ఎసిబి వలలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

### రూ.25 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన వైనం

**చుంచుపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఫెర్టిలైజర్ షాపు యజమాని నుంచి లంచం తీసుకుంటూ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏసీబీ అదికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ రమేష్ వెల్లడించారు. మండలంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు ఇటీవల తనిఖీల్లో భాగం గా యూరియా అమ్మ కాలకు సంబంధించి పాల్వంచ మండలంలోని ఉల్వనూరులో ఉన్న ఫెర్టిలైజర్ షాపు సిబ్బం దిని మీ వద్ద ఎలాంటి లైసెన్సులు లేవని బెదిరించి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సంబంధిత వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఫోన్ చేసి తాము అంత ఇచ్చుకోలేమని చెప్పడంతో రూ.30 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు తాము రూ.25 వేలు ఇస్తామని చెప్పడంతో సదరు అధికారి ఒప్పుకున్నారు. దీంతో రూ.25 వేలు నగదును సదరు అదికారికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



ఎసిబికి పట్టుబడిన వ్యవసాయ అధికారి నరసింహారావు

## ఎస్సారెస్పీలోకి వారం రోజుల్లో 128.394 టిఎంసిల వరదనీరు

### 61.449 టిఎంసిలు బయటకు విడుదల చేసిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్ జలాశయంపై ఎగువన మహారాష్ట్ర జైక్వాడ్ నుంచి బాబ్లీ వరకు అనేక ప్రాజెక్టులు నిర్మించి బేసిన్ బయటి ప్రాంతాలకు నీటిని తరలిస్తుండటంతో ప్రతియేడు ఎస్సారెస్పీకి నీరు వచ్చి చేరుతుందా లేదా అనే అనిశ్చితి నెల కొంటుంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రతియేడు జూలై 1న ఎత్తి అక్టోబర్ 29న దించి వేయాల్సి ఉంటుంది. అంతేకాదు మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6టిఎంసి నీటిని ఎస్సారెస్పీకి వదలాల్సి ఉంటుంది. ఈ సంత్సరం బాబ్లీ గేట్లు ఆనవాయితీగా ఎత్తినా కూడా ఆగస్టు రెండో వారం పెద్దగా నీరు వచ్చి చేరలేదు. మూడోవారం మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఎస్సారెస్పీలోకి పోటెత్తింది. వారం రోజుల్లోనే 128.394 టిఎంసిల నీటిని ఎస్సారెస్పీ ఒడిసిపట్టింది. అందులో 61.449 టిఎంసిల నీరు ఇందిరమ్మ ఫ్లడ్‌ఫ్లో, మిషన్‌భగీరథ, నిజామాబాద్, నిర్మల్ టిఎస్ఐడి పథకాలద్వారా, గుప్త లిఫ్ట్ ఇరిగేషన్, అనిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్, లక్ష్మీ కెనాల్, కాకతీయ మెయిన్ కెనాల్, జల విద్యుత్ ఉత్పత్తి వంటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించడంతో పాటు స్పిల్‌వే ద్వారా దిగువకు విడుదల చేసిన 34 టిఎంసిల నీరు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చిచేరింది. శ్రీరామ సాగర్‌కు ప్రస్తుతం సోమవారం రాత్రి8గంటల వరకు ఎగువ నుంచి 30వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోంది. అదే స్థాయిలో నీటిని బయటకు వదిలిపెడుతున్నారు. నీటిమట్టం 1090.90 ఫీట్ల ఎత్తులో 80టిఎంసిలనీరు ఇప్పు డు అందులో ఉంది. ఊష్ణోగ్రత పెరిగి పోవడంతో రోజుకు 666 క్యూసెక్కుల నీరు ఆవిరిగా వృధా అవుతోన్నది. జూరాల జలాశయానికి కూడా 3.88 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఎగువన కర్ణాటక నుంచి ఆదివారం రాత్రి వరకు వచ్చిచేరింది.

## చంద్రబాబు, వైఎస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడలేదు

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** చంద్రబాబు, వైఎస్ ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడలేదని, అదే హైదరాబాద్ అభివృద్ధిని అణగదొక్కో మీ కుటుంబం వాడుకొని ఆర్థికంగా ఎదిగిందని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గాంధీభవన్ ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను కెసిఆర్ కని పెట్టినట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. కెటిఆర్‌కి తెలియక మాట్లాడుతున్నారా అర్థం కావడం లేదని అభిప్రా యపడ్డారు. కెసిఆర్ హయంలో నాలుగు ఫ్లై ఓవర్లు, దుర్గం చెరువు సెల్ఫ్ పాయింట్ తప్ప ఏం కాలేదని ఆయన చెప్పారు. బరాబర్ ఎన్నికలు పెడతాం 42 శాతం అంతేకాదు బిసి రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలు వెళ్ళే దమ్ము ఉందా అని అంటున్నారు. పదేళ్లలో 60 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారితే, అప్పుడు మీ దమ్ముకు దుమ్ము పట్టిందా? అని నిలదీశారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఎమ్మెల్యేలు గెలిచినా పార్లమెంట్‌లో సున్న వచ్చింది. కంటోన్మెంట్‌లో మూడో స్థానం వచ్చింది. ప్రెస్‌మీట్ మూడు పూటలు పెట్టకపోతే మిమ్మల్ని ప్రజలు మర్చిపోతారనుకుంటున్నారు. హరీశ్‌రావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఎంత ఉంది. కేవలం రేవంత్‌రెడ్డి హయంలో మాత్రమే డెంగ్యూ వస్తుందన్నట్లు చెబుతున్నారని అన్నారు. బిసిపై బిజెపి, బిఆర్ఎస్ లకు చిత్తశుద్ధి ఉంటే 42శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటిం చండి. రేవంత్ రెడ్డికి బిజెపి ఎంపిలు కాపాడితే తెలంగాణ నంబర్ వన్ అయ్యేదని అన్నారు. మెట్రో ఫేజ్ 2 వచ్చేది. పది మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీ లో ఉన్నారో చెప్పుకోవడం అనేది వాళ్ళ ఇండిజ్యుల్ కెపాసిటీ అని తెలిపారు. చంద్రబాబుకు ఇచ్చే ఇంపార్టెన్స్ బిజెపి ఎంపీలకు కేంద్రం ఇవ్వడం లేదు. తెలంగాణకు రావాల్సిన వాటాను గుజరాత్, ఎపికి కేంద్రం పంపుతుందని అవేదన చెందారు.




సోమవారం గాంధీభవన్ మాట్లాడుతున్న ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ఎంఎంటిఎస్‌తో భువనగిరి ప్రజల కష్టాలు తీరుతాయి**

ఘట్కేసర్ నుండి యాదాద్రి భువనగిరి ఎంఎంటిఎస్ రైలు భూసేకరణ కోసం యాదాద్రి కలెక్టర్, మేడ్చల్ కలెక్టర్‌లు కృషిచేస్తున్నారని భువగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఎంపి చామల సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికీ వచ్చే భక్తులకు, అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయని ఆయన చెప్పారు.

## 'స్థానిక' ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలి

### సత్యాగ్రహ దీక్షలో ఎంపి ఆర్.కృష్ణయ్య

### మద్దతు తెలిపిన ఎంపి ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఆర్.కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈదీక్షకు మల్కా జిగిరి పార్లమెంట్ సభ్యు డు ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధు సూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, బీసీ కమీషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, గువ్వల బాలరాజు, ఐఏఎస్ చిరంజీవులు తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రకారం సమాన వాటా కావాలని డిమాండ్ చేశారు. 76 సంవత్స రాలుగా ముఖ్య మంత్రి, మంత్రి పదవులు కూడా మీరే తీసుకుంటున్నారని, మాకు కనీసం సర్పంచులు, కౌన్సిలర్లు కూడా వద్దా అని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్లు అని హామీ ఇచ్చి, ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని ప్రకటిస్తున్నారని, పార్టీల పరంగా మాకు భిక్షం వద్దని, 42శాతం రిజర్వేషన్ మా హక్కు, మా హక్కు మాకు కావాలని స్పష్టం చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహదీక్షకు సంపూర్ణంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకమాటలు బందుపెట్టి, తక్షణమే 42శాతం రిజర్వేషన్లు అమలుచేసి, స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఓడిపోతామని భయంతో బీసీ సమస్య అడ్డుపెట్టుకుని అది తేలేవరకు ఎన్నికలు జరపమని మోసం చేసే ప్రయత్నం చేస్తే తెలంగాణ బీసీ సమాజం మిమ్మల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఒక బీసీ ప్రధానమంత్రి, 27మంది ఓబీసీలను మంత్రులుగా చేయగలిగిన పార్టీ భారతీయజనతాపార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి పదవిని కూడా ఓబీసీకి ఇచ్చి, సన్మానించుకున్న చరిత్ర మనకు తెలుసన్నారు. దీక్షా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, లాల్‌కృష్ణ, వేముల రామకృష్ణ, బర్క కృష్ణ, రాజేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, దూదిమెట్ల బాలరాజ్, రాజారామ్‌యాదవ్, బి.ఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు.

## అనాజ్‌పూర్ రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలి

### జాన్‌వెస్లీతోపాటు, రైతు నేతల అరెస్టును ఖండిస్తున్నాం: సిపిఎం రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా అనాజ్‌పూర్ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అనాజ్‌పూర్ భూపోరాటం నేపథ్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు ఇ. నర్సింహ, రైతుసంఘం జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని పార్టీ రాష్ట్ర కమిటీ మండిపడింది. సిపిఎం పార్టీ నాయకులతోపాటు సంబంధిత రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టుచేసి పహడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామని పార్టీ రాష్ట్ర ఆఫీస్ ఇన్‌ఛార్జ్ జె బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు చేసిన అయిన వారిని తక్షణమే విడుదల చేసి, బాధిత రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి, ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 274, 275, 276, 277, 278, 281లో 125 ఎకరాల సీలింగ్ భూమిని 125 మంది పేదలకు 1991 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసి, సర్టిఫికెట్లు, పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసిందన్నారు. అట్టి భూములను నాటి నుండి నేటి వరకు రైతులు సాగు చేసుకుంటున్నారని.. కానీ ధరణి పోర్టల్ ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేయలేదన్నారు. ఇప్పటికీ ధరణి పాసుపుస్తకం ఇవ్వ లేదని.. దీంతో రైతు భరోసా, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, బ్యాంకు లోన్లు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని బాధిత రైతులు గత ఎనిమిదేళ్ళుగా అనేకసార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దారును కలిసినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) అబ్దుల్లాపూర్‌మెట్టు మండల కమిటీ బాధిత రైతులకు అండగా నిలబడిందని.. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, బాధిత రైతులు భూమి దగ్గరకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని వారిని అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు.

తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పోలీసు పహారా మధ్య ముగిసిన స్వాతి అంత్యక్రియలు

### మూసీలో లభ్యంకాని మృతురాలి శరీర భాగాలు

### మొండెంతోనే అంత్యక్రియలు పూర్తిచేసిన కుటుంబీకులు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** భర్త చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన గర్భిణీ స్వాతి అంత్యక్రియలు సోమవారం వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడలో ముగిసాయి. తొలుత స్వాతి ముఖం, చేతులు, కాళ్ల వెతికి పూర్తి శరీరం అప్పగిస్తేనే అంత్యక్రియలు నిర్వహిస్తామని స్వాతి తల్లిదండ్రులు ఆందో ళనకు దిగారు. కానీ, భారీవర్షాల నేపథ్యంలో మూసీ ఉధృతంగా ప్రవహించ డంతో ఎంత గాలించినా శరీరభాగాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు, గ్రామస్థులు వారిని అంత్యక్రియలు చేసేలా ఒప్పించారు. నిందితుడికి చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక స్వాతి మొండేన్ని కామారెడ్డిగూడకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. నిందితుడు మహేందర్‌రెడ్డి తీరుపై గ్రామస్థులు ఆగ్రహంతో మండిపడ్డారు. నిందితుడి ఇంటిముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోకి మహేందర్ కుటుంబసభ్యులను రానివ్వమని తేల్చిచెప్పారు. పోలీసులు భారీగా మోహరించి, అంత్యక్రియలు పూర్తి చేయించారు. నిందితుడు మహేందర్‌రెడ్డి పెద్దసైకో అని, స్వాతితో తరచూ గొడవపడేవాడని స్వాతి సోదరి శ్వేత తెలిపింది. తన అక్కను అతికిరాతకంగా చంపిన వాడికి బతికే అర్హత లేదని, వెంటనే చంపేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. వాడు ఒకవేళ జైలు నుంచి విడుదలైతే తమ కుటుంబాన్ని కూడా అంతం చేస్తాడంటూ రోదించింది.

లేకపోతే మహేందర్‌రెడ్డిని తమకు అప్పగించాలని, మా అక్కను ఎలాగైతే చంపాడో వాడిని అలాగే చంపుతామని ఆవేదన వ్యక్తం చేసింది. స్వాతి హత్యకు కొద్దిరోజుల ముందు మహేందర్‌రెడ్డి తాను ఉండే హాస్టల్ దగ్గరికి వచ్చి కలిశాడని, ఈ విషయం స్వాతికి చెప్పొద్దని అన్నాడని చెప్పింది. అలాగే తాము గొడవ పడుతున్న విషయం గురించి అమ్మనాన్నలకు చెప్పొద్దని స్వాతి కూడా తనతో చెప్పినట్లు తెలిపింది. నిందితుడికి వెంటనే ఉరిశిక్ష విధించాలని పోలీసులను ప్రాధేయపడింది.

తన భార్య స్వాతిని హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని మాయం చేసే ప్రయత్నంలో ఆమె శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా రంపంతో కోసి ప్రతాపసింగారం వద్ద గల మూసీలో విసిరేశాడు నిందితుడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సహాయంతో శరీర భాగాలను వెతికించారు. ఆదివారం పది కిలోమీటర్ల మేర గాలించిన అవి లభ్యం కాలేదు. ఈ క్రమంలో తిరిగి మళ్లీ సోమవారం మరోసారి డీఆర్ఎఫ్ బృందాలు బోట్ల సహాయంతో గాలించిన ఫలితం లేకుండా పోయిందని పోలీసులు పేర్కొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్‌టిసి బస్సు

### ఆర్‌టిసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయమైన శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ఆర్‌టిసి నేరుగా బస్సును నడపనుంది. ఈ సౌకర్యాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ 'ఎక్స్' వేదికగా సూచించారు. శ్రీశైలం వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఆర్‌జిఐఎ క్రాస్ రోడ్స్ వద్ద కొత్తగా బోర్డింగ్ పాయింట్‌ని టిజిఎస్ ఆర్‌టిసి ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి పుష్పక్ బస్సుల్లో సమీపంలో ఉన్న ఆర్‌జిఐఎ బోర్డింగ్ పాయింట్‌కి భక్తులు ప్రయాణించి.. అక్కడి నుంచి ఆర్‌టిసి బస్సుల్లో శ్రీశైలానికి వెళ్లొచ్చని తెలి పారు. ఈ బోర్డింగ్ పాయిం ట్ నుంచి ప్రతి 20 నిమిషాలకి ఒక బస్సు శ్రీశైలానికి అందుబాటులో ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు టిజిఎస్‌ఆర్‌టిసి బస్.ఇన్ వెబ్‌సైట్‌లోనూ ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని.. రిజర్వేషన్ సమయంలో వారు ఆర్‌జిఐఎ క్రాస్‌రోడ్ బోర్డింగ్ పాయింట్‌ని ఎంచుకోవాలన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి కోరుతోందని సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## అడ్‌హాక్ కమిటీ యూరియా సరఫరాలో కేంద్ర వైఫల్యం

### కేటాయింపుల కోసం ఎంతకైనా పోరాడతాం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడంలో కేంద్రం ఘోరంగా వైఫల్యం చెందిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఇప్పటికే పాత నిల్వలతో కలుపుకొని 7.32 లక్షల టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రైతులకు బహిరంగ లేఖ విడుదల చేశారు. కేంద్ర అసమర్థతను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇతర దేశాల నుంచి దిగుమతి కావల్సిన యూరియా నిలిచిపోవడం, దేశీయంగా డిమాండ్ కు తగ్గ ఉత్పత్తి లేక అన్ని రాష్ట్రాల్లోనూ యూరియా కొరత ఉందన్నారు. తెలంగాణకు కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్‌లో 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయింపు చేయగా, ఇందులో ఇప్పటి వరకు 5.72 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. ఇంకా 2.58 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయలేదని, దీంతో డిమాండ్‌కు తగ్గట్టు నిల్వలులేక రాష్ట్రంలో ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. దిగుమతి యూరియాలో ఇబ్బందులు తలెత్తుతాయని ముందే గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్వదేశీ యూరియానే కేటాయించాలని ఎన్నోసార్లు కోరినా పట్టించుకోలేదని తప్పుపట్టారు. యూరియా కొరతపై సొసైటీల వద్ద చెప్పులు క్యూ లైన్ లో పెట్టించడం, బర్త్ డే వేడుకలు పేరుతో బస్తా గిఫ్ట్ ఇచ్చినట్లు స్కిట్ లు చేయడం, మహిళలను క్యూ లో నిలబెట్టి కొరత ఉందని అసత్యాలు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం తరపున రాష్ట్ర రైతాంగానికి యూరియా సరఫరాలో జరిగిన ఆలస్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు కారణం ఎవరో రైతులు తెలుసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి

### మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీఆర్‌టియూ అనుబంధ సంఘమైన తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై హరీష్‌రావ్ మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల సమయంలో మమ్మల్ని గెలిపించండి ఫిక్స్ వేతనం 18వేలు ఇస్తామని ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ మాటలు నమ్మి, ఆశావర్కర్లు ఓట్లు వేసి గెలిపించారు కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని అమలుచేయలేదని ఆరోపించారు. ఆశావర్కర్లు కేవలం రేవంత్‌రెడ్డి ఏమాట ఇచ్చారో ఆ మాటను నెరవేర్చండి అని అడుగుతున్నారు తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరటం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశావర్కర్లకు ఇచ్చిన మాటలు నెరవేరుస్తారా లేక ఉద్యమించమంటారా అని ప్రశ్నించారు. సంఘం గౌరవాధ్యక్షులు, బీఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీఆర్‌టియూ ఉపాధ్యక్షులు బి.శివశంకర్, సంఘం అధ్యక్షురాలు ఆర్.సంతోష, ప్రధాన కార్యదర్శి బి.మంజుల తదితరులతోపాటు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన ఆశాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పత్తి రైతులకు మద్దతు ధర

### అందుబాటులోకి కాటన్ కార్పొరేషన్ ప్రత్యేక యాప్

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** పత్తి రైతులకు మద్దతు ధర అందుకునేందుకు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' పేరుతో రైతుల నిమిత్తం ఈ కొత్త యాప్‌ను రూపొందించింది. కాటన్ కార్పొరేషన్ అధికారవర్గాలు వెల్లడించిన వివరాలు ప్రకారం పత్తి వేసిన రైతులు వారు పేర్లను సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా ఈ యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఈ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత ఈ యాప్‌లో ఆధార్ కార్డు, మీ భూమి రికార్డులు, పత్తి పంటకు సంబంధించిన వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా దేశవ్యాప్తంగా పత్తి రైతులు ఎందరున్నారు, వారికి వేసిన పత్తి పంట విస్తీర్ణం ఎంత అనే వివరాలు అన్నీ కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వద్ద రికార్డ్ అవుతాయి. ఈ ఏడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తిని అమ్మే సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. అప్పుడు ఏ రోజు పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లాలో యాప్ వివరాలు పంపుతుంది. ఈ పద్ధతి వల్ల పత్తిని అమ్ముకునేందుకు రైతులకు నిరీక్షణ సమస్యలు ఉండవని, ప్రధానంగా వారికి మద్దతు ధరలు దక్కుతాయని కాటన్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

### మహిళల ఆర్చరీ వరల్డ్ టోర్నీ..

# ప్రపంచ ఛాంపియన్‌గా శార్వరి



**న్యూఢిల్లీ:** వరల్డ్ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో భారత్‌కు చెందిన శార్వరి షెండే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. కెనడాలోని విన్నిపెగ్‌లో సోమవారం జరిగిన అండర్ 18 మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంగా శార్వరి బంగారు పతకాన్ని గెలుచుకుంది. దక్షిణ కొరియాకు చెందిన కిమ్ యెవాన్‌తో తీవ్రంగా పోరాడిన శార్వరి ఫైనల్లో 6-5 తేడాతో గట్టి పోటీని ఎదుర్కొని ఛాంపియన్‌షిప్ సాధించింది. 16 ఏళ్ల శార్వరి మొదటి మూడు సెట్లలో రెండింటిని గెలుచుకుని, మరొక సెట్‌ను సమం చేసి ఫైనల్‌లో 41-తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, కిమ్ తరువాతి రెండింటినీ గెలిచి స్కోర్‌లను సమం చేయడానికి మరియు షూట్‌ఆఫ్ చేయడానికి పోరాడింది. దక్షి ణ కొరియా ఆర్చర్ షూట్‌ఆఫ్‌లో తడబడి తొమ్మిది పరుగులు చేసింది. అయితే శార్వరి మ్యాచ్‌ను ముగించాల్సి న ఒత్తిడితో అద్భుత ప్రదర్శన చేసి 10 పరుగులు చేసి ఉత్కంఠభరితమైన ఫైనల్‌ను గెలుచుకుంది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న 2025 ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకున్న రెండవ భారతీయ మహిళగా శార్వరి గుర్తింపు పొందింది. అంతకు ముందు రోజు తనపర్తి చికిత అండర్ 21 విభాగంలో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత స్వర్ణాన్ని గెలుచుకుంది.

### బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో..

# హైదరాబాద్ రెండో విజయం



**జార్ఖండ్ 2 వికెట్లు తేడాతో చిత్తు**

న్యూఢిల్లీ: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హైదరాబాద్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. జార్ఖండ్‌తో జరిగిన మూడు రోజుల మ్యాచ్‌లో భాగంగా సోమవారం హైదరాబాద్ 2 వికెట్లు తేడాతో గెలిచింది. జార్ఖండ్ నిర్దేశించిన 84 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ 22.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. స్కోరు 83 వద్ద అనికేత్ సిక్స్ కొట్టి హైదరాబాద్ విజయాన్ని ఖరారు చేశాడు. జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌట్ అయింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/75), రోహిత్ రాయుడు (4/69) రాణించారు. అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 82.4 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటై 47 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. నితీశ్ (106, 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేయగా, రాహుల్ రాధేశ్ (70, 6 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ (65, 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 47 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన జార్ఖండ్ 25.3 ఓవర్లలో 130 పరుగులకు కుప్పకూలింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/74), అనికేత్ (3/25) ఆకట్టుకున్నారు. 84 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఒక దశలో 61 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. అయితే రోహిత్ రాయుడు (31 బంతుల్లో 18 నాటౌట్, 1 సిక్స్), అనికేత్ (13 బంతుల్లో 12 నాటౌట్, 1 సిక్స్) 9 వికెట్‌కు 28 పరుగులు జోడించి హైదరాబాద్ జట్టును విజయతీరానికి చేర్చారు.

### కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ప్రీతి, ధర్మ జ్యోతి, మీరాకి స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభ రోజున భారత్ ఖాతాలో మూడు బంగారు పతకాలు జమఅయ్యాయి. భారత వెయిట్ లిఫ్టర్లు మంచి ప్రదర్శన కనబరిచి సత్తా చాటారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న 30వ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ తొలి రోజు సోమవారం భారత్ వెయిట్ లిఫ్టర్లు స్వర్ణ పతకాలను సాధించారు. మహిళల 44-48 కిలోల విభాగంలో ప్రీతిస్మిత భోయ్ స్నాచ్‌లో 63 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 87 కిలోలు ఎత్తి మొత్తం 150 కిలోలతో ముగించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ మీరాబాయి చాను స్నాచ్‌లో 84 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలు ఎత్తి మొత్తం 193 కిలోలు ఎత్తి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో మీరాబాయి చానుకి ఇది ఐదవ పతకం. ఆమె గతంలో 2013, 2017, 2019 ఎడిషన్లలో బంగారు పతకాలు, 2015లో రజతం గెలుచుకుంది. అలాగే పురుషుల 56-60 కిలోల విభాగంలో ధర్మజ్యోతి దేవఘూరియా స్నాచ్‌లో 97 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 127 మొత్తం 224 కిలోలతో ముగించి భారత్‌కు రోజులో రెండవ స్వర్ణ పతకాన్ని అందించాడు. ఒలింపిక్ పతక విజేత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను సోమవారం జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 48 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, తిరిగి పోటీలకు శ్రీకారం చుట్టింది.



### సౌతాఫ్రికా టి20 లీగ్‌కు

# భారత్ ప్లేయర్ల క్యూ

## వేలానికి 13 మంది రెడీ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా లీగ్ ఆడేందుకు భారత ఆటగాళ్లు ఆసక్తి చూపుతూ క్యూ కడుతున్నారు. సౌతాఫ్రికా టీ20 లీగ్ నాలుగో ఎడిషన్‌కు ముందు నిర్వహించనున్న వేలానికి మొత్తం 13 మంది భారత ఆటగాళ్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్, ముంబై ఇండియన్స్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా సైతం ఉన్నాడు. అంతేకాకుండా సిద్దార్థ్ కౌల్, అంకిత్ రాజ్‌పుత్‌లు సైతం వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ఢిల్లీకి చెందిన అనురీత్ సింగ్ కతూరియా, పంజాబ్‌కు చెందిన సరుల్ కన్వర్, గుజరాత్‌కు చెందిన మహేశ్ అహిర్, రాజస్థాన్‌కు చెందిన నిఖిల్ జగా, యూపీకి చెందిన ఇమ్రాన్ ఖాన్, అతుల్ యాదవ్, తమిళనాడుకు చెందిన కేఎస్ నవీన్, రాష్ట్రాల పేర్లు పొందుపరచని అన్సారీ మరూఫ్, మొహమ్మద్ ఫైద్, వెంకటేశ్ గాలిపెల్లి లు సౌతాఫ్రికా టీ20 లీగ్ 2025 వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరంతా తమ బేస్ ప్రైజ్‌ను రూ.10లక్షలుగా నిర్ణయించుకున్నారు. చావ్లా తన బేస్ ప్రైస్‌ను రూ.50లక్షలుగా నమోదు చేసుకున్నాడు. సెప్టెంబర్ 9న సౌతాఫ్రికా టీ2025 వేలం జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. మొత్తం 784 మంది ఆటగాళ్లు వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పాకిస్థాన్ నుంచి 40 మంది, ఇంగ్లాండ్ నుంచి 150 మంది ఆటగాళ్లు వేలంలో నమోదు చేసుకున్నారు. ఆరు ఫ్రాంచైజీల వద్ద 7.4 మిలియన్ల యూఎస్ డాలర్ల (భారత్ కరెన్సీ ప్రకారం 646 కోట్ల 73 లక్షల రూపాయలు) పర్స్ ఉంది.

వేలంలో ఫ్రాంఛైజీలు అన్ని కలిపి 84 మంది ఆటగాళ్లను మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. అయితే భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నిబంధనల ప్రకారం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్ల ఎవ్వరూ కూడా విదేశీ లీగుల్లో ఆడకూడదు. అంతేకాకుండా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పడంతో పాటు, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)తోనూ అనుబంధం పూర్తిగా తెంచుకోవాలి. అంటే ఒక్కసారి ఎవరైనా భారత ప్లేయర్ విదేశీ లీగ్ ఆడితే అతడు భారత జట్టుతో పాటు ఐపీఎల్ ఆడే అర్హతను కోల్పోతాడని బీసీసీఐ స్పష్టంగా పేర్కొంది. దీంతో వీరంతా భారత్ తరపున క్రికెట్ ఆడే అవకాశాన్ని కోల్పోనున్నారు.

### అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..

# మురళి, రవీనా, రోహిత్ స్వర్ణం



**న్యూఢిల్లీ:** అంతర్‌రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీశంకర్ మురళి, రోహిత్ యాదవ్, రవినా గయాక్వాడ్‌లు స్వర్ణ పతకాలు సాధించారు. జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల చివరి రోజున ఒలింపియన్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 8.06 మీటర్ల దూరం దూకి స్వర్ణం సాధించాడు. ఈ ప్రయత్నంతో, శ్రీశంకర్ ఇప్పుడు రోడ్ టు వరల్డ్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో టాప్ 36లోకి ప్రవేశించాడు, గ్లోబల్ ఈవెంట్‌కు అర్హత స్థానాన్ని సంపాదించడానికి దగ్గరగా ఉన్నాడు. ఇక పురుషుల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీలో రోహిత్ యాదవ్ 83.65 మీటర్ల వ్యక్తిగత ప్రయత్నంతో ఉత్తమ ప్రదర్శన చేయడంతో స్వర్ణం సాధించాడు. తన చివరి ప్రయత్నంలో 83.20 మీటర్లు నమోదు చేసిన సచిన్ యాదవ్‌ను ఓడించాడు. పరుగులో మహారాష్ట్రకు చెందిన రవినా గయాక్వాడ్ మహిళల 10,000 మీటర్ల పరుగును 35:09.57 సెకన్లలో గెలుచుకోవడం ద్వారా తొలి స్వర్ణం సాధించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన అంకిత మహిళల 3000 మీటర్ల పరుగును 9:44.83 సెకన్లతో దూసుకెళ్లగా, హర్యానాకు చెందిన బాల్కిషన్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకుంది. రిలేలు నాటకీయత మరియు వేగంతో సాయంత్రం ముగిసింది. మహిళల 4+400 మీటర్లలో, కర్ణాటక, పంజాబ్, తమిళనాడులను ఓడించి ముగింపును అందించింది.

**వాణిజ్యం**



# టెక్ ఎఐకి భారత్ అద్భుత మార్కెట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్ అద్భుతమైన మార్కెట్ అని మైక్రోసాఫ్ట్ ఇండియా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది లేదా ఏడాదిన్నరలో నూటికి 82 కంపెనీలు తమ ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, భారత్‌లో మాత్రం 93 శాతం కంపెనీలు ఇందుకు సిద్దంగా ఉన్నట్టు సంస్థ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ఈ గిరాకీని తట్టుకునేందుకు పెద్దసంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, అప్లికేషన్స్ ఇంజనీర్లు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ కోడింగ్‌లో 30 శాతం ఏఐ ద్వారానే రాస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో 300 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్టు తెలిపారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలను చందోక్ తోసిపుచ్చారు. కొన్ని ఉద్యోగాలు పోయినా, ఏఐ ఆర్కెస్ట్రేటర్, ఏఐ ఏజెంట్ మేనేజర్, ఏజెంట్ బాస్, ప్రాంప్ట్ ఇంజనీర్ వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏఐ నైపుణ్యాలను యువత అలవర్చుకోక తప్పదన్నారు. ట్రంప్ టారిఫల ప్రభావంపై అడిగిన ప్రశ్నకు మాత్రం చందోక్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే ఆర్థిక సంబంధాలు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. ఐదేళ్లలో భారత్‌లో కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

# గేమింగ్ పేరుతో భారీ నష్టం

## యేడాదిలో రూ.20 వేల కోట్లు నష్టపోయిన 45 కోట్ల ఇండియన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ విపరీతంగా పెరిగిపోయింది. ఇదే సమయంలో గేమింగ్ గురించి షాకింగ్ నివేదిక వెలుగులోకి వచ్చింది. దాదాపు 45 కోట్ల మంది భారతీయులు ఏటా రూ.20 లక్షల కోట్లు రియల్ మనీ గేమ్స్ ద్వారా పోగొట్టుకుంటున్నారని ప్రభుత్వం అంచనా వేసింది. గేమ్ ఆడితే టైమ్ పాస్ అవుతుందని చాలా మంది యువత రియల్ మనీ గేమ్స్ ఆడారు. కానీ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, వాస్తవంగా ఇదొక ఫైనాన్షియల్ ట్రాప్ అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇటీవల గవర్నమెంట్ అంచనాల ప్రకారం, దేశంలో దాదాపు 45 కోట్ల మంది భారతీయులు రియల్ మనీ గేమింగ్ ద్వారా ఏడాదికి రూ.20 వేల కోట్లు నష్టపోయారు. ఈ భారీ నష్టాలు వాటి వెనక ఉన్న విషాద సంఘటనలు చూసిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2025లో ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ చట్టంగా మారింది. ఈ చట్టం హానికరమైన రియల్‌మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ, ఇ-స్పోర్ట్స్, విద్య పరమైన గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహిస్తోంది. లక్ష్యం ఏంటంటే, కుటుంబాలను ఆర్థిక సంక్షోభం, బానిసత్వం నుంచి కాపాడడం, అదే సమయంలో గేమింగ్ రంగంలో ఉద్యోగాలు, పెట్టుబడులు, గ్లోబల్ ఇ-స్పోర్ట్స్ మ్యాప్‌లో భారత్‌ను నిలబెట్టడం.కాగా, ఈ గేమింగ్ నష్టాల వెనక యువత అప్పుల్లో కూరుకుపోవడం, కుటుంబాలు నాశనం కావడం, కొన్ని చోట్ల ఆత్మహత్యలు కూడా జరిగాయి. కర్ణాటకలో గత మూడేళ్లలో 18 మంది ఆన్‌లైన్ మనీ గేమ్స్ వల్ల ఆత్మహత్య చేసుకున్నారు. మైసూరులో ఒక కుటుంబం రూ.80 లక్షలు పోగొట్టుకుని ముగ్గురూ ఆత్మహత్య చేసుకున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్‌లలోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. ఈ సమస్య ఎంత విస్తృతంగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అయితే, గేమింగ్ రంగంలో అంతా చెడు కాదు. ఇ-స్పోర్ట్స్ ఒక అద్భుతమైన అవకాశంగా మారుతోంది. ఇప్పటికే ఈ రంగం 1.5 లక్షల డైరెక్ట్ ఉద్యోగాలను సృష్టించింది. 2030 నాటికి ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని అంచనా. ప్రతి డైరెక్ట్ ఉద్యోగానికి, లాజిస్టిక్స్, కంటెంట్, ఎనలిటిక్స్‌లో మరో రెండు మూడు ఉద్యోగాలు వస్తున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, దాదాపు 40 గేమర్స్ టైర్2, టైర్3 నగరాల నుంచి వస్తున్నారు. అంటే, గేమింగ్ అవకాశాలు మెట్రోలకు మాత్రమే పరిమితం కాకుండా, చిన్న పట్టణాలకూ విస్తరిస్తున్నాయి. ఈ కొత్త చట్టం గ్యాంబ్లింగ్ రకం మనీ గేమ్స్‌ను, నిజమైన స్కిల్-బేస్డ్ ఇ-స్పోర్ట్స్‌ను స్పష్టంగా వేరు చేస్తుంది. ఈ చట్టం రూపొందించడానికి ప్రభుత్వం మంత్రిత్వ శాఖలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, బ్యాంకులు, తల్లిదండ్రులు, గేమింగ్ ఇండస్ట్రీతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపింది. ఈ చట్టం హానికరమైన గేమ్స్‌ను నియంత్రిస్తూ, నిజమైన గేమింగ్ ఔత్సాహికులకు మద్దతు ఇస్తుంది.





### ఫార్మా ఎగుమతుల్లో

# 5శాతం వృద్ధి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత్ నుంచి 757 కోట్ల డాలర్ల (సుమారు రూ.65,860 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5.21 శాతం ఎక్కువగా నమోదైంది. ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ విభాగాలు ఎగుమతులు పెరిగేందుకు బాగా దోహదం చేశాయి. కాగా ఇదే కాలంలో విదేశాల నుంచి మన దేశానికి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు 4.21 శాతం పెరిగి 78.6 కోట్ల డాలర్లకు చేరినట్టు ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి చెప్పారు. జూన్ త్రైమాసికంలో భారత్‌కు దిగుమతైన ఫార్మా ఉత్పత్తుల్లో 46 శాతం బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియరీలు ఉన్నాయి. అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి, టారిఫ్ సమస్యలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా త్రైమాసికాల్లోనూ ఎగుమతుల వృద్ధి రేటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో భారత్ నుంచి 3,047 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.39 శాతం ఎక్కువగా నమోదైంది.

# లాభాలతో ముగిసిన సూచీలు

## సెన్సెక్స్ 300 పాయింట్లు జంప్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, ఐటీ షేర్లపై మదుపర్ల ఆసక్తి కారణంగా దేశీయ సూచీలు లాభాలను ఆర్జించాయి. అయితే బ్యాంకింగ్ రంగం మాత్రం స్వల్ప నష్టాలను నమోదు చేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత ఉంటుందని అంచనాలు వెలువడడం సూచీలకు సానుకూలంగా మారింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి గత శుక్రవారం ముగింపు (81, 306)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 200 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు ఎగబాకి 81, 799 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే చివర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో చివరకు సెన్సెక్స్ 329 పాయింట్ల లాభంతో 81, 635 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 97 పాయింట్ల లాభంతో 24, 9673 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో వొడాఫోన్ ఐడియా, జుబిలెంట్ ఫుడ్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, జైడస్ లైఫ్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఏంజెల్ వన్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, సీడీఎస్ఎల్, ఫోర్టిస్ హెల్త్, మ్యాన్‌కైండ్ ఫార్మా షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 71 పాయింట్లు ఆర్జించింది. బ్యాంక్ నిఫ్టీ 10 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ రూ.87.58గా ఉంది.




# 19 నుంచి విజయవాడలో నారెడ్కో ప్రాపర్టీ ఫెస్టివల్

## 60కి పైగా హౌసింగ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొంటున్న మెగాషో

**విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నారెడ్కో సెంట్రల్ జోన్ 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌ను విజయవాడసి ఏ కన్వెన్షన్‌లో సెప్టెంబర్ 19 నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. సోమవారం నగరంలోని మాలక్ష్మి ఛాంబర్స్‌లో నిర్వహించిన మీడియాకు సమావేశంలో వివరాలను ప్రకటించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో గృహ కొనుగోలుదారులు, స్థిరాస్తి వ్యాపార రంగానికి చెందిన వారికి సంయుక్త వేదికగా నిలవనుంది. ఈ ఫెస్టివల్‌లో 60కుపైగా ఎగ్జిబిటర్స్ పాల్గొనబోతున్నారు. వీరిలో విశ్వసనీయ రియల్ ఎస్టేట్ డెవలపర్లు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్ బ్రాండ్లు, ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెంట్లు, బ్యాంకులు ఇతర అనుబంధ సేవల విభాగాలు ఉంటాయి. ఈ ఎక్స్‌పో ద్వారా విజయవాడ, ప్రజా రాజధాని అమరావతి పరిసర ప్రాంత ప్రజలు తమ బడ్జెట్‌కు అనుగుణంగా అన్ని రకాల ఆమోదం పొందిన రెసిడెన్షియల్ ప్రాజెక్టులను సరిచూసుకుని ఎంచుకునే అవకాశం ఉంది. బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ భాగస్వాములతో నేరుగా చర్చించి తక్షణ సలహాలు పొందవచ్చు. ఇంటీరియర్ సొల్యూషన్స్, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉండనుండగా, నగర వాసులు తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా నారెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ మాట్లాడుతూ నారెడ్కో 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ ద్వారా పారదర్శకత, ప్రాక్టికల్ ఫైనాన్స్ సపోర్ట్ ఆలంబనగా గృహ కొనుగోలుదారులను క్రమబద్ధమైన మార్గదర్శకత్వం అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. విశ్వసనీయ డెవలపర్లు, స్పష్టమైన ప్రాజెక్ట్ ఆప్షన్లు, తక్షణ ఫైనాన్షియల్ సహాయం అన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకురావటం ప్రాపర్టీ షో ప్రత్యేకత అన్నారు. విజయవాడఅమరావతి రియల్ ఎస్టేట్ రంగం తదుపరి వృద్ధి దశలోకి అడుగిడుతోందని, ప్రజలు ధైర్యంగా, తగిన సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఇది సరైన సమయం అని సందీప్ మండవ పేర్కొన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పాలసీ స్పష్టత, మౌలిక వసతుల అభివృద్ధి తద్వారా ప్రాజెక్టుల సమయానుకూల నిర్మాణంతో కొనుగోలుదారుల నమ్మకానికి అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. టైటిల్ స్పాన్సర్ ఎస్ఎల్‌వి డెవలపర్స్ ఛైర్మన్ పెన్మత్స శ్రీనివాస రాజు మాట్లాడుతూ హోమ్ బయ్యర్స్‌కు నేరుగా సేవలందించే ఈ ఈవెంట్‌లో భాగస్వామ్యం కావటం గర్వంగా ఉందని, మా ప్రీమియమ్ కమ్యూనిటీలను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించి, ప్రత్యేక మార్గదర్శకతను అందిస్తామని తెలిపారు. నారెడ్కో సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరి ప్రసాద్ వేదిక వద్ద ఉండే వినియోగదారులకు అందుబాటులో ఉండే సౌకర్యాలను వివరించారు. ఇందులో ప్రాజెక్ట్ జోన్లు, బ్యాంకులు, ఫైనాన్షియర్ డెస్క్‌లు, ఇంటీరియర్స్ ఎగ్జిబిషన్, కొనుగోలుదారుల సలహా కౌంటర్లు, రిజిస్ట్రేషన్ వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. ప్రాపర్టీ షోకు ఉచిత ప్రవేశం కల్పించామని, కన్వెన్షన్ వద్ద తక్షణ రిజిస్ట్రేషన్ సదుపాయం అందుబాటులో ఉందని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో నారెడ్కో రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14